



ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM సిటీ


రైల్వే ఉద్యోగులకు దసరా బోనస్ **07**

నిరసన చేస్తున్న విద్యార్థులకు అడ్డు రావద్దు

వారు దేశానికి గొంతుక : మోదీకి రాహుల్ హెచ్చరిక


సంపుటి 29, సంచిక: 116 | గురువారం | 15-10-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00





## మంచి పాలసీతో ఎవరొచ్చినా ప్రోత్సాహం

- కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు
- పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ఓ భరోసా
- మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పలు పథకాలు అమలు చేస్తున్నాం
- 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్– 2026' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ఓ భరోసా అని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ పాలసీతో అనుకూలమైన విధానాలను అనుసరిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదని మంచి పాలసీతో ఎవరు వచ్చినా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ఏ దేశ ఆర్థిక వ్యవస్థ బలపడ్డా అందులో మహిళల భాగస్వామ్యం ఉన్న దేశమే అత్యధికంగా ఆర్థికంగా ఎదిగిన దేశమని రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.'సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్' (ఎస్‌సిసి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్– 2026' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ముఖ్యమంత్రి హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణంరాజు, ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా యువత, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. 'తెలంగాణ రైజింగ్– 2047'లో నిర్దేశించిన ప్రణాళికలోని పెరి అర్బన్ రీజియన్‌లో స్టార్టప్‌లు, తరువాయి 8లో

పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా **10**

# 5 రోజులు

## సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు జ్యుడీషియల్ కస్టడీ

### తీహార్ జైలుకు తరలింపు



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెల్లవారుజామున, సిజెపి నాయకులు మరో 11 మంది కార్యకర్తలతో కలిసి బారికేడ్లను ఛేదించుకుని జంతర్ మంతర్ ప్రాంతంలోకి ప్రవేశించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ నేపథ్యంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే బుధవారం సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఆయన వారికి ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించినట్లు పోలీసులు తెలిపారు. నిరసన ప్రదేశం కాని ప్రైవేట్ ఆస్తి అయిన జంతర్ మంతర్‌లో చొరబడటం, శాంతిభద్రతలను కాపాడతామని హామీ ఇచ్చిన బాండ్లను ఉల్లంఘించడం వంటి ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నారు. కాగా, వారి సహచరుడు అజింక్య షిండేను ఆరు నెలల పాటు శాంతిభద్రతలు, సత్ప్రవర్తన పాటిస్తామనే హామీ పత్రం, రూ. 5,000 పూచీకత్తుపై విడుదల చేసినట్లు వారు తెలిపారు. వారు పదేపదే చట్టాన్ని ఉల్లంఘించడం, బెయిల్‌పై విడుదల చేస్తే మళ్లీ చట్టాన్ని ఉల్లంఘించి ఇతరులను రెచ్చగొడతారనే తీవ్ర అనుమానాలను పరిగణనలోకి తీసుకుని దాస్, రంకాలను ఐదు రోజుల పాటు తీహార్ జైలుకు పంపినట్లు పోలీసులు వెల్లడించారు. శనివారం కూడా తరువాయి 12లో

## నిరసన హక్కు అణచివేత

జెజెపి నేతల జ్యుడీషియల్ కస్టడీని ముక్తకంఠంతో ఖండించిన ప్రతిపక్ష పార్టీలు



ఢిల్లీలోని జంతర్ మంతర్‌లోకి ప్రవేశించినందుకు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను అరెస్టు చేసి, ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడాన్ని ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అణచివేస్తోందని పలువురు నాయకులు ఆరోపించారు. తక్షణమే సిజెపి నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'సర్'లో అవకతవకలు తరువాయి 8లో

## వేధింపులకు పాల్పడడమే : డి.రాజా



సౌరవ్ దాస్, రంకాలను నిర్బంధించడం, జ్యుడీషియల్ కస్టడీలోకి తీసుకోవడం అప్రజాస్వామికమని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి. రాజా అభివర్ణించారు. ఇటీవల వరకు నిరసన ప్రదేశంగా కేటాయించిన చోటకి చొరబడ్డారనే ఆరోపణలపై వారిని రిమాండ్‌కు పంపడం వేధింపులకు పాల్పడటమేనని ఆయన అన్నారు. 'ప్రజా ఆగ్రహానికి భయపడి, ప్రభుత్వం నిరసనలను అణచివేసి, అసమ్మతిని అణచివేయాలని చూస్తోంది. అప్రజాస్వామిక వ్యవస్థకు వ్యతిరేకంగా నిరసన తరువాయి 8లో

## దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ

- మోదీ సర్కార్‌పై సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే మండిపాటు
- ఆ పనిని అధికారికంగా చేయాలని డిమాండ్
- జంతర్‌మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు మా నేతలను అరెస్టు చేస్తారా అని నిలదీత



**నాగ్‌పూర్ :** నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలో 'అనధికారిక అత్యవస్థ పరిస్థితి'ని విధిస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలపై ఇదరు సిజెపి నాయకులను అరెస్టు చేసి ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో అభిజీత్ దీప్కే విలేకరులతో మాట్లాడారు. జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా సిజెపి నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా చేసిన నేరం ఏమిటని దీప్కే ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ, బారికేడ్లను దాటి అనుమతి లేకుండా జంతర్ మంతర్ ప్రాంతంలోకి ప్రవేశించారనే తరువాయి 8లో

## నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోత షురూ

- రెండు బాహుబలి మోటార్లను ప్రారంభించిన మంత్రి జూపల్లి
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని మండిపాటు
- పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో కీలక ఘట్టం





ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, రైతాంగానికి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, రాజకీయ లబ్ధి కోసం బిఆర్‌ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని పర్యాటక,సాంస్కృతిక,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారని, ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే దీన్ని జాతికి అంకితం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్, ఇతర పనులను తరువాయి 8లో

నీటి పంపకాలపై సిఎం జోక్యం చేసుకోవాలి **03**

నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి: మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి




## ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణకు మిలిటెంట్ పోరాటాలు



- ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ నేతల హెచ్చరిక
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముట్టడి, తోపులాట, అరెస్టులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాస్వామ్య పరిరక్షకులైన మోదీ, షా, జ్ఞానేశ్ ఓటు చోరీతో దేశద్రోహ చర్యలకు పాల్పడ్డారని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మర్రి శ్రీమాన్, నేర్లేకంటి శ్రీకాంత్ ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేసి, సిఇసి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే అభిశంసించలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణకై మిలిటెంట్ పోరాటాలు తప్పవని హెచ్చరించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) సంయుక్తాధ్వర్యంలో బుధవారం లిబర్టీ నుండి బిఆర్‌కె భవన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ శ్రేణులు జెండాలు, ప్లకార్డులు చేతబూని సర్‌ను తక్షణమే రద్దు చేయాలి, 'జ్ఞానీ చోర్', ఓటు చోరీపై మోదీ జవాబు చెప్పాలి, 'ఓట్ల దొంగ, పదవి నుంచి తప్పుకో', 'జ్ఞానేశ్ కుమార్, దిగిపో' అని నినాదాలు తరువాయి 12లో

## ప్రజాసమస్యలపై గళమెత్తేందుకు దసరా తర్వాత భారీ మార్చ్

- కాంగ్రెస్ అధిష్టానం సూచనలతో బహిరంగ సభ నిర్వహణకు కసరత్తు
- టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలాన్ని చాటడంతో పాటు ప్రజా సమస్యలపై గళమెత్తేందుకు దసరా పండుగ తర్వాత రెండు లక్షల మందితో 'భారీ మార్చ్'ను బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ రెడ్డి గౌడ్ వెల్లడించారు. ఈ సభ నిర్వహణపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ సూచనలు చేసినట్లు తెలిపారు. దక్షిణాదిలోని రెండు రాష్ట్రాల్లో భారీ సభలు నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఈ నెల 23న ఎంసిహెచ్‌ఆర్‌డిలో పట్టభద్రుల ఎన్నికలపై సమావేశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై విమర్శలు చేస్తూ, ఆయన చేసిన తప్పిదాలకు సంబంధించిన ఆధారాలు బయటపడుతున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. 2029 ఎన్నికల్లో ఎవరు ఓడిపోతారో ప్రజలే చెబుతున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశం ప్రమాదకర పరిస్థితుల్లోకి తరువాయి 8లో

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో రాజకీయ వివక్ష లేదు

- ప్రతి నియోజకవర్గాన్నీ సమానంగా చూస్తున్నా
- అర్హులైన వారందరికీ ఇళ్లు ఇస్తున్నాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి

రాజకీయ వివక్ష లేకుండా డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు కేటాయిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూం ఇళ్లు పరిమితమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల మధ్య తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు అన్న విషయంతో ఏ మాత్రం సంబంధం లేకుండా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో కొనసాగే ఈ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా ప్రణాళికలు తరువాయి 8లో

ఎపి మాజీ సిఎం జగన్ అక్రమాస్తుల కేసులు

## ఇక రోజువారీ విచారణ

పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఇడి ఛార్జిషీట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సిబిఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సిబిఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
15-10-2026
www.prajapaksham.in


# నిరసన గొంతుపై ఉక్కుపాదం!

ప్రజాస్వామ్యంలో ఓటు ప్రజల అధికారం. నిరసన ప్రజల గొంతు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల హక్కు. ఈ మూడింటిలో ఏ ఒక్కదానికైనా ముప్పు ఏర్పడితే అది కేవలం ఒక రాజకీయ పార్టీకి, ఒక ఉద్యమానికి సంబంధించిన సమస్య కాదు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాలు. ప్రస్తుతం దేశంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్, ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడం, ప్రత్యామ్నాయ నిరసన స్థలమైన రామ్‌లీలా మైదానం పరిసరాల్లో ముఖ గుర్తింపు సాంకేతికతతో కూడిన సిసి కెమెరాల ఏర్పాటు ప్రతిపాదనలు, ఉద్యమకారుల అరెస్టులు.. వంటి పరిణామాలు వేరువేరుగా కనిపించినా, 'ప్రజల అసమ్మతిని ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతవరకు సహించగలుగుతోంది?' అనే ప్రశ్నను తెరపైకి తెస్తున్నది. ఓటు చోరీ జరిగిందన్నది ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ. ఆ ఆరోపణలపై తుది నిర్ధారణ జరగాల్సి ఉంది. అయితే ఆరోపణ లు చేయడం, వాటిపై విచారణ కోరడం, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన రాజకీయ హక్కులు. ఓటరు జాబితాల్లో పేర్ల తొలగింపు, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత వంటి అంశాలపై ప్రతిపక్షాలు, పౌరసంఘాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నప్పుడు ఎన్నికల సంఘం వాటికి స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించకూడదు. ఆరోపణల అణచివేత కాదు.. నిష్పాక్షికమైన విచారణ అవసరం. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామాను కోరుతూ సాగుతున్న ఉద్యమానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించడం ప్రజాస్వామ్య సంప్రదాయం. అదే సమయంలో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని అనుమానం కలిగితే వాటిని ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్య హితమే. ఈ రెండు సూత్రాల మధ్య సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థపై ఉంది. జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిర్వహించిన మొదటి ఉద్యమం సఫలమై, నాటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో, ఇప్పుడు అక్కడ జరుగుతున్న మరో ఉద్యమం కేంద్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్టు కనిపిస్తున్నది.

జంతర్‌మంతర్‌ను నిరసన స్థలం కాదంటూ ఆదేశాలు జారీ చేయడం, ఇద్దరు సిజెపి నాయకులను అరెస్టు చేయడం ఇందుకు నిదర్శనాలు. వాస్తవానికి ఢిల్లీలోని జంతర్ మంతర్ దశాబ్దాలుగా ప్రజా ఆందోళనలకు ప్రతీకగా నిలిచింది. కార్మికుల సమస్యల నుంచి విద్యార్థుల ఉద్యమాల వరకు, పౌరసత్వ చట్టాలకు వ్యతిరేక నిరసనల నుంచి మహిళా రెజ్లర్ల న్యాయపోరాటం వరకు ఎన్నో ఉద్యమాలకు వేదికైంది. అక్కడికి వచ్చిన ప్రతి నిరసనకారుడి డిమాండ్ న్యాయమైనదేనని చెప్పలేం. కానీ తన సమస్యను దేశం దృష్టికి తీసుకురావడానికి ఒక పౌరుడికి అందుబాటులో ఉండే వేదికగా జంతర్ మంతర్‌ది ప్రత్యేక స్థానం. అలాంటి ప్రదేశాన్ని నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించి, రామ్‌లీల మైదానం, బురారీ మైదానం, షహదరాలోని సిబిడి మైదానం వంటి ప్రత్యామ్నాయాలను సూచించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పోలీసుల వాదన ప్రకారం, ఈ నిర్ణయం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసుల ఆధారంగా తీసుకున్నది. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల రాకపోకలు వంటి అంశాలను విస్మరించలేం. అయితే వాటి పేరుతో నిరసనకారులను ప్రజలకు, మీడియాకు, అధికార కేంద్రాలకు దూరంగా నెట్టివేయడం సమంజసమా అన్నది అసలు ప్రశ్న. జంతర్ మంతర్‌కు ప్రత్యామ్నాయంగా ఒక మైదానాన్ని ప్రకటించడం మాత్రమే సరిపోదు. అక్కడికి ప్రజలు సులభంగా చేరుకోగలరా? నిరసనకు అవసరమైన అనుమతులు సకాలంలో లభిస్తాయా? స్థలం అందుబాటులో ఉందా? దాని వినియోగానికి విధించే ఖర్చులు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయా? అక్కడి పరిస్థితులు శాంతియుత నిరసనకు అనుకూలంగా ఉన్నాయా? వంటి అనేక ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం. భారత రాజ్యాంగంలోని 19(1)(బి) అధికరణం శాంతియుతంగా, నిరాయుధంగా సమావేశమయ్యే హక్కును పౌరులకు కల్పిస్తుంది. ప్రజా శాంతి వంటి కారణాలతో చట్టబద్ధమైన, సమంజసమైన పరిమితులు విధించవచ్చు. కానీ పరిమితులు విధించే అధికారం ఉందన్న కారణంతో నిరసన అవకాశాన్నే దాదాపుగా తొలగించడం సమర్థనీయం కాదు. సుప్రీంకోర్టు గతంలోనూ శాంతియుత నిరసన హక్కు, ప్రజా ప్రయోజనాల మధ్య సమతుల్యత అవసరమని స్పష్టం చేసింది. కాగా, రామ్‌లీలా మైదానం పరిసరాల్లో ప్రతిపాదిత సిసి కెమెరాల ఏర్పాటు. అందుబాటులో ఉన్న టెండర్ పత్రాల ప్రకారం, ఢిల్లీ పోలీసు విభాగం సుమారు రూ.15.66 కోట్ల విలువైన 338 కెమెరాల కొనుగోలుకు బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించిన విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది.ఈ ప్రతిపాదనలో ముఖ గుర్తింపు సాంకేతికత, జనసమూహాల గుర్తింపు, వాహన నంబర్ ప్లేట్ల పఠనం వంటి సామర్థ్యాలు ఉన్నాయి. రామ్ లీలా మైదానం ప్రవేశద్వారాలు, ఢిల్లీ గేట్, తుర్క్‌మన్ గేట్ తదితర ప్రాంతాలు కెమెరాల ప్రతిపాదిత జాబితాలో ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. జంతర్ మంతర్‌ను కాదని, రామ్‌లీలాకు 'నిరసన'ను మార్చడం వెనుక కుట్ర కోణం లేకపోలేదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే, జంతర్‌మంతర్ వద్ద నిరసనలకే సిజెపి ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే ఆ పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను పోలీసులు అదుపులోకి తీసుకుని జ్యుడిషియల్ కస్టడీకి తరలించడం పాలకుల ఆంతర్యాన్ని స్పష్టం చేస్తున్నది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసే అవకాశం పూర్తిగా మూసుకుపోయిన పరిస్థితిలో, ప్రత్యామ్నాయంగా ఏ మార్గాన్ని పౌరులు ఎంచుకోవాలి? నిరసనకారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవచ్చు. కానీ ప్రతి అసమ్మతినీ శాంతి భద్రతల సమస్యగా పరిగణించి, అరెస్టులు, నిర్బంధాలతో విరుచుకుపడితే ప్రజల్లో భయం పెరుగుతుంది.

సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దీనిని 'అనధికారిక అత్యవసర పరిస్థితి'గా అభివర్ణించడం ఎంతైనా సమర్థనీయం. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హరించడానికి జరుగుతున్న చర్యలను అడ్డుకునే ప్రయత్నాలపై ఉక్కుపాదం సరికాదు. ఎందుకంటే, ప్రజాస్వామ్యం ఎన్నికలు నిర్వహించడంతోనే సురక్షితంగా ఉండదు. ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, స్వతంత్ర మీడియా, న్యాయపరమైన రక్షణ, శాంతియుత నిరసనలకు అవకాశం కూడా అంతే అవసరం. విమర్శకులను ప్రభుత్వాలు శత్రువులుగా చూడకూడదు. ఎన్నికల ప్రక్రియపై వచ్చిన ఆరోపణలకు విశ్వసనీయమైన సమాధానాలు ఇవ్వాలి. ఓటును ప్రశ్నించినందుకు పౌరుడిని అనుమానితుడిగా చూడటం, నిరసనకు స్థలం అడిగినందుకు చట్టవ్యతిరేకిగా చిత్రించడం, తన ముఖాన్ని ప్రభుత్వ కెమెరా గుర్తిస్తుందేమోనని భయపడే పరిస్థితిని సృష్టించడం వంటి చర్య ఏ ప్రజాస్వామ్యానికీ శుభసూచకాలు కావు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగినప్పుడే ప్రభుత్వానికి నిజమైన ఆత్మవిశ్వాసం ఉంటుంది. ప్రజల గొంతును వినడానికి సిద్ధంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా నిలుస్తుంది. ●



## వివాదాల్లో ఇసిఐ

'భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) మునుపెన్నడూ లేనివిధంగా వివాదాల్లో చిక్కుకున్నది. ఓటు హక్కును కాపాడుకోవటానికి ఇదివరకు ఎన్నడూ ఇంతగా ప్రజలు ఆందోళనకు గురి కాలేదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నది. ఎన్నికల సంఘంపై విశ్వాసరాహిత్యం ఏర్పడటం దురదృష్టకరం. ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఎన్నికల ప్రజాస్వామ్యానికి తటస్థంగా వ్యవహరించే 'అంపైర్' అవసరం. ఎన్నికల సంఘంలోని కమిషనర్లు ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకున్నారా? లేదా? అన్నది సమావేశ మినిట్స్ అందుబాటులో లేకపోతే బాహ్య ప్రపంచానికి ఎలా తెలుస్తాయి?.'సర్' కసరత్తు సహా ఇతర అంశాలపై ప్రజలకు చాలా సందేహాలు ఉన్నాయి. ఈ విషయంలో సాధికారికమైన వివరణ ఎన్నికల సంఘం నుంచి ఇప్పటికీ రాలేదు'.

– ఇసి మాజీ కమిషనర్
అశోక్ లావాసా



## మానవాళికి అన్నం పెడుతున్న గ్రామీణ మహిళా రైతులు

లింగ సమానత్వాన్ని సాధించడంతో పాటు మహిళలకు సాధికారత కల్పించడం అనేది కేవలం ముఖ్యమైనదే కాకుండా, తీవ్ర పేదరికం, ఆకలి, వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఒక కీలకమైన అంశం కూడా అని తెలుసుకోవాలి. పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణలో పనిచేస్తూనే, ప్రపంచ ఆహార ఉత్పత్తిలో సగం వరకు మహిళలే బాధ్యత వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతా ల్లోని మహిళలు, బాలికలు బహుముఖ పేదరికంతో అసమానతల విష వలయంలో చిక్కుకొని బాధపడుతున్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఉత్పాదకత, వ్యాపార దక్షతను కలిగి ఉన్నప్పటికీ, భూమి, రుణాలు, వ్యవసాయ ఉత్పాదకాలు, మార్కెట్లు, ఉత్పాదక వనరులు, ఆస్తులు, ప్రభుత్వ సేవలు, విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదు పాయాలు, నీరు, పారిశుద్ధ్యం, వేతనం లేని కార్మిక సమస్యలు, అధిక విలువ గల వ్యవసాయ ఆహార గొలుసు వంటి వాటిని పొందడంలో తక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు, తమ పంటలకు తక్కువ ధరలను కూడా పొందుతున్నారు.

**అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం—2026:**

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిని పెంపొందించడంలో గ్రామీణ మహిళల ప్రాముఖ్యతను గుర్తించిన ఐక్యరాజ్యసమితి 2007లో అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించి, ప్రతి ఏటా అక్టోబర్ 15న గ్రామీణ మహిళల పాత్రను వేడుకగా జరుపుకుంటుంది, సముచితంగా గౌరవిస్తుంది. 'గ్రామీణ' అనే పదానికి సౌకర్యాలు, మానవ హక్కులు పరిమితంగా లేదా అందుబాటులో లేని మారుమూల లేదా గ్రామ ప్రాంతాలు అని అర్థం చేసుకోవాలి. ఈ గ్రామీణ ప్రాంతాలలో, మహిళలు విద్య, ఆరోగ్య సంరక్షణ, లింగఆధారిత హింస, వివక్ష, చట్టపరమైన హక్కులు, గౌరవప్రదమైన ఉపాధి హక్కులతో సహా వివిధ సవాళ్లను ఎదుర్కొంటారు. వ్యవసాయంతో పాటు గ్రామీణాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం, ఆహార భద్రతను పెంచడం, గ్రామీణ పేదరికాన్ని నిర్మూలించడం, గిరిజన మహిళలతో సహా గ్రామీణ మహిళల ముఖ్యమైన పాత్రను గుర్తించడం, పలురకాల అవగాహన కల్పించడం లాంటివి ఈ రోజు లక్ష్యాలు అని తెలుసుకోవాలి. గ్రామీణ మహిళలు పౌర సమాజాలకు అన్నం పెడుతూ, జీవనోపాధిని నిలబెడుతూ, మనమందరం ఆధారపడే సహజ వనరులను కాపాడుతున్నారు. ఈ రోజున, మరింత సుస్థిర భవిష్యత్తును నిర్మించడంలో వారి జ్ఞానాన్ని, నాయకత్వాన్ని మనం ఆహ్వానిద్దాం.

**(అక్టోబర్ 15న అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా)**

## రూ.వెయ్యి కోట్ల హామీ ఎక్కడ?

# ఉస్మానియా కోసం మాటలు కాదు.. నిధులు కావాలి



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రత్యేక స్థానం ఉంది. ఎన్నో తరాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంతో పాటు, వేలాదిమంది యువతకు ఉద్యోగ, పరిశోధన, ప్రజాసేవ రంగా ల్లో భవిష్యత్తుకు బాటలు వేసిన విద్యాసంస్థగా ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తింపు పొందింది. తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక సామాజిక, రాజకీయ పరిణామాలకు ఈ విశ్వవిద్యాలయం వేదికగా నిలిచింది. అలాంటి చారిత్రక విశ్వవిద్యాలయం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు, సిబ్బంది కొరత, అధ్యాపకుల ఖాళీలతో సతమతమవుతోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

విశ్వవిద్యాలయంలో అనేక విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతోందని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పరిశోధనా విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించాల్సిన అధ్యాపకులు తగిన సంఖ్యలో లేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. అధ్యాపకుల కొరతను భర్తీ చేయకుండా తాత్కాలిక ఏర్పాట్లతో విద్యా కార్యక్రమాలను కొనసాగించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

అదే సమయంలో విశ్వవిద్యాలయానికి అవసరమైన నిధుల విషయంలో కూడా ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భవనాల నిర్వహణ, ప్రయోగశాలలు, గ్రంథాలయం, హాస్టళ్లు, పరిశోధనా సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమం వంటి అనేక అంశాలకు నిధులు అవసరం. నిధుల కొరత కారణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి మందగిస్తే, దేశంలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పోటీ పడే సామర్థ్యంపై ప్రభావం పడుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఉస్మానియా యూనివర్సిటీ అంటే హైదరాబాద్‌లో ఉన్న ఒక ఉన్నత విద్యాసంస్థ మాత్రమే కాదు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చరిత్రతో విడదీయరాని అనుబంధం కలిగిన విద్యాలయం. తరతరాల విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంతోపాటు, తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య ఆకాంక్షల కోసం సాగిన అనేక ఉద్యమాలకు ఈ విశ్వవిద్యాలయం వేదికగా నిలిచింది. ఇక్కడి తరగతి గదులు కేవలం పాఠా లు చెప్పలేదు, సమాజాన్ని ప్రశ్నించే తరాలను తయారు చేశాయి. అలాంటి ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధి విషయంలో ప్రభుత్వాల హామీలు పదేపదే వినిపించడం, ఆ హామీల అమలు మాత్రం ప్రశ్నార్థకంగా మిగలడం ఆందోళన కలిగించే పరిణామం.

2025 డిసెంబర్ 10న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.1,000 కోట్ల నిధులు కేటాయించి, అంతర్జాతీయ ప్రమాణాలతో, స్టాన్‌ఫోర్డ్ స్థాయి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ముఖ్యమంత్రి స్థాయిలో వెలువడిన ఈ ప్రకటన సహజంగానే విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, పూర్వ విద్యార్థులు, విద్యావేత్తల్లో ఆశలు రేకెత్తించింది. దశాబ్దాలుగా పేరుకుపోయిన మౌలిక వసతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, పరిశోధనకు కొత్త ఊపు వస్తుందని, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, హాస్టళ్లు, డిజిటల్ వసతులు అందుబాటులోకి వస్తాయని ఆశించడం సహజమే.

అయితే ప్రకటనకు మించి ఇప్పటివరకు జరిగినదేమిటన్నదే అసలు ప్రశ్న. ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.1,000 కోట్లు ఎప్పుడు విడుదలవుతాయి? ఆ నిధులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చిందా? బడ్జెట్లో ఎంత మేర కేటాయించారు? నిధులను ఏయే పనులకు వినియోగించనున్నారు? పనులకు ప్రాధాన్యత క్రమం ఏమిటి? పూర్తి చేయడానికి కాల పరిమితి ఎంత? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు వెల్లడి కావలసిన అవసరం ఉంది.



హామీ ఇవ్వడం సులభం. ప్రకటన చేయడం ఇంకా సులభం. కానీ ఒక విశ్వవిద్యాలయాన్ని ప్రపంచస్థాయి విద్యాసంస్థగా తీర్చిదిద్దడం మాత్రం నిరంతర ఆర్థిక పెట్టుబడి, సమర్థవంతమైన పరిపాలన, నాణ్యమైన అధ్యాపక బృందం, పరిశోధనకు ప్రోత్సాహం, ఆధునిక ప్రయోగశాలలు, సమృద్ధమైన గ్రంథాలయాలు, విద్యార్థులకు తగిన హాస్టళ్లు, డిజిటల్ మౌలిక వసతులు, అంతర్జాతీయ విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు వంటి అనేక అంశాల సమ్మేళనం. ఒక్కసారి నిధులు ప్రకటించడం ద్వారా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయం నిర్మాణం సాధ్యం కాదు. ప్రకటనకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపు, నిధుల విడుదల, పనుల ప్రారంభం, నిర్దిష్ట కాలపట్టిక, నిరంతర పర్యవేక్షణ అవసరం.

ప్రభుత్వాలు మారుతాయి. ముఖ్యమంత్రులు మారుతారు. కానీ విశ్వవిద్యాలయాల అవసరాలు మాత్రం ప్రభుత్వాల మార్పుతో మారవు. ఉస్మానియా విషయంలో గతంలోనూ అనేక హామీలు వచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం కూడా అదే తరహాలో ప్రకటనలకు పరిమితమైతే, పాలనలో మార్పు వచ్చిందని ప్రజలు ఎలా నమ్మాలి? ప్రజాపాలన అంటే ప్రజలకు నచ్చే మాటలు చెప్పడం కాదు, ఇచ్చిన మాటను ప్రభుత్వ ఉత్తర్వుగా మార్చడం, ఆ ఉత్తర్వును నిధుల విడుదలగా మార్చడం, నిధులను అభివృద్ధి ఫలితాలుగా మార్చడం.

రూ.1,000కోట్లు పెద్ద మొత్తం. కానీ తెలంగాణ ఉన్నత విద్య భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుంటే అది భారం కాదు, పెట్టుబడి. ఒక బలమై న విశ్వవిద్యాలయం నిర్మాణం అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశాలను విస్తరించడం. పరిశోధనకు ఊతమివ్వడం. కొత్త ఆవిష్కరణలకు వేదిక కల్పించడం. రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన మానవ వనరులను తయారు చేయడం. అందువల్ల ఉస్మానియా అభివృద్ధికి కేటాయించే ప్రతి రూపాయిని భవిష్యత్తు తరాలపై పెట్టుబడిగా చూడాలి.

స్టాన్‌ఫోర్డ్ , ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల తో ఉస్మానియాను పోల్చడం గొప్ప లక్ష్యం కావచ్చు. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే ముందుగా ఉస్మానియా విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు అందాలి. అధ్యాపక ఖాళీలు భర్తీ కావాలి. పరిశోధకులకు అవసరమైన వనరులు సమకూరాలి. ప్రయోగశాలలు ఆధునికీకరించాలి. గ్రంథాలయాలు బలోపేతం కావాలి. హాస్టళ్ల పరిస్థితి మెరుగుపడాలి. విద్యా, పరిశోధనా వాతావరణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందాలి. ప్రపంచస్థాయి లక్ష్యాలకు ప్రపంచస్థాయి ఆర్థిక, పరిపాలనా కట్టుబాటు కూడా ఉండాలి.

ఇక ప్రభుత్వం చేయాల్సింది స్పష్టంగా ఉంది. రూ.1,000 కోట్ల నిధుల విషయంలో అస్పష్టతకు తెరదించాలి. నిధుల విడుదలకు నిర్దిష్ట తేదీ ప్రకటించాలి. దశలవారీగా ఎంత నిధులు విడుదల చేస్తారో వెల్లడించాలి. ఏ పనులకు ఎంత కేటాయించారో ప్రజలకు తెలియజేయాలి. ప్రతి పనికి ప్రారంభ, పూర్తి గడువులను ప్రకటించాలి. ఉస్మాని యా అభివృద్ధికి సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రజల ముందుంచాలి. ఇప్పటివరకు విశ్వవిద్యాలయానికి జరిగిన బడ్జెట్ కేటాయింపులు, విడుదలైన నిధులు, చేపట్టిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై శ్వేతపత్రం విడుదల చేస్తే మరింత పారదర్శకత నెలకొంటుంది.

# అబ్దుల్ కలాం జీవితం యువ భారతానికి దారి దీపం

'లీడ్ ఇండియా' అంటూ యువతను దేశాభివృద్ధి మహాయజ్ఞంలో పాలు పంచుకోవాలని పిలుపును ఇచ్చిన మన ప్రియతమ ఎ.పి.జె. అబ్దుల్ కలాం భరతమాత ముద్దు బిడ్డగా జాతి గౌరవాన్ని అంతర్జాతీయ వేదికల మీద చాటి చెప్పి అనన్య సామాన్యుడు, మేరునగ ధీరుడు, అనితరసాధ్య ఘనుడు. భారత 11వ రాష్ట్రపతిగా (2002–07) విశిష్ట సేవలందించి 'పీపుల్స్ ప్రెసిడెంట్'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసిన అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 15 అక్టోబర్ 1931న ప్రముఖ దక్షిణ భారత తీర్థ స్థలం రామేశ్వరం పట్టణంలో పేద తమిళ ముస్లిమ్ కుటుంబంలో ఆశియమ్మ జైనులబ్దీన్ దంపతులకు జన్మించారు. రామేశ్వరంలో పాఠశాల విద్య, తిరుచురాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో భౌతిక శాస్త్రం (1954), మద్రాస్ ఎంఐటిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ (1960) పట్టాలు పొందారు.

**మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా:**

అతి సాధారణ విద్యార్థి దశ నుంచి అసాధార ణ మేధావిగా కలాం ఎదిగిన క్రమం విలక్షణం, ఆశ్చర్యకరం. నాలుగు దశాబ్దాల ఉద్యోగపర్వంలో ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా, సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా విలక్షణ సేవలందించే క్రమంలో డిఆర్‌డిఒ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలంప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్) సంస్థల్లో పరిపాలనాదక్షుడిగా, మిలటరీ మెసైల్ రూపశిల్పిగా తన సత్తా చాటి 'మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తించబడ్డారు. ప్రధాని ముఖ్య వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఒ సెక్రటరీగా 1992 నుంచి 1999 వరకు పనిచేశారు. స్వావలంబన దిశగా భారతదేశాన్ని న్యూక్లియర్ ఎనర్జీ కలిగిన దేశంగా నిలపటానికి 1998లో పోక్రాన్e పరీక్షలను పర్యవేక్షించి ప్రజల చేత జేజేలు అందుకున్నారు. భారత వాయు సేనలో ఫైటర్ పైలెట్‌గా పని చేయాలనుకున్న కలాం ఏరోస్పేస్ శాస్త్రజ్ఞుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు.

ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, యువత ఆరాధ్య దైవం, ఆదర్శ రాజకీయవేత్త, యువతకు మార్గదర్శిగా బహుముఖీన ప్రతిభ కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితరసాధ్యాలు. నేను చేయగలననే దృఢ సంకల్పమే విజయాలను అందిస్తుందని, ఎవరి తలరాత ను వారే లిఖించుకోవాలని, నిజాయితీగల హృదయంతోనే అసలైన ఆకర్షణీయ వ్యక్తిత్వం వ్యక్తం అవుతుందని బోధనలు చేశారు.

**కలలు కందాం, సాకారం చేసుకుందాం:**

'ఉన్నత కలలు కనండి, సాకారానికి కఠోర సాధన చేయండి' అంటూ నినదించిన కలాం జీవితం తెరిచిన పుస్తకం, యువతకు మార్గదర్శకం. పడవలు నడిపే వృత్తిలో పేరుగాంచిన కలాం కుటుంబం, వ్యాపారంలో నష్టం రావడంతో కష్టాల కడలిలో పట్టుదలతో చదువులను కొనసాగిస్తూ, పేపర్ బాయ్‌గా పనిచేస్తూ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ను పూర్తి చేయగలగడం నేటి యువతకు ప్రేరణాత్మకం. ఉద్యోగిగా తన సీనియర్స్ డా:విక్రమ్ సారాభాయ్, ఆచార్య సతీష్ ధవన్, డా: బ్రహ్మ ప్రకాశ్ లాంటి దిగ్గజాల వద్ద నాయకత్వ పటిమను, అంతరిక్ష శాస్త్ర సాంకేతిక మెలకువలను నేర్చుకున్నారు. 1969లో ఇస్రోకు బదిలీ అయిన కలాం నేతృత్వంలో భారత తొలి స్వదేశీ పరిజ్ఞానంతో 'సాటిలైట్ లాంచింగ్ వెహికిల్ (యస్‌యల్‌వి3')ను రూపొందించుటలో విజయం సాధించారు. 1970–90ల మధ్య పిఎస్‌ఎల్‌వి (పోలార్ సాటిలైట్ లాంచింగ్ వెహికిల్)తో పాటుగా ఎస్ఎల్‌వి3లను అభివృద్ధి చేయుటలో ప్రధాన భూమికను నిర్వహించారు. 'బాలిస్టిక్ మెసైల్' టెక్నాలజీతో 'ప్రాజెక్ట్ డెవిల్', 'ప్రాజెక్ట్ వాలియంట్'లను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మెసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐజియండిపి) ద్వారా కలాం చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ₹3.88 బిలియన్ పెట్టుబడి తో పరిశోధనలు కొనసాగించారు.



'అగ్ని','పృథ్వి'మెసైల్‌లను విజయవంతంగా నిర్మించగలిగా రు. 1998లో చవకైన 'కలాంరాజు కరోన రీ స్టంట్'ను, 2012లో 'కలాం రాజు టాబ్లెట్' హెల్త్‌కేర్ కంప్యూటర్‌ను రూపొందించారు. టెక్నాలజీ సహాయంతో ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలను పరిపుష్టం చేయవచ్చని గట్టిగా నమ్మిన కలాం ముందుచూపు అద్వితీయం. 'జననం సాధారణమే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలని' ఉద్బోధించారు.

**లీడ్ ఇండియా రూపశిల్పి:**

25 జూలై 2002న రాష్ట్రపతి పదవిని చేపట్టి భారత తొలి పౌరుడిగా 'ప్రజా రాష్ట్రపతి'గా పేరు తెచ్చుకున్నారు. భారత అత్యుత్తమ 'భారత రత్న' అవార్డు పొందిన ఏకైక తొలి సైంటిస్ట్, బాచిలర్ కలాం అనంతరం రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన అనంతరం అబ్దుల్ కలాం 'లీడ్ ఇండియా 2020' ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేళ్ళలో 5లక్షల యువతకు మార్గదర్శకం చేయాలనే లక్ష్యాన్ని ఛేదించుటకు కృషి చేశారు. నేటికీ కలాం స్థాపించిన 'లీడ్ ఇండియా ఫౌండేయన్' అనబడే 2వ స్వాతంత్ర్య ఉద్యమాన్ని తన అభిమానులు 'లీడ్ ఇండియా నేషనల్ క్లబ్స్' వేదికగా యువతను సన్మార్గంలో నిలిపే లీడ్ ఇండియా మిషన్ 2047 వేదికగా పలు అసామాన్య సేవలను నిరంతరం కొనసాగించడం హర్షదాయకం. అనేక అగ్ర విద్యా సంస్థలు ఐఐఎం, ఐఐఎస్‌సి, ఐఐటి, బిహెచ్‌యు, అన్నా విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమూల్య సేవలు, అనుభవసారాలు అందజేశారు. తన జీవితకాలంలో 40కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకోగలిగారు.

**పురస్కారాలే పులకించిన వేళ:**

అత్యుత్తమ పౌర పురస్కారం భారత రత్నతో పాటు పద్మవిభూషణ్, పద్మ భూషణ్, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత అవార్డు, వీర సావర్కర్, శస్త్ర రామానుజన్, వాన్ బ్రాన్ లాంటి పలు అవార్డులతో సన్మానాలు అందుకున్నారు. తన అనుభవాలను, ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇండియా 2020', 'ఇగ్నైటెడ్ మైండ్స్', 'ఇండామిటబుల్ స్పిరిట్స్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 26 జూలై 2015న ఐఐఎం, షిల్లాంగ్‌లో విద్యార్థి యువతతో ముచ్చటిస్తూనే 83వ ఏట తుది శ్వాస విడిచిన ఏ.పి. జె.అబ్దుల్ కలాం జీవితం ఆసాంతం అనుసరణీయం, సదా స్మరణీయం. బలమైన విజయకాంక్షతోనే అపజయాలను అధిగమించాలని, విద్య రెక్కలతోనే ఎదగాలంటూ నినదించిన కలాం దార్శనికత పరమ పవిత్రం, ప్రగతికి ఇంధనం.

'సక్సెస్ అంటే మన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారడమే' అన్న కలాం 'కల అంటే నిద్ర పోనివ్వకుండా విజయం వరించే దాకా మనల్ని కార్యోన్ముఖులను చేసేది' అని నమ్మిన అపూర్వ మూర్తిమత్వ నిధి మన అజేయ అబ్దుల్ కలాం సామాన్య ప్రజల మదిలో తిష్టవేసిన ప్రేరణామూర్తి, నిత్య చైతన్య స్ఫూర్తి.

**(15 అక్టోబర్ అబ్దుల్ కలాం జయంతి' సందర్భంగా )**

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి



రాష్ట్రంలో సమగ్ర సర్వే నిర్వహించి

# కరువు మండలాలు ప్రకటించాలి

● రైతు సంఘాల నేతలు డిమాండ్ ● మంత్రి తుమ్మలకు వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వర్షాభావంతో నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలను చేపట్టడంతో పాటు సమగ్ర సర్వే నిర్వహించి కరువు మండలాలను ప్రకటించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ నేతృత్వంలో తెలంగాణ రైతాంగ సమితి నాయకులు రాఘవులు, జుక్కల వెంకయ్య, ఎఐకెఎంఎస్ ప్రతినిధి విజయ్‌లు వ్యవసాయశాఖమంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో సాధారణ కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో, 315 మండలాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు నెలకొందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు కరువు ప్రాంతాలను గుర్తించి ప్రకటించాయని తెలంగాణలో తక్షణమే కరువు మండలాలను గుర్తించి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. కరువుతో నష్టపోయిన రైతులకు ఎకరాకు వరికి రూ.30వేలు, పత్తి, మిర్చి పంటలకు రూ.50వేలు కూరగాయాలు ఇతర పంటలకు రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, గ్రామీణ ఉపాధి పనులను విస్తరించాలని కోరారు. పంటలు కోల్పోయిన రైతులకు రుణాలను మాఫీ చేయడంతో పాటు పాక్షికంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**మంత్రివర్గంలో చర్చిస్తాం : మంత్రి తుమ్మల**

రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు కరువు ఉపశమన కార్యక్రమాలు చేపట్టే అంశాన్ని మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా బిందు సేద్యం పరికరాలపై సబ్సిడిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# నీటి పంపకాలలో వివాదాలు వద్దు

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** నీటి పంపకాలపై సిఎం రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. బుధవారం నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజుకు 1.5 టిఎంసిలు పాలమూరుకు, 0.5 టిఎంసిలు డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి కేటాయింపులపై మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, మహబూబ్‌నగర్ ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ సాధించుకున్నామని, ఇప్పుడు జిల్లాల మధ్య నీటి వివాదాలు ఎందుకని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రెండు జిల్లాల రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే అదనపు ఖర్చు, ఎక్కువ సమయం పడుతుందని, ప్రాజెక్టుల విషయంలో సాంకేతిక అంశాలు, ఆర్థిక భారాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ఇంజనీర్లు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన నల్లగొండకు సాగునీటి వసతులు కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని, జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు జలవిద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావ చూపుతున్నాయని, నీటిని, విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. రబీ సీజన్‌లో అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని, రెండు జిల్లాల మధ్య వివాదాలకు తావివ్వొద్దని, సామరస్యంతో నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ప్రాంతాల మధ్య సోదరభావాన్ని కాపాడాలని, జిల్లాల మధ్య చిచ్చుపెట్టడం సరికాదని, తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేయొద్దని సూచించారు.




## సమగ్రంగా, కచ్చితంగా జనగణన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిర్దేశించిన జనగణన విధానాల ప్రకారం అవసరమైన ప్రతి కుటుంబం, గృహం, జనగణన గృహం, భవనాన్ని కవర్ చేస్తూ, ఎటువంటి లోపం లేకుండా, పునరావృతం కాకుండా జనాభా గణనను సమగ్రంగా, కచ్చితంగా నిర్వహించేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర జనాభా గణన కార్యకలాపాల డైరెక్టర్ భారతి హోల్లికేరి,జిహెచ్‌ఎంసి కమిషనర్,ప్రధాన జనాభా గణన అధికారి (పిసిఒ) కర్ణన్ సూచించారు. భారత జనాభా గణన 2027లో భాగంగా రెండవ దశ 'జనాభా గణన' ప్రక్రియలోగ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిలోని 1 నుండి 30 సర్కిళ్లు,కంటోన్మెంట్ బోర్డుకు చెందిన 'ఛార్జ్ క్లర్కులు',సాంకేతిక సహాయకుల'కోసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి హోల్లికేరి, కర్ణన్‌తో పాటు జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్,అదనపు ప్రధాన జనాభా గణన అధికారి బి.సంతోష్ కుమార్ శిక్షణ జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, శిక్షణా కార్యక్రమాలను సమీక్షించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జనాభా గణన 2027 ప్రాముఖ్యత ఆవశ్యకత,జనాభా గణనను విజయవంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన విధానాలపైన అవగాహన కల్పించారు.

# పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు

జిల్లాల వారీగా కలెక్టర్లు ముందస్తు కొనుగోలు చేయాలి : మంత్రి తుమ్మల ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం తగ్గి పశుగ్రాస కొరత ఏర్పే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పంట వ్యర్థాలను కాల్చకుండ పశు గ్రాసంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని అవసరమైతే కలెక్టర్లు పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ప్రస్తుత పంటల పరిస్థితి, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, వ్యవసాయ యంత్రీకరణ, గోదాములు నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. గత రబీ సీజన్‌లో దాదాపు 128 లక్షల ఎకరాల్లో పంట వ్యర్థాలను కాల్చినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో ఖరీఫ్ పంటల అనంతరం వాటిని పశుగ్రాసంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అదేశించారు. శాటిలైట్ డేటా, కృతిమ మేధ (ఎఐ)ఆధారంగా నేలలోని పోషకాల లభ్యతను అంచనావేసే డిజిటల్ వ్యవసాయ సాంకేతికతపై జర్మనీ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. ఈ సాంకేతిక ద్వారా నత్రజని, భాస్వరం, పోటాషియం సహా ఇతర పోషకాల స్థాయిలను విశ్లేషించి,. పంట అవసరాలకు అనుగుణంగా ఎరువల వినియోగంపై సిఫారుసులు అందించాలని ప్రతినిధులకు సూచించారు. ప్రతి 12 రోజులకు ఒకసారి ఎరువుల వినియోగంపై సమగ్ర నివేదికను రూపొందించి రాష్ట్రంలోని 70 లక్షల మంతి రైతులకు ఒకేసారి సమాచారం అందించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం రైతులు ప్రధానంగా యూరియా, ఎస్‌పికె ఎరువుల వినియోగంపై ఆధారపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఎరువులు, పురుగు మందుల మితిమీరిన వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఎఐ సాంకేతికతను ఉపయోగిచుకోవాలన్నారు. సంప్రదాయ పద్దతుల్లో మట్టి నమూనాల సేకరణ, పరీక్షలకు సమయం పడుతున్నందున కొత్త సాంకేతికత ద్వారా వేగంగా సమచారం అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అయితే ఈ సాంకేతికత కచ్చితత్వం, విశ్వసనీయతను శాస్త్రీయంగా నిర్ధారించిన తర్వాతే అమలుపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్ర వేత్తలు జర్మనీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని రాష్ట్రంలోని వివిధ రకాల నేలలు, పంటలకు ఈ విధానం ఎంతవరకు అనువైనదో అధ్యయనం చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి జానయ్యను ఆదేశించారు. డిజిటల్ వ్యవసాయం ద్వారా రైతులకు సకాలంలో శాస్త్రీయ సమాచారం ఆందించి సాగు ఖర్చులు తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ బి.గోపి. కోఆపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, హాకా ఎండి శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యాన శాఖ ఎండి యాస్మిన్ బాషా, వేర్ హౌసింగ్ ఎండి శ్రీదేవి, అగ్రోస్ ఎండి రాములు, వ్యవసాయ , ఉద్యాన విశక్వవిద్యాలయాల ఉప కులపతులు జానయ్య, రాజిరెడ్డి , జర్మనీకి చెందిన ఎసిఆర్‌ఎటి ప్రతినిధులు డాక్టర్ రఘు చాలిగంటి, డాక్టర్ సెబాస్టియన్ బోసే, జాన్ రెడ్‌లిచ్‌లు పాల్గొన్నారు.

## వలస కార్మికుల పట్ల సర్కారు నిర్లక్ష్యం

మాజీ మంత్రి
హరీశ్‌రావు



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా, గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన వలస కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరమని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీశ్ రావు అన్నారు. బుధవారం ఇందువాసి గ్రామంలో పర్యటించిన హరీశ్ రావు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డిలతో కలిసి ప్రమాద బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పార్టీ తరపున ఆర్థిక భరోసా కల్పిస్తూ మృతుల కుటుంబాలకు రూ.1 లక్ష చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 వేల చొప్పున తక్షణ సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచే ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు, సీనియర్ అధికారులు ఉన్నప్పటికీ, ప్రమాదంలో కార్మికులు చనిపోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం లేదా? అని ప్రశ్నించారు. గత బిఆర్‌ఎస్ పాలనలో ఆగిపోయిన వలసలు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ మొదలయ్యాయన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని హరీశ్ రావు గుర్తుచేశారు. నేడు జూరాలలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికి 24 గంటలు మోటార్లు రన్ చేయకుండా కాలువలకు నీళ్లు వదలకుండా కిందకు వృథాగా వదిలేస్తున్నారు. మన కళ్లముందే కృష్ణా, తుంగభద్ర నీటిని రాయలసీమకు తరలిస్తుంటే ముఖ్యమంత్రి, మంత్రులు చోద్యం చూస్తున్నారన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక జీవో నెంబర్ 17ను తక్షణమే రద్దు చేసి, అన్నదాతలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల, పేదల హక్కుల కోసం బిఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## కెటిఆర్ చీకటి బాగోతాలు బయటపెడతా

కంపెనీలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారంటూ బల్మూర్ వెంకట్ ఆరోపణలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ తీవ్ర ఆరోపణలు చేశారు. బహుళజాతి కంపెనీలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని, తన ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం, ఎంఎన్‌సి సంస్థలతో కుదుర్చుకున్నట్లు చెబుతున్న ఒప్పందాలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. కెటిఆర్, ఆయన బృందం చేస్తున్నాయని ఆరోపిస్తున్న వ్యవహారాలను వరుసగా బయటపెడతానని, తదుపరి సిరిసిల్లకు సంబంధించిన అంశాలను వెల్లడిస్తానని ప్రకటించారు. కెటిఆర్ ఒక 'వసూల్ రాజా' అంటూ విమర్శించిన బల్మూర్ వెంకట్.. కంపెనీలను లక్ష్యంగా చేసుకుని ఒక పద్ధతి ప్రకారం ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయంపై ప్రశ్నలు లేవనెత్తిన వెంకట్.. ఐదు కోట్ల రూపాయల షేర్ విలువ ఉన్న హోటల్ ఆదాయం పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. డ్రగ్స్ వ్యవహారంలో ఆధారాలు బయటపడకుండా కెటిఆర్ హెయిర్ ట్రీట్‌మెంట్ చేయించుకున్నారంటూ గతంలో తాను ఆరోపించానని వెంకట్ గుర్తుచేశారు. ఈ అంశంపై కెటిఆర్ స్పందించాలని కోరారు. కెటిఆర్, ఆయన బృందం తనపై తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని, తాను చేసిన ఆరోపణలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. దమ్ముంటే కెటిఆర్ బహిరంగంగా స్పందించాలని సవాల్ విసిరారు. రానున్న రోజుల్లో సిరిసిల్లకు సంబంధించిన మరిన్ని అంశాలను వెల్లడిస్తానని తెలిపారు.




పిఎల్‌బి బోనస్ పరిమితి పెంచాలని

## రైల్వే ఉద్యోగుల ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే ఉద్యోగులకు ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ (పిఎల్‌బి) లెక్కింపు పరిమితిని పెంచి, చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ (ఎస్‌సిఆర్‌ఇయు) ఆందోళనకు దిగింది. ప్రస్తుత లెక్కింపు విధానం వల్ల ఉద్యోగులకు తగిన ప్రయోజనం దక్కడం లేదని ఆరోపిస్తూ బుధవారం సంచాలన్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించింది. ఒక్కో ఉద్యోగికి 78 రోజుల బోనస్‌గా రూ.72,391 చెల్లించాలని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖను కోరింది. యూనియన్ అధ్యక్షుడు జె. వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో జనరల్ సెక్రటరీ కె. శివకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం బోనస్ లెక్కింపునకు ఉపయోగిస్తున్న నెలవారీ రూ.7,000 పరిమితి కాలం చెల్లిందని పేర్కొన్నారు. కార్మిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ ప్రకారం బోనస్ లెక్కింపునకు రూ.7,000 లేదా కనీస వేతనం.. ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే దానిని పరిగణనలోకి తీసుకోవాలని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం రైల్వే ఉద్యోగి కనీస వేతనం, కరువు భత్యాన్ని కలిపి రూ.28,440గా లెక్కిస్తే, 78 రోజుల బోనస్ కింద రూ.72,391 చెల్లించాల్సి ఉంటుందని శివకుమార్ వివరించారు. ప్రభుత్వ నిబంధనలను తక్షణమే అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది. రైల్వే కార్మికుల హక్కుల సాధన కోసం ఇతర ఉద్యోగ సంఘాలు, యూనియన్లు కూడా కలిసికట్టుగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.

## తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా సంక్షేమ పథకాలు అమలు

● డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భవించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాదద్ మండలం మన్ననూరులో రూ.53.78 కోట్లతో నిర్మించనున్న 220/30 కెవి సబ్‌స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, అచ్చంపేటలో ఇప్పటికే 1,219 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, 403 కిలోమీటర్ల విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశామని, 5 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అచ్చంపేట ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో నియోజకవర్గంలో లోవోల్టేజీ, విద్యుత్ సరఫరా అంతరాయాల సమస్యలకు పరిష్కారం లభించనుందని తెలిపారు. 14 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లతో పాటు 220/33 కేవీ, 132/33 కేవీ సామర్థ్యాలతో మరో రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని వెల్లడించారు. సుమారు 500 ఎకరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు సహకరిస్తున్నందుకు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ గ్రంథాలయ కమిటీ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ట్రాన్స్ కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇంచార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.
















**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డివిజన్-30, జిహెచ్‌ఎంసి

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 30/E.E.30/ GHMC/2026-27, Dated: 13.10.2026 | జిహెచ్‌ఎంసి, కెజెడ్, డివిజన్-30 కింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు | రూ. 2.88 లక్షలు | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 13.10.2026 మ.3.00గం.లకు మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 14.10.2026 మ.3.00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్‌ఎంసి 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 11879-PP/CL/ADVT/2026-27, Date: 14-10-2026

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, డివిజన్ : సిద్దిపేట్

NIT NO.PA/DB/T1/06/2026-27 DATED: 13.10.2026

| క్ర.సం. | పని పేరు | అంచనా విలువ |
|---|---|---|
| 1 | సిద్దిపేట జిల్లాలోని చేర్యాల - సాల్వాపూర్ రహదారిపై కి.మీ 0/00 - 7/200 మధ్య రహదారి భద్రతా చర్యలను అమలు చేయనున్న ER. | రూ.12.00 లక్షలు |

1. బిడ్ సమర్పణకు ఆఖరి తేదీ: 17.10.2026 మ.3.00గం.ల వరకు.
2. సంప్రదించవలసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : సిద్దిపేట్, సిద్దిపేట్ జిల్లా. ఫోన్ నెం. 9440818096.
3. మరిన్ని వివరాలకు 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : సిద్దిపేట్

DIPR R.O. No. : 11892-PP/CL/ADVT/2026-27, Date: 14-10-2026

**నేరేడుచర్ల మున్సిపాలిటీ కార్యాలయం, సూర్యాపేట జిల్లా**
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
టెండర్ల కొరకు ఆహ్వానం

| S.No. | పని పేరు | అంచనా విలువ | టెండర్ నోటీస్ నెం. |
|---|---|---|---|
| 1 | నేరేడుచర్ల మున్సిపాలిటీలో జిఎఫ్/ 15వ ఎఫ్‌సిజి/ 16వ ఎఫ్‌సిజి పరిధిలో 1వ వార్డు నుండి 15వ వార్డు వరకు చెత్త / శిథిలాలు / పూడిక / బురదను తొలగించే పారిశుధ్య పనుల కోసం నైపుణ్యం లేని రోజువారీ కూలీల నియామకం. (ఎస్‌సి రిజర్వ్‌డ్) | రూ. 4.00 లక్షలు | E1/936/01/MCNDCL/2026-27 Dated: 14.10.2026 |
| | బిడ్ డౌన్‌లోడింగ్ | 15.10.2026@ 11:00AM to 19.10.2026 @ 11:00AM | |
| | టెక్నికల్ బిడ్ ప్రారంభం | 19.10.2026 @ 11:01AM | |

తెలంగాణ ప్రభుత్వ ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా నేరేడుచర్ల మున్సిపాలిటీలో జిఎఫ్/15వ ఎఫ్‌సిజి/16వ ఎఫ్‌సిజి 2.0 2026-27 క్రింద. మరిన్ని వివరాల కోసం దయచేసి https://tender.telangana.gov.in ను సందర్శించండి. పూర్తి వివరాల కోసం పని వేళల్లో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాన్ని సంప్రదించండి.
సంప్రదించవలసిన వివరాలు: 9492256688, 6303571223

సం/- కమిషనర్ నేరేడుచర్ల మున్సిపాలిటీ

DIPR R.O. No. : 11911-PP/CL/ADVT/2026-27, Date: 14-10-2026



## పోలీస్ సంస్మరణ వారోత్సవాలకు డిసిపి, ఎసిపిలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/చర్లపల్లిః** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320సి ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ నుండి రాధిక చౌరసా, ఏఎస్‌రావు నగర్, సైనిక్‌పురి, నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల మీదుగా నిర్వహించనున్న భారీ ర్యాలీకి మల్కాజ్‌గిరి డిసిపి శ్రీధర్, ఉప్పల్ డిసిపి సురేష్‌కుమార్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, మల్కాజ్‌గిరి ఎసిపి యాదగిరిరెడ్డిలను లయన్స్ సభ్యులు కలసి కోరారు. ఈ కార్యక్రమంలో 320సి జిల్లా గవర్నర్ లయన్ కళ్లెం కృష్ణారెడ్డి, మొదటి జిల్లా గవర్నర్ లయన్ మండా సురేష్, జోన్ చైర్మన్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారిలు పాల్గొన్నారు.



## సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమరం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమరం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటి లాల్‌గడిమలక్‌పేటలో కావటి సరిత మురళి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్‌చేసి నూతన గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సొంత ఇంటితో ప్రతి కుటుంబానికి భద్రతను, ఆత్మ విశ్వాసాన్ని గౌరవ ప్రదమైన జీవనాన్ని అందిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేర్చడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. నూతన గృహంలోకి అడుగు పెట్టిన కావటి సరిత దంపతులకు చైర్ పర్సన్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా ఉప్పలమ్మ విగ్రహ ప్రతిష్ట**

అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వయంభూగా వెలిసిన ఉప్పలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ కమరం శిరీషా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు, మున్సిపల్ ప్రజలు ఉప్పలమ్మ విగ్రహ ప్రతిష్టలో భాగంగా వేద పండితులచే హోమం ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, నాయకులు దినేష్, శ్యామ్, దామోదర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌తో రామగుండం వెళ్లిన శివకుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/చర్లపల్లిః** సింగరేణి కార్మిక సింహగర్జనకు వెళ్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుతో చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పండాల శివ కుమార్‌గౌడ్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రామగుండం బయలుదేరి వెళ్లారు.సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం వారి సమస్యల పరిష్కా రం కోసం కార్మికుల గొంతుకగా నిలవాల్సిన అవసరముందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పి ప్రసాద్‌రెడ్డి,జూపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## 16న లాటరీ పద్ధతిలో బార్, రెస్టారెంట్‌ల కేటాయింపు

**ప్రజాపక్షం /వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలోని పరిగి, కొడంగల్‌లో బార్, రెస్టారెంటుకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని జిల్లా అబ్కారీ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు బార్‌లకు 29.09.2026నుండి తేదీ 12.10.2026 వరకు స్వీకరించడం జరిగిందన్నారు. పరిగి మున్సిపల్‌కు 36దరఖాస్తులు, కొడంగల్‌కు 27దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ఈనెల 16న 9.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో తీయడం జరుగుతుందన్నారు.



## రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** కోట్‌పల్లి మండల కేంద్రంలోని డిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లోని కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత రమేష్ నాయక్, వైస్ చైర్మన్‌గామధులత శ్రీనివాస్‌చారిలతోపాటు నూతన పాలక వర్గం సభ్యులుగా ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికున్న సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలని పాలకవర్గం సభ్యులకు సూచించారు. రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ మార్కెట్‌కమిటీ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం వారి సమస్యల పరిష్కారం మనందరి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం 21మందికి కళ్యాణలక్ష్మి అందచేశారు. అనంతరం రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

# గ్రామస్థాయిలోనే వివాదాలకు పరిష్కారం

> సామరస్యమే లక్ష్యం..
> కోర్టులపై భారం తగ్గించేందుకు కమ్యూనిటీ మధ్యవర్తిత్వం
> రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో మూడు రోజుల శిక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిన్నచిన్న వివాదాల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, గ్రామస్థాయిలోనే ఇరుపక్షాల అంగీకారంతో సమస్యలను పరిష్కరించేందుకు న్యాయ సేవాధికార సంస్థ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామ పెద్దలకు మధ్యవర్తిత్వంపై శిక్షణ ఇచ్చి, స్థానికంగా తలెత్తే వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేలా ప్రోత్సహిస్తోంది. ప్రజలకు తక్కువ ఖర్చుతో, సులభంగా న్యాయం అందించడంతోపాటు కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్సా), న్యూఢిల్లీ ఆదేశాల మేరకు, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలోని ఐదు జిల్లాలను ప్రయోగాత్మక ప్రాజెక్టు కోసం ఎంపిక చేసి, ప్రతి జిల్లాకు ఐదుగురు చొప్పున గ్రామ పెద్దలను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లోని రాష్ట్ర న్యాయ అకాడమీలో 28మంది గ్రామ పెద్దలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కుటుంబ, వైవాహిక సమస్యలు, ఆస్తి వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, పొరుగువారి మధ్య తగాదాలు, పని ప్రదేశాల్లో విభేదా లు, భూ సరిహద్దుల సమస్యలు, తల్లిదండ్రులు–పిల్లల మధ్య వివాదాలు తదితర అంశాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇరుపక్షాల అంగీకారంతో, తటస్థంగా వ్యవహరిస్తూ పరస్పర సమ్మతితో పరిష్కారానికి వచ్చేలా గ్రామ పెద్దలు సహకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో నిష్పాక్షికత, గోప్యత, ఇరుపక్షాల గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి చి.పంచాక్షరి మౌర్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత న్యాయవ్యవస్థలో మధ్యవర్తిత్వం ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని వివరించారు. దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ వల్ల ప్రజలు ఎదుర్కొనే ఆర్థిక, మానసిక ఇబ్బందులను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలోనే వివాదాలను పరిష్కరించడం ద్వారా సామాజిక సంబంధాలను కాపాడటంతోపాటు సామరస్యపూర్వక వాతావరణాన్ని నెలకొల్పవచ్చని తెలిపారు.

నిజామాబాద్, రెడ్డి జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన గ్రామ పెద్దలు వివాదాల ను సమర్థంగా పరిష్కరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 400 మందికి పైగా గ్రామ పెద్దలకు శిక్షణ అందించినట్లు తెలిపారు. తాజాగా శిక్షణ పొందుతున్న వారు తమ గ్రామాలు, స్థానిక ప్రాంతాల్లో ఈ నైపుణ్యాలను ఉపయోగించి వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని సభ్య కార్యదర్శి సూచించారు. మధ్యవర్తిత్వం స్వచ్ఛంద, తటస్థ ప్రక్రియ అని, ఇరుపక్షాల అంగీకారంతోనే పరిష్కారం సాధించాలన్నారు. ఓర్పు, నిష్పాక్షికతతో వ్యవహరిస్తూ, సంబంధిత వ్యక్తుల హక్కులు, ప్రయోజనాలు, గౌరవాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో వివాద పరిష్కార వ్యవస్థ బలోపేతం కావడంతోపాటు సామాజిక సామరస్యం పెరుగుతుందని, ప్రజలకు అందుబాటులో న్యాయం అందించే లక్ష్యం మరింత ముందుకు సాగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చర్లపల్లి జైలును సందర్శించిన హెచ్‌ఆర్‌డి సంస్థ శిక్షణార్థులు



**ప్రజాపక్షం/చర్లపల్లిః** ఖైదీలకు విద్య, వృత్తి నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిలో సానుకూల మార్పు తీసుకురావడానికి జైళ్ల శాఖ కృషి చేస్తుందని డిజి సౌమ్య మిశ్రా అన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారం, ఖైదీల వ్యవసాయ క్షేత్రంను డాక్టర్ ఎంసిఆర్ మానవ వనరులు అభివృద్ధి సంస్థ తెలంగాణకు చెందిన 175 శిక్షణార్థులు,15 మంది అధ్యాపకులు మొత్తం 190 మంది సభ్యులు బృందం బుధవారం సందర్శించారు. కేంద్ర సివిల్ సర్వీసుల అధికారుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులో భాగంగా ఈ పర్యటనను చేపట్టారు.ఈ సందర్భంగా డిజి సౌమ్య మిశ్రా వారికి స్వాగతం పలికి మాట్లాడుతూ జైళ్లు కేవలం ఖైదీలను నిర్బంధించే కేంద్రాలే కాదని సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా తీర్చిదిద్దే సంస్కరణ,పునరావాస కేంద్రాలని అన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా ఖైదీలకు విద్యను అందించడం,కేంద్ర కారాగారంలో ఐటిఐని ఏర్పాటు , జైలు పరిశ్రమలతో స్టీల్, ఫర్నిచర్, ఫినాయిల్, సబ్బులు, శానిటైజర్లు తయారు,వడ్రంగం,పాడి పరిశ్రమ,కూరగాయల సాగు,ఇంధన విక్రయ కేంద్రాల ద్వారా ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంసిఆర్ హెచ్ఆర్‌డి సంస్థ సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ కె సుకుమార్,జైళ్ల శాఖ డిజి శ్రీనివాస్, పర్యవేక్షణాధికారులు డి భరత్, ప్రమోద్, డిప్యూటీ పర్యవేక్షణాధికారులు వెంకటేశం, దేవ్లా, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో లీడ్ అకడమిక్స్ శిక్షణా కార్యక్రమం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** భారతదేశ ఉన్నత విద్యా రంగంలో నాయకత్వ సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లోని సెంటర్ ఫర్ లీడర్‌షిప్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ అకడమిక్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో లీడ్ అకడమిక్స్ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. అక్టోబర్ 13 నుండి 15 వరకు మూడు రోజుల పాటు క్యాంపస్‌లో జరిగే ఈ ప్రత్యేక శిక్షణలో దేశవ్యాప్తంగా దుబాయ్ నుంచి ఎంపికైన 15 విద్యాసంస్థలకు చెందిన 31 మంది విద్యా నాయకులు పాల్గొంటున్నారు. ఈ మూడు రోజుల ప్రత్యక్ష శిక్షణతో ప్రారంభమైన ఈ నాయకత్వ వికాస యాత్ర మొత్తం ఆరు నెలల పాటు కొనసాగుతుంది. వికసిత్ భారత్ 2047 జాతీయ లక్ష్యానికి అనుగుణంగా ఉన్నత విద్యా పరిపాలనను, సంస్థాగత నాణ్యతను బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దారు. ఈ ప్రారంభోత్సవంలో బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. రామ్‌గోపాల్ రావు, విద్యా మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి ఆర్. సుబ్రహ్మణ్యం, లీడ్ సెంటర్ అధిపతి ప్రొఫెసర్ పి.శంకర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ వి.రామ్‌గోపాల్ రావు మాట్లాడుతూ, వ్యక్తుల పదవీకాలానికి అతీతంగా నిలిచే దీర్ఘకాలిక సంస్థాగత వ్యవస్థల ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ షకీలా టి.షంసు సమ్మిళిత నాయకత్వం, అధ్యాపకుల సంక్షేమంపై సెషన్లు నిర్వహించగా, ఆర్.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు అనుకూలమైన ఉత్సాహభరిత క్యాంపస్ వాతావరణంపై ప్రసంగించారు. తదుపరి రోజుల్లో ప్రొఫెసర్ మినీ షాజీ థామస్, డాక్టర్ మంజు సింగ్, ప్రొఫెసర్ సుధీర్ కె. జైన్ వంటి ప్రముఖులు విద్యా ప్రమాణాలు, నియంత్రణ వ్యవస్థలు, సంస్థాగత పాలనపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఆరు నెలల కాలంలో నిపుణుల మార్గదర్శకత్వం, సహచరుల చర్చలు ఆచరణాత్మక విధానాల ద్వారా విద్యా పరిపాలనలో సానుకూల మార్పులు తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అనిర్వచనీయం

### డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ః** తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జవహర్ నగర్‌లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య మహిళా కార్మికులకు మాజీ డిప్యూ టీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, నాగరాణి దంపతులు బతుకమ్మ కానుకగా నూతన చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడు తూ, నగరాన్ని శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అత్యంత అనిర్వచనీయమని కొనియాడారు. వారి కష్టాన్ని గుర్తించి, పండుగ వేళ వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల కు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకమైనదని, పండుగ వేళ పారిశుద్ధ్య మహిళా కార్మికుల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఎల్లా శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్, నాయకులు శ్రీమన్నారాయణ, మౌనిక రెడ్డి, వసంత, సవిత గౌడ్, లేక గౌడ్, భారతి, రజిత, వనిత, మౌనికలతో పాటు పలువురు స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొన్నారు. తమ కష్టాన్ని గుర్తించి, ప్రతీ ఏటా పండుగ వేళ బతుకమ్మ కానుకగా చీరలను అందజేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ గుప్తా, నాగరాణి దంపతులకు మహిళా కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పండుగ పూట తమకు లభించిన ఈ గౌరవం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

## మానవత్వానికి ప్రతీక అన్నదానం : బండి రమేష్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** దసరా నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని అల్లాపూర్‌లోని శివాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం లక్ష్మణ్‌గౌడ్ పర్యవేక్షణలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ దసర నవరాత్రులు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకలని పేర్కొన్నారు. పవిత్రమైన పర్వదినాల్లో అన్నదానం చేయడం గొప్ప సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవత్వానికి నిదర్శన మని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వచ్చి పేదలకు, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వాజిద్ పాషా, మస్తాన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్లా, జమీర్, వాసు, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

## కెపిఆర్‌ఐటిలో టెక్ ధమాకా



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** విద్యార్థుల సాంకేతిక ప్రతిభ, వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు వేదికగా ఘట్‌కేసర్‌లోని కెపిఆర్‌ఐటి, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల టెక్‌ఫెస్ట్, 2026 ఘనంగా ముగిసింది. అక్టోబర్ 12,13 తేదీల్లో నిర్వహించిన ఈ ఉత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. సాఫ్ట్‌వేర్ హ్యాకథాన్, కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసం, సైబర్ భద్రత, కోడింగ్ ప్రాజెక్టుల పోటీలు, సాంకేతిక వర్క్‌షాప్‌లు, త్రిమితీయ నమూనాల రూపకల్పన, నూతన వ్యాపార ఆలోచనల ప్రదర్శన వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం ఈ ఉత్సవం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, వ్యూహాత్మక విభాగం డైరెక్టర్ కొమ్మూరి దివ్యశ్రీ, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ సిడి నాయుడు శుభాకాంక్షలతో కార్యక్రమం నిర్వహించారు. కెపిఆర్‌ఐటి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనాథ్ కశ్యప్, వైస్ ప్రిన్సిపాల్ విశ్వశ్రీ మార్గదర్శకత్వం వహించారు. డీన్ అనీష్ శ్రీవాస్తవ, పరిపాలనా అధికారి నాగరాజ్, విభాగం డీన్ డాక్టర్ రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. కన్వీనర్లు డాక్టర్ భగత్ బాషా కార్యక్రమాలను సమన్వయం చేశారు. విద్యార్థి సమన్వయకర్తలు కీలక పాత్ర పోషించారు.



## మెరుగైన పాలన అందిస్తాం

### మల్కాజిగిరి నగర పాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఎంఎంసి పరిధిలోని అన్ని ప్రాంత ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు శాయశక్తులా పనిచేస్తున్నామని మల్కాజిగిరి నగర పాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం నాచారం సర్కిల్ పరిధిలోని ఎన్‌టిఆర్ సర్కిల్, ఎపిహెచ్‌బి కాలనీ, గోకుల్‌నగర్, ఎఫ్‌సిఐ ప్రధాన రహదారి ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. చెత్త ఎక్కువగా పేరుకొని పోయే ప్రాంతాలను గుర్తించి అక్రమ వ్యర్థాలను డంపింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవటం ద్వారా పారిశుద్య పనులను మరింత మెరుగుపరచాలన్నారు. సూపర్‌వైజర్లు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, నిరంతర పారిశుద్య చర్యలు చేపట్టాలన్నారు..రహదారి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ఫ్రీ లెఫ్ట్ మార్గాల అభివృద్ధి, రహదారి కబ్జాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్ఎఫ్‌సి రోడ్డులో దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతుల విషయంలో ఎవరైనా ఎక్కడైనా ఉల్లంఘనలు జరుగుతున్నాయా అన్న విషయాలపై క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతూ ఎలాంటి వివక్ష లేకుండా ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలన్నారు. గోకుల్‌నగర్ 18వ వార్డు కాలనీ పార్కును సందర్శించిన కమిషనర్ స్వయం సహాయక సంఘాల మహిళలతో పార్కుల నిర్వహణను మెరుగుపరచాలని సూచించారు. రహదారులు, పారిశుద్ధ్యం, పచ్చదనం, ప్రజా సౌకర్యాల అభివృద్ధికి సంబంధించిన అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతంగా పరిష్కరించటం ద్వారా ప్రజలకు అవసరమైన సేవలందించాలన్నారు.

## సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నీకి తెలంగాణ జట్టు ఎంపిక

### చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : డా.సత్యం శ్రీరంగం

**ప్రజాపక్షం /కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభను కనబరచాలని టిపిసిసి అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ డా.సత్యం శ్రీరంగం అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 1, 2026 వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా 15మంది బాలురు, 15మంది బాలికలు కలిసి మొత్తం 30 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డా. సత్యం శ్రీరంగం అధ్యక్షతన ఆయన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి అడ్‌హాక్ కమిటీ సభ్యులు చిత్రా షెనాయ్, కృష్ణ రాజ్‌పుత్, భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో త్రోబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించొద్దు : కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయం నుండి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, విబిజిరామ్‌జి పనులను మండలంలో వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించి పార్మపాండ్స్, సోప్ కిట్స్ అటవీభూములకు సంబంధించిన అంశాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంతో ప్రతి అంశంపై నిరంతరం పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమలో డిఆర్‌డిఓ శ్రీనివాస్, పంచాయితీ అధికారి జయసుధ, రవికుమార్, మాత్స్యనాయక్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి దుర్గమ్మతల్లికి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/చర్లపల్లిః** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి దుర్గమ్మతల్లి దేవాలయంలో శనన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు భక్తులకు ధాన్యలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి చర్లపల్లి కాంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్, బిజెపి నాయకులు కొమ్ము నర్సింగ్‌రావులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** పోక్సో చట్టం కింద నమోదైన ఒక కేసులో నేరం రుజువు కావడంతో మేడ్చల్ జిల్లాలోని అత్యాచారాలు పోక్సో చట్టాల కేసుల సత్వర విచారణ ప్రత్యేక కోర్టు ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి కోర్ట్ నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. జవహర్ నగర్ ఎస్‌హెచ్‌ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 178/2018 (ఎస్.సి. నంబర్ 152/2020) కేసుకు సంబంధించి, ఐపిసి సెక్షన్లు 354, 448, 2012 పోక్సో చట్టం సెక్షన్ 8 కింద విచారణ జరిగింది. ఈ కేసులో నేరానికి పాల్పడిన నిందితుడిని న్యాయస్థానం దోషిగా తేల్చింది. దోషి వివరాలు:కలాశెట్టి దినేష్ కుమార్ వయసు: 20 ఏళ్లు తండ్రి పేరు: రాజు వృత్తి: ఎలక్ట్రిషియన్ చిరునామా: హెచ్.నెం. 1695/15/14/1, సంతోష్ నగర్, బాలాజీనగర్, కాప్రా, మేడ్చల్ జిల్లా. కోర్టు తీర్పు వివరాలు: నిందితుడికి న్యాయస్థానం కింది శిక్షలు ఖరారు చేసింది: ఐపిసి సెక్షన్ 448 కింద: జైలు శిక్షతో పాటు రూ. 1,000/ జరిమానా. ఐపిసి సెక్షన్ 354 కింద: జైలు శిక్షతో పాటు రూ. 1,000/ జరిమానా. పోక్సో చట్టం సెక్షన్ 7 ఆర్/డబ్ల్యూ 8 కింద: 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష (కన్విక్షన్) రూ.2,000/–జరిమానా. బాధితురాలికి పరిహారం: బాధితురాలికి రూ. 50,000/– నష్టపరిహారం (విక్టిమ్ కాంపిన్సేషన్ ) చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసును సమర్థవంతంగా పర్యవేక్షించి, దోషికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్ఐ, ఎస్.సైదులు పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

## పౌరుల ఓటు హక్కు కాపాడాలి

ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఓటు హక్కు ను కాపాడటం తోపాటు ప్రజాస్వామ్యా న్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ అన్నారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి, నాయకులు ఆకాష్‌నాయక్, శివకుమార్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో వేగం పెంచేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప సూచించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్ తోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆడపడుచుల ఆత్మగౌరవానికి చిహ్నం

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ఆడపడుచుల ఆత్మగౌరవానికి చిహ్నం బతుకమ్మ పండుగ అని జాగృతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మరిపెల్లి మాధవి అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎఎన్ గార్డెన్‌లో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండి మొయినోద్దీన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, జాగృతి నాయకులు శంకర్, అమృత, రమ్యశ్రీ, కరుణ, లావణ్య, అనిత, విజయ, అమరావతి, అనురాధ, లావణ్య, నస్రిన్ తదితరులు పాల్గొన్నారు.

## స్టోన్ క్రషర్‌లో పోలీసుల తనిఖీలు



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రామకృష్ణ పటేల్ (31)పై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ శివారులోని ఆర్కాన్ మినరల్స్ స్టోన్ క్రషర్ ప్రాంగణంలోని ఓ గదిలో గంజాయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. షాద్‌నగర్ ఎస్ఐ అడ్డాకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, క్లూస్ బృందం, పంచ సాక్షులతో కలిసి తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## ఎండుతున్న పంటలకు పరిహారం

**ప్రజాపక్షం/కడ్తాల్:** కరెంటు లేక, సాగునీరు అందక ఎండుతున్న పంట పొలాలకు నష్ట పరిహారం ఇవ్వాలని బిఆర్ఎస్ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు లక్ష్మీ నర్సింహ రెడ్డి కోరారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో పలు వ్యవసాయ పొలాలను ఆయన పరిశీలించారు.

## భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ప్రతిష్టించిన దుర్గామాతకు బుధవారం కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు.



## కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం

ఎమ్మెల్యే రంగారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు పారిజాత పూజలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలోని పెద్ద అంబర్‌పేట్‌లో ఉన్న శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి సాయిబాబా మందిరంలో నిర్వహించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు.



**బతుకమ్మ వేడుకల్లో ...** రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అమ్మే మృత్యువై తోసేస్తే..ఆపద్బాంధవులై కాపాడారు

హుస్సేన్‌సాగర్‌లో మునిగిపోతున్న

ఆరేళ్ల చిన్నారికి ముగ్గురు పౌరుల ప్రాణభిక్ష

ప్రాణదాతలను సత్కరించిన సిపి సజ్జనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కన్నబిడ్డ అనారోగ్యం.. చికిత్స ఖర్చులు భరించలేని ఆర్థిక ఇబ్బందులు.. వెరసి ఓ తల్లి విచక్షణ కోల్పోయి ఆరేళ్ల కుమార్తెను హుస్సేన్‌సాగర్‌లోకి తోసేసింది. ప్రాణభయంతో నీటిలో కొట్టుమిట్టాడుతూ చిన్నారి చేసిన ఆర్తనాదాలు ముగ్గురు పౌరుల హృదయాలను కదిలించాయి. క్షణం ఆలస్యం చేయకుండా స్పందించిన వారు తమ ప్రాణాలను లెక్కచేయకుండా నీటిలో మునిగిపోతున్న పసిపాపను రక్షించి ఆపద్బాంధవులుగా నిలిచారు. ఈ మానవతా చర్యకు గుర్తింపుగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనర్ బుధవారం ముగ్గురినీ ఘనంగా సత్కరించి నగదు పురస్కారాలు అందజేశారు. బోయిన్‌పల్లికి చెందిన ఓ మహిళకు ఎనిమిదేళ్లు, ఆరేళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నారి రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స ఖర్చులు పెరిగి, ఆర్థిక ఇబ్బందులతో ఆమె తీవ్ర ఒత్తిడికి గురైనట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇద్దరు పిల్లలను అప్పర్ ట్యాంక్‌బండ్‌కు తీసుకువచ్చింది. పెద్ద కుమార్తెను ఐస్‌క్రీమ్ తీసుకురావాలని పక్కకు పంపించి, ఎవరూ గమనించని సమయంలో ఆరేళ్ల చిన్నారిని హుస్సేన్‌సాగర్‌లోకి తోసేసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. నీటిలో పడిన చిన్నారి సమీపంలోని వెదురు కర్రను పట్టుకుని ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించింది. 'కాపాడండి.. మా అమ్మ నన్ను నీటిలో తోసేసింది' అంటూ కేకలు వేసింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న బోరబండ మోతీనగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి కె.బాలకృష్ణ చిన్నారి అరుపులను గమనించి రోడ్డుపై వెళ్తున్నవారిని సాయం కోరాడు. అదే సమయంలో అప్పర్ ట్యాంక్ బండ్ మీదుగా వెళ్తున్న బేగంపేట ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఫక్రుద్దీన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా నీటిలోకి దూకి, నాచారానికి చెందిన వ్యాపారి మహ్మద్ అఫ్సర్ సహాయంతో చిన్నారిని బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకుని చిన్నారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దోమలగూడ పోలీసులు చిన్నారి తల్లిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బషీర్‌బాగ్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫక్రుద్దీన్, బాలకృష్ణ, మహ్మద్ అఫ్సర్‌లకు సిపి సజ్జనర్ శాలువాలు కప్పి, నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఆపదలో ఉన్నవారిని చూసి సాయం చేయాల్సింది పోయి సెల్‌ఫోన్లలో వీడియోలు తీస్తూ ఉండిపోయే పరిస్థితుల్లో ఈ ముగ్గురు చూపిన తెగువ, సమయస్ఫూర్తి సమాజానికి ఆదర్శమని కొనియాడారు. బాలకృష్ణ అప్రమత్తం చేయడం, ఫక్రుద్దీన్, మహ్మద్ అఫ్సర్ చిన్నారిని రక్షించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పిల్లల అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఎంతటి మానసిక ఒత్తిడిని కలిగించినా కన్నబిడ్డల ప్రాణాలు తీసే నిర్ణయాలు పరిష్కారం కాదని సిపి హితవు పలికారు. కష్ట సమయంలో నైరాశ్యానికి లోనుకాకుండా సమాజం, ప్రభుత్వ వ్యవస్థల సహాయం కోరాలని సూచించారు.




## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక 'బతుకమ్మ'

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మకు తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సిపి రమేష్ పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, మహిళల ఐక్యతను చాటిచెప్పే పండుగ బతుకమ్మ పండుగని సిపి రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, వివిధ విభాగాలకు సంబంధించిన డిసిపిలు అన్నపూర్ణ, పుష్ప, రితిరాజ్, శేషాద్రిణి రెడ్డి, సృజన, సంజీవ్, ఎఐ జ్యోతిర్మయితో పాటు పోలీసు అధికారులు, కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖర్గేను కలిసిన డిసిసి అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ(డిసిసి) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. న్యూఢిల్లీలోని ఖర్గే నివాసంలో తెలంగాణ రాష్ట్ర నాయకులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక తేనీటి విందు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ఎంఎల్ఎ, నాయకులు పాల్గొన్నారు.

## ప్రాప్తి పోర్టల్‌లో బకాయిలపై హైకోర్టు స్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ల్యాంకో కొండపల్లి పవర్ లిమిటెడ్‌కు సంబంధించిన రూ.24.14 కోట్ల విద్యుత్తు బకాయిల వివాదంలో హైకోర్టు ఈనెల 28 వరకు స్టే విధించింది. ప్రాప్తి పోర్టల్‌లో నమోదు చేసిన ఇన్వాయిస్‌ల అమలును నిలిపివేస్తూ న్యాయమూర్తి మధ్యంతర ఆదేశాలను జారీ చేశారు. సిఇఆర్‌సి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ డిస్కంలు దాఖలు చేసిన అప్పీలుపై ఈనెల 28న ఎలక్ట్రిసిటీ అప్పిలెట్ ట్రైబ్యునల్ విచారణ జరగనున్న నేపథ్యంలో ఈ ఆదేశాలిచ్చారు.

## అబిడ్స్‌లో టవర్ అనుమతులపై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అబిడ్స్‌లో 35 అంతస్తుల మీనాక్షి ఎలీషియా టవర్ నిర్మాణానికి జిహెచ్‌ఎంసి అనుమతులు మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ సొసైటీ ఫర్ క్రూసేడ్ అగెనెస్ట్ కరప్షన్ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2022లో నిబంధనల కు విరుద్ధంగా అనుమతులిచ్చారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. తదుపరి విచారణ ఈనెల 29న జరుపుతామని న్యాయమూర్తి ప్రకటించారు.

## జస్టిస్ వినోద్‌కుమార్ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో యాక్టింగ్ చీఫ్ జస్టిస్ పి.సామ్‌కోశి ప్రమాణం చేయించారు. 2025 జూలైలో ఆయన తెలంగాణ హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. జస్టిస్ వినోద్‌కుమార్ తిరిగి వచ్చిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఆయనను ఘనంగా సన్మానించింది.

## కెటిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/కేశంపేట :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను బుధవారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కుమారుడు వై.మురళీకృష్ణ యాదవ్, కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు.

## కాప్రా చెరువు సుందరీకరణ పనులు త్వరగా పూర్తిచేయాలి

ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీలో కాప్రా చెరువు కట్ట సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. చెరువుకు అవుట్‌లేట్‌లో ఉన్న సమస్యలకు త్వరగా పరిష్కారం చూపాలని బుధవారం ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చెరువు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ చెరువు పనులకు సంబంధించిన నిధులు గతంలో రూ. 5 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. మిలినియం కాలనీ నుంచి కాప్రా చెరువు వరకు దాదాపు మరో రూ.7 కోట్ల పనులు మంజూరు దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కాప్రా చెరువు ఆవుట్ లేట్ పనులు పూర్తి అయితే దిగువన ఉన్న వాతవహన నగర్, సాయి గార్డెన్, గాంధీ నగర్, గాంధీ నగర్ సౌత్, స్నేహమయి కాలనీ, అఖిలాండేశ్వరి నగర్, పివీఆర్ కాలనీ, సామా నగర్ ఇతర కాలనీలు వరద ముంపు నుంచి విముక్తి పొందుతాయన్నారు. కార్యక్రమంలో కటికరెడ్డి అరవింద్ రెడ్డి, మునగాల రాఘవేంద్ర రావు, అనిల్ చౌదరి, పోగుల రాంబాబు, సందడి సందీప్‌రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టిఆర్‌పి డివిజన్ అధ్యక్షుడు ఎం.సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఉప్పరమోని రాములు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టి ఆర్‌డిఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రోడ్డు మధ్యలోనే పనులు ఎక్కడికక్కడే వదిలేశారని, దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ మార్గంలో నిత్యం సుమారు 150రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని, దాంతో తరుచు గేటు పడుతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గేటు పడిందంటే అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రజల ప్రాణ భద్రతను, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సకాలంలో స్పందించి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, జనార్ధన్, గుళ్ళ శ్రీనివాస్, ఆవ జగన్, దర్గా వెంకటేష్, డి.రాములు, అశోక్, గోపాల్, హరిప్రసాద్, గుండ్ల నవీన్, గుంటి శంకర్, రవికుమార్, శంకర్, అంజయ్య, శ్రీశైలం, రాజు, యాదగిరి పాల్గొన్నారు.



## 'ఎల్ నినో'పై జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/షాబాద్:** ఎల్ నినో ప్రభావం పై మండల స్థాయి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ ఆదేశించారు. బుధవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల నుంచి వచ్చే ఎడాది జూన్ 2027 వరకు అధికారులు ప్రభుత్వం చేపట్టిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రతి ఇంటి దగ్గర ఉన్న కులాయికి ఆన్ ఆఫ్ లాక్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని వివరించారు. గ్రామంలో తాగునీరుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల మేత కోసం ప్రస్తుతం ఉన్న పంటల నుండి వచ్చే గడ్డిని వృధా కాకుండా స్టోర్ చేసుకోవాలన్నారు. పశువుల కోసం ప్రత్యేకంగా పచ్చి గడ్డి పెంచుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు పనులు కల్పించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి కరువును అధికమించేందుకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తవ్వించాలని చెప్పారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఎల్ నినో ప్రభావం పై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే వచ్చే కరువును అధిగమించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అపర్ణ, ఎంపిఓ నాసరయ్య, మండల స్థాయి వివిధ రకాల డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని యువకుడి దారుణ హత్య

**ప్రజాపక్షం/కొత్తూరు:** గుర్తుతెలియని యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ పంచాయతీ శివారు డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ శివారులో సుమారు 25సంవత్సరాల యువకుడు హత్యకు గురైనట్లు తెలిపారు. క్లూస్ టీంతో ఆధారాలను సేకరించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఘటన స్థలానికి కేశంపేట సిఐ శ్రీనివాస్, నందిగామ ఎస్ఐ సుశీల, కొత్తూరు ఎస్ఐ సత్యశీలారెడ్డితోపాటు పోలీస్ సిబ్బంది చేరుకొని పరిశీలించారు

## ఏడు సంవత్సరాల బాలిక మిస్సింగ్



**ప్రజాపక్షం/షాబాద్ :** ఏడేళ్ల బాలిక మిస్సింగ్ అయిన సంఘటనలో కేసు నమోదు చేస్తున్నట్లు షాబాద్ ఎస్ఐ చెన్నారెడ్డి తెలిపారు. షాబాద్‌కు చెందిన చాకలి రమేష్–జ్యోతి దంపతుల కూతురు వాణిశ్రీ (7) కనిపించడం లేదని బుధవారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నారెడ్డి తెలిపారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే లక్ష్యం

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించాలన్నదే లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం కొందుర్గు మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనం, బిసి కమ్యూనిటి హాల్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పర్వతాపూర్ గ్రామానికి ఇప్పటి వరకు 37 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతోపాటు సిసిరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.40లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలో 107వీధి దీపాలను మంజూరు చేశామని వివరించారు. కొందుర్గు మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఎల్‌నిఒ ప్రబావంతో ప్రభుత్వ సూచనలు, సలహాలకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేసే విధంగా గ్రామాల్లో ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు.

**శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం...** కొందుర్గు మండల కేంద్రంలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్‌గా కావలి లక్ష్మయ్య ముదిరాజ్, సభ్యులుగా నరేందర్ గౌడ్, యాదగిరి ముదిరాజ్, సంజీవరెడ్డి, వెంకటేష్, అమర్ లింగం, రేణుక ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్ పర్సన్ అనిత జితేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్, మాజీ సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, సర్పంచ్‌లు ఆంజనేయులు, అమర్నాథ్‌రెడ్డి, నర్సింహులు, జంగయ్య, రాజ్‌కుమార్, శ్రీకాంత్, మాజీ ఎంపిటిసిలు అంజిరెడ్డి, మల్లేష్, పర్వతాపూర్ సర్పంచ్ అశోక్, సింగిల్‌విండో డైరెక్టర్ రత్నమ్మ రాములు పాల్గొన్నారు.

## పార్క్‌ను అభివృద్ధి చేస్తాం



**ప్రజాపక్షం/బేగంపేట్:** వీలైనంత త్వరగా పార్క్‌ను అభివృద్ధి చేసి కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్టలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న లైబ్రరీ బిల్డింగ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బల్దియా ఎఇ చంద్రశేఖర్, వాటర్ వర్క్స్ జిఎం వెంకట్‌రెడ్డి, విద్యుత్ ఎఇ శివరామకృష్ణ, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, బిఆర్‌ఎస్ నేతలు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, కిషోర్, కోటేశ్వర్ గౌడ్, గణేష్, జనార్ధన్, చంద్రప్రకాష్, కాలనీ వాసులు సత్యనారాయణ, మిట్టు, నరేష్, సురేష్, గంగరాజు, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** జీటీఎస్ దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మముహూర్తంలో దుర్గాసూక్తం, పంచ సూక్తాలు, రుద్ర నమక చమకాలతో అభిషేకం నిర్వహించి, అనంతరం చండీ హోమం జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు.జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సతీమణి వర్షా యాదవ్ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని చండీ హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం ఈవో గుమ్మడిదల సుధాకర్ ఆమెను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## విద్యుదాఘాతంతో ఇళ్లు దగ్ధం



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** విద్యుదాఘాతం కారణంగా ఇళ్లు దగ్ధం కావడంతో బాధితులు రోడ్డు పాలయ్యారు. ఈ క్రమంలోనే బుధవారం ఫిలింనగర్ డివిజన్ గురుబ్రహ్మనగర్‌లో నివాసముంటున్న సత్యమాల ఇళ్లు ఉదయం 11 గంటల సమయంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యింది. స్థానికులు డివిజన్ అధ్యకుడు కాటూరి రమేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఆయన అధికారులకు సమాచారం అందించి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం త్వరగా అందేలా చూడాలని కోరడం జరిగింది. కాగా తనవంతుగా కాటూరి రమేశ్ తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది.

## సింహవాహిని ఆలయంలో పూజలు



**ప్రజాపక్షం/చార్మినార్:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం చారిత్రాత్మక, ప్రసిద్ధి చెందిన లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టు సాయి కుమార్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మెట్టు సాయి కుమార్‌కు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకటేష్ తదితరులు మెట్టు సాయి కుమార్‌కు శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు తిరుపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అందరిలో ఆనందం నింపాలి

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్మయంగా కృషి చేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావు గౌడ్ కోరారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిలకలగూడలోని కట్టమైసమ్మ దేవాలయాన్ని ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి బుదవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దసరా సందుగకు ప్రాముఖ్యత ఉందని, ప్రజలు ఆనందంగా పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువనేత తీగుళ్ల కిషోర్ కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యులతో పాటు ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, కార్యానిర్వహణాధికారి మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గాదేవి పూజలు



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** దుర్గాదేవి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే వెంగళరావునగర్ కాలనీలోని టీ జంక్షన్ వద్ద దుర్గాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద బుధవారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకల వెంకటేశ్వరరావు, డి.ధనుంజయరెడ్డి, రాజేందర్, కృష్ణ, చంటి తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు.

ఖాకీ దళానికి నాయకత్వ పాఠశాల..

# హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీ!

- ఇక్కడే ఐపిఎస్ అధికారులకు తొలి అడుగులు..
- క్రమశిక్షణ, నైపుణ్యం, ప్రజాసేవకు ప్రత్యేక శిక్షణ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ పోలీసు వ్యవస్థకు సమర్థవంతమైన నాయకులను తీర్చిదిద్దే ప్రతిష్ఠాత్మక శిక్షణా కేంద్రం సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్‌విపిఎన్‌పిఎ). దేశవ్యాప్తంగా అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్ష ద్వారా ఎంపికైన ఐపిఎస్ అధికారులకు ఇక్కడే ప్రాథమిక శిక్షణ అందిస్తారు. చట్టాలపై అవగాహన నుంచి నేర పరిశోధన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో వ్యవహరించే విధానం వరకు అనేక అంశాల్లో శిక్షణనిస్తూ భావి పోలీసు అధికారులను తీర్చిదిద్దుతారు. అక్టోబర్ 15న జరగనున్న 78వ రెగ్యులర్ రిక్రూట్ (2025 బ్యాచ్) ఐపిఎస్ ప్రొబేషనర్ల దీక్షాంత్ పరేడ్ నేపథ్యంలో ఈ అకాడమీ ప్రాధాన్యం మరోసారి చర్చనీయాంశంగా మారింది.స్వాతంత్ర్యానంతరం దేశవ్యాప్తంగా పోలీసు అధికారులకు ఒకే విధమైన శిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో జాతీయ స్థాయి పోలీసు శిక్షణ సంస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆలోచనలకు అనుగుణంగా 1948లో మౌంట్ అబూలో ఈ సంస్థ ఏర్పాటైంది. అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. 1967లో నేషనల్ పోలీస్ అకాడమీగా పేరు మార్చగా, 1974లో సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేరును జోడించారు. ప్రస్తుతం తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని పచ్చని కొండల మధ్య సుమారు 293 ఎకరాల విస్తీర్ణంలో అకాడమీ ఉంది. ఐపిఎస్ ప్రొబేషనర్ల శిక్షణలో కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి విధులకు అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. నేర పరిశోధన, నేర న్యాయ చట్టాలు, ఫోరెన్సిక్ పరిజ్ఞానం, నేరశాస్త్రం, ప్రజా శాంతిభద్రతల నిర్వహణ, అంతర్గత భద్రత, ఆయుధ వినియోగం, క్షేత్రస్థాయి వ్యూహాలు, నాయకత్వం, నిర్వహణ నైపుణ్యాలు వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. మానవ హక్కులు, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, ప్రజల పట్ల సున్నితంగా వ్యవహరించడం వంటి అంశాలకూ ప్రాధాన్యం ఉంటుంది. తద్వారా శిక్షణ పూర్తిచేసిన అధికారులు తొలుత సహాయ పోలీసు సూపరింటెండెంట్లుగా బాధ్యతలు చేపట్టి, అనంతరం ఉన్నత స్థాయి పదవుల్లో విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతారు. మారుతున్న నేరాల స్వరూపం, సైబర్ నేరాలు, ఉగ్రవాద ముప్పులు, పేలుడు పదార్థాల వినియోగం వంటి సవాళ్లను ఎదుర్కొనేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలనూ అకాడమీ నిర్వహిస్తోంది. కొత్తగా ఎంపికైన ఐపీఎస్ అధికారులతో పాటు వివిధ స్థాయుల్లో పనిచేస్తున్న సీనియర్ పోలీసు అధికారులకు మధ్యకాలిక శిక్షణా కార్యక్రమాలు, రాష్ట్ర పోలీసు శిక్షణ సంస్థల బోధకులకు ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తుంది. రాష్ట్ర పోలీసు సేవల నుంచి ఐపీఎస్‌కు పదోన్నతి పొందిన అధికారులకు కూడా శిక్షణ అందిస్తుంది. నేపాల్, భూటాన్, మాల్దీవులు వంటి మిత్రదేశాల పోలీసు అధికారులకూ వివిధ శిక్షణా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తోంది.

**దీక్షాంత్ పరేడ్.. బాధ్యతల వైపు తొలి అడుగు..**

అకాడమీలో శిక్షణ పొందిన ఐపీఎస్ ప్రొబేషనర్లు తమ శిక్షణను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే దీక్షాంత్ పరేడ్ అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం. క్రమశిక్షణ, సమన్వయం, వృత్తి నిబద్ధతను ప్రతిబింబించే ఈ పరేడ్ అనంతరం అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో పోలీసు సేవల్లో కీలక బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించడమే వారి ముందున్న ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో 78వ రెగ్యులర్ రిక్రూట్ (2025 బ్యాచ్) ఐపిఎస్ ప్రొబేషనర్ల దీక్షాంత్ పరేడ్‌కు సంబంధించి అక్టోబర్ 15న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీలో మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పరేడ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. దేశ పోలీసు వ్యవస్థకు నాయకత్వం వహించే అధికారులను తీర్చిదిద్దడంలో హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీ కీలక పాత్ర పోషిస్తోంది.

## ఉద్యోగ భద్రత కల్పించాలి..

బాలల పరిరక్షణ సిబ్బంది ధర్నా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాలల పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన జిల్లా బాలల పరిరక్షణ యూనిట్లు (డిసిపియు), చైల్ హెల్ప్‌లైన్ సిబ్బంది బుధవారం హైదరాబాద్‌లోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జనగాం, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో విధుల నుంచి తొలగించిన అనుభవజ్ఞులైన సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మిషన్ వాత్సల్య సిబ్బందికి హెచ్ ఆర్ పాలసీని అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత, ప్రసూతి సెలవులు, ప్రమాద బీమా, ఇతర సంక్షేమ సదుపాయాలు కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా బాలల పరిరక్షణ విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, తొలగించిన అనుభవజ్ఞులను అందుబాటులో ఉన్న ఖాళీల్లో పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం శాఖ డైరెక్టర్ శృతి ఓజాను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు.

## ఎండోస్కోపిక్ సర్జరీతో మెరుగైన ఫలితాలు డాక్టర్ పెద్దినేని అనుదీప్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వృద్ధుల్లో వెన్నెముక అరుగుదలతో వచ్చే నడుము నొప్పి, కాళ్లలో తిమ్మిరి, నడవడంలో ఇబ్బందులకు ఆధునిక ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీతో ఉపశమనం పొందవచ్చని మెడికవర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జన్ డాక్టర్ పెద్దినేని అనుదీప్ తెలిపారు. ప్రపంచ వెన్నెముక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుబిఇ విధానంలో రెండు చిన్న కోతల ద్వారా నరాలపై ఒత్తిడిని తగ్గించి, తగిన రోగులు త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. వయసు పెరిగిందని వెన్నెముక సమస్యలతో బాధపడాల్సిన అవసరం లేదని, రోగి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి సరైన చికిత్స అందిస్తే నొప్పి తగ్గడంతో పాటు నడిచే సామర్థ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. నడుము నొప్పి నిరంతరంగా ఉండటం, కాళ్లలో బలహీనత, నడకలో ఇబ్బందులు కనిపిస్తే స్పైన్ నిపుణులను సంప్రదించాలని సూచించారు. క్రమబద్ధమైన వ్యాయామం, సరైన శరీర భంగిమ వెన్నెముక ఆరోగ్యానికి దోహదపడతాయని తెలిపారు.

## అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నగర పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు కన్వీనర్ నల్లెల్ల కిషోర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దని హితవు పలికారు. మూసీ నది అభివృద్ధి పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు. సెక్షన్ 22ఎ నిషేధిత భూముల జాబితా నిజమైన ఆస్తి యజమానులకు న్యాయం చేయాలన్నారు. హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాల సమస్యలు ప్రకటనలు కాదని, క్షేత్రస్థాయిలో పరిష్కారాలు కావాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు హామీలకు బదులుగా స్పష్టమైన నియామక క్యాలెండర్ ప్రకటించాలన్నారు. మీడియా సమావేశంలో మాజీ కార్పోరేటర్ పి.బాలరాజ్‌గౌడ్, శ్యామ్ సుందర్, తడక వినోద్, భాను ప్రకాష్, కరణం కరణ్, ఎస్.ప్రకాష్, శక్తిప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## సుక్కమ్మ బస్తీ వాసుల ఇబ్బందులు దూరం

జవహర్ నగర్‌లో ఘనంగా సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** జవహర్ నగర్ డివిజన్ సుక్కమ్మ బస్తీలో ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. కాలనీలో దెబ్బతిన్న రోడ్ల కారణంగా పడుతున్న ఇబ్బట్లకు తెరదించుతూ, నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ గుప్తాతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ సంగారెడ్డి శారదా మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్,ముఖ్య అతిథులుగా విచ్చేసి కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుక్కమ్మ బస్తీలో రోడ్లు పూర్తిగా దెబ్బతిని స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీ వాసుల విజ్ఞప్తిని తక్షణమే స్పందించి సీసీ రోడ్డు మంజూరు చేయించామని చెప్పారు. అంతేకాకుండా, నాణ్యతా ప్రమాణలతో కూడిన ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. జవహర్ నగర్ డివిజన్ సర్వత్రా అభివృద్ధి చెందడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, స్పష్టం చేశారు.గతంలో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. రోడ్లతో పాటు కాలనీలో ఉన్న డ్రైనేజీ తాగునీటి సమస్యలను కూడా త్వరలోనే పూర్తిగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఎల్ల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ గౌడ్, సుబ్రహ్మణ్యం, గజ్వేల్ శంకర్, రఫీక్, మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు మాట్లా శ్రీనివాస్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మాట్లా వినయ్, వీర్ల బుజంగం, విజయ్ రాయ్, గండి సునీత, డిఎస్ఎస్ వెంకటేష్, నాయకం భాస్కర్, కొలిపాక సాయి కిరణ్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం రాజు, వీరభాస్కర్ రాజు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర ఎస్‌టి కమిషన్ తేవాలి

ఆదివాసీ సంఘాల జెఎసి డిమాండ్




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఉమ్మడి ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను వెంటనే విభజించి, షెడ్యూల్, పెసా, ఎల్‌టిఆర్, ఫారెస్ట్ రైట్స్ చట్టాల అమలును పర్యవేక్షణకు స్వతంత్ర ఎస్‌టి కమిషన్ తేవాలని ఆదివాసీ సంఘాల జెఎసి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఐటిడిఎ పరిధులలో స్థానిక ఆదివాసీ మేధావులు, గిరిజన పెద్దలతో కూడిన ఆదివాసీ గిరిజన సంక్షేమ సలహా కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఆదివాసీల రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా బుధవారం హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీల 'ఆత్మఘోష ధర్నా' తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గూడెం గణేశ్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్ హాజరై, మాట్లాడారు. దశాబ్దాలుగా ఆదివాసీలు సాగు చేసుకొంటున్న పోడుభూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం కింద వెంటనే పట్టాలివ్వాలని కోరారు. అటవీశాఖ అధికారులు ఆదివాసీలపై వేధింపులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య,కమిటీ జాతీయ అధ్యక్షులు వెంకట రమణ, ఆధార్ సొసైటీ మెట్ల పాపయ్య, తుడుం దెబ్బ జాతీయ కో-కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, జెజె రాంబాబు, పాయం సత్యనారాయణ మాట్లాడారు. ఆదివాసీ ఎమ్మెల్యేను మాత్రమే గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా నియమించాలన్నారు. షెడ్యూల్డ్ ఏరియాల్లోని స్థానిక ఉద్యోగాలను స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని, ప్రత్యేక రిక్రూట్‌మెంట్ చట్టాన్ని తేవాలని కోరారు. తమ డిమాండ్లను, సమస్యలపై ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షంలో తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ ఒయు అధ్యక్షులు అజయ్ కుమార్, మన్నె సీమ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య వందలాది మంది ఆదివాసీ నేతలు పాల్గొన్నారు.

## కార్మికుల సేవలు వెలకట్టలేనివి



**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆశా వర్కర్లు, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మ ణ్ కొనియాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని మధురానగర్లో బౌద్ధనగర్ బిజెపి నాయకురాలు మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, జీహెచ్‌ఎంసి సిబ్బందికి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ డాక్టర్ కె. లక్ష్మ ణ్ కార్మికులకు చీరలను అందజేసి మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు, నగర పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నాయకుడు సారంగపాణితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి దేవాలయం శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాల్గవ రోజు ధాన్యలక్ష్మి అ లంకరణలో కొలువైన పద్మావతి అమ్మవారికి ఆలయ మాజీ ధర్మకర్త కొమిరెల్లి సుధాకర్‌రెడ్డి,అనిత(నాగారం మాజీ కౌన్సిలర్) దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు వెంకటరమచార్యులు,నారాయణచార్యులు,వేణుగోపాలచార్యులు, ఆశీర్వచనాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోరిక్షా బ్లాక్ మార్కెట్ దందా అరికట్టాలి



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** ఆటోరిక్షా బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టాలని మహాత్మ గాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి కన్వీనర్ మహమ్మద్ అమనుల్లాఖాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఆయన మాట్లాడారు. నగరంలో ఆటో షోరూం యజమానులు ఇష్టానుసారంగా ఎల్‌పిసి, సిఎన్‌జి, ఎలక్ట్రిక్ ఆటోలను అధిక ధరలకు విక్రయిస్తూ అందినకాడికి దోచుకొంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఈ ఏడాది సెప్టెంబర్ 28న జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి.. పోలీసు, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌బిఐ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదన్నారు. షోరూం యజమానులు నిబంధనల ప్రకారం ఆటోరిక్షాలు విక్రయించేవరకు తమ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. సమావేశంలో జెఎసి నేతలు డైమండ్ సలీం, మహమ్మద్ లతీఫ్, ముజాహిద్ హాష్మీ పాల్గొన్నారు.

## ఈరవత్రి అనిల్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి : పున్న గణేశ్



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** చేనేత కార్మికుల సంక్షేమం, సహకార హక్కులు, బిసిల రాజకీయ సాధికారత కోసం నిర్విరామంగా కృషిచేస్తున్న ప్రజానేత, మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పద్మశాలి సంఘం ఎల్‌బి నగర్ సర్కిల్ అధ్యక్షులు పున్న గణేశ్ నేత, ప్రధానకార్యదర్శి గడ్డం లక్ష్మీ నారాయణ సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. చేనేత సహకార, ప్రజాసేవ, కార్మిక సంక్షేమ రంగాల్లో విశేష అనుభవం ఉన్న ఈరవత్రి అనిల్ ఎమ్మెల్సీ పదవికి పూర్తి అర్హుడని, ఆయనకు సమస్త పద్మశాలి, బిసి సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని స్పష్టంచేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేనేత ప్రాథమిక సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రజాప్రభుత్వం రాగానే సహకార ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగేలా అనిల్ కృషి చేశారని తెలిపారు. గల్ఫ్ దేశాలకెళ్లి ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేయించడంలో అనిల్ కీలక భూమి పోషించారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిహెచ్‌ఎంసి అధ్యక్షులు కత్తుల సుదర్శన్, నేతలు తడక యాదగిరి, చెరుపల్లి ప్రభాకర్, కర్నాటి విజయ్, తులసీదాస్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ కాలనీలో అష్టాదశ దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, కేటీఆర్ కాలనీలో అంగరంగ వైభవంగా శ్రీ అష్టాదశ దుర్గాదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు జరిగాయి. బిఆర్‌ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ వాకలపూడి రవికిరన్‌ల ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపంలో ప్రత్యేకంగా ఆర్టిషిపియల్‌గా దుర్గామాతను రూపొందించి కన్నులపండువగా ప్రతిరోజు అమ్మవారు పూజలందుకున్నారు. అంతేకాకుండా ప్రతిరోజు హరికథ నా టక ప్రదర్శన, వాగ్గేయ ఒగ్గు కథలు, భజన కార్యక్రమాలతో కాలనీ అత్యంత శోభాయమానంగా అమ్మవారు పూజలందుకుంటున్నారు. ఈ సందర్భంగా రంగరాయ ప్రసాద్ మాట్లాడుతూ ఎలాంటి రంగులతో తయారుచేయకుండా నవరాత్రుల పాటు ప్రతిరోజూ గడ్డి, కర్రలు పలు రకాల పర్యావరణానికి హాని కలిగించని వస్తువులతో అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు తయారు చేసి అలంకరించడం జరుగుతుందని తెలిపారు. కథలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అమ్మవారి కృపా, కటాక్షలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు.

# నిరసన చేస్తున్న విద్యార్థులకు అడ్డు రావద్దు

## వారు దేశానికి గొంతుక : మోదీకి రాహుల్ హెచ్చరిక



**న్యూఢిల్లీ :** 'నిరసన చేస్తున్న విద్యార్థులు దేశానికి గొంతుక. వారికి అడ్డు రావద్దు' అని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని హెచ్చరించారు. 'సర్' ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా గాయపడిన కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐకి చెందిన విద్యార్థులతో సహా కొంతమంది విద్యార్థులను కలిసిన అనంతరం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని 10, జనపథ్‌లోని సోనియా గాంధీ నివాసంలో కాంగ్రెస్ నాయకుడు బాధిత విద్యార్థి విభాగనం నాయకులను కలిశారు. ఇటీవలి నిరసనల సమయంలో విద్యార్థులకు వ్యతిరేకంగా వ్యవహరించిన ప్రధానమంత్రి నుండి పోలీస్ కానిస్టేబుల్ వరకు అందరిపై చర్య తీసుకుంటామని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. నిరసన చేస్తున్న విద్యార్థులలో కొందరు, తమను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసు సిబ్బంది తమ పట్ల అమానుషంగా ప్రవర్తించారని, పోలీసులు తమను ఎలా కొట్టారో కూడా వివరించారు. నిరసనలలో పాల్గొన్నందుకు పోలీసులు తమ మర్మాంగాలపై కూడా కొట్టారని, తరచుగా దూషించారని, దీంతో తమకు తీవ్ర గాయాలయ్యాయని విద్యార్థులు ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్, 'సర్'కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఇటీవల చేపట్టిన ఆందోళనల సందర్భంగా, పెద్ద సంఖ్యలో నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని, నగరానికి దూరంగా ఉన్న నిర్బంధ కేంద్రాలకు తరలించారు. కాంగ్రెస్ వారికి అండగా ఉంటుందని, భయపడవద్దని రాహుల్ గాంధీ విద్యార్థులకు చెప్పారు. వారిని పార్టీ 'షేర్‌లు', 'షెర్నీలు' (సింహాలు, ఆడ సింహాలు)గా ఆయన అభివర్ణించారు. ఒక విద్యార్థినిని 'మన షెర్నీ'గా పరిచయం చేస్తూ, 'ఆమె దెబ్బలు తిన్నది, కానీ భయపడలేదు. ఆమె హృదయంలో ద్వేషం లేదు' అని ఆయన అన్నారు. మోదీ, హోం మంత్రి అమిత్ షా ప్రజల గొంతుకకు అండగా నిలుస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'నేను నా పత్రికా సమావేశంలో చెప్పినట్లుగా, ఇది భారత దేశం. అమిత్ షాజీ, దయచేసి జాగ్రత్తగా చూడండి, వారందరూ కలిసే ఉన్నారు. ముస్లిం, హిందూ, కులం, లింగ భేదం లేదు... వారందరూ కలిసే ఉన్నారు. ఇది హిందుస్థాన్' అని ఆయన అన్నారు. గాయపడిన విద్యార్థులందరినీ భుజం భుజం కలిపి నిలబడమని ఆయన కోరారు. 'ప్రతి విద్యార్థిని వీడియోలు తీయమని, తమ వద్ద సాక్ష్యాలు ఉంచుకుని మాకు పంపమని నేను కోరానని పోలీసులకు ప్రేమతో చెప్పాలనుకుంటున్నాను. ఈ మొత్తం ఉదంతం ముగిసినప్పుడు, మేము న్యాయం పొందుతాము, మా విద్యార్థులను కొట్టిన వారిని, నరేంద్ర మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ నుండి మా పిల్లలపై చేయి చేసుకుంటున్న కానిస్టేబుళ్లందరి వరకు, పై నుండి క్రింది వరకు శిక్షిస్తాము' అని ఆయన ఉద్ఘాటించారు. తరువాత, హిందీలో ఒక పోస్ట్‌లో 'పోలీసుల క్రూరత్వం లేదా చట్టవిరుద్ధమైన నిర్బంధాన్ని ఎదుర్కొన్న ప్రతి విద్యార్థి, యువకులు దానికి సంబంధించిన పూర్తి రికార్డును వీడియోలు లేదా ఫోటోలను ఉంచుకోవాలని నేను కోరుకుంటున్నాను. ఇవి చాలా అవసరం. శాంతియుత నిరసన మీ హక్కు. దీనిని ఎవరూ లాక్కోవడానికి మేము అనుమతించము' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

# రైల్వే ఉద్యోగులకు దసరా బోనస్

- కేంద్ర మంత్రివర్గం నిర్ణయంః రూ.2009.61 కోట్లు విడుదల
- 11.40 లక్షలమంది అద్భుత పనితీరుకు ప్రోత్సాహం
- పండుగముందే చెల్లింపు

**న్యూఢిల్లీ:** అద్భుతమైన పనితీరు ప్రదర్శించిన రైల్వే ఉద్యోగులకు కేంద్రమంత్రివర్గం దసరా పర్వదినం సందర్భంగా బోనస్ ప్రకటించింది. ఉత్పాదకతతో ముడిపెట్టి, వారి పనితీరును పరిశీలించి ఆ ప్రాతిపదికపై ఎంపిక చేసిన 11 లక్షల 40వేల 770 మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజులకు బోనస్ మంజూరు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీఅధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం తీర్మానం చేసింది. ఈ మేరకు చెల్లింపుల నిమిత్తం రూ.2009.61 కోట్లు నిధులు విడుదల చేసింది. అర్హుడైన ప్రతి ఉద్యోగికీ గరిష్ఠంగా రూ.17,951 లు చేతికి వస్తాయి. ట్రాక్ నిర్వాహకులు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు(గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్‌మెన్, మినిస్టీరియన్ సిబ్బంది, గ్రూప్–సికి చెందిన ఇతర సిబ్బందిలో అర్హులకు ఈ బోనస్ లభిస్తుంది. పండుగ పర్వదినానికి ముందుగానే చెల్లింపులు చేస్తారు. దీంతో దేశీయ మార్కెట్లకు కొత్త కళ సంతరించుకుంటుంది. భారీగా దేశీయ విక్రయాలు పెరుగుతాయి. పిఎల్‌బి (ఉత్పాదకతో ముడిపడిన బోనస్) పేరుతో ఈ చెల్లింపులు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి ఏడాది దుర్గాష్టమినాడు లేదా దసరా రోజుల్లో ఈ బోనస్‌లు చెల్లిస్తూ ఉంటారు. 2025–26లో రైల్వే పనితీరు ఎంతో బాగుందని మంత్రివర్గం ప్రశంసించింది. 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా రైల్వే ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో జరిగిందని, 741 కోట్లమంది ప్రయాణికులు రైళ్ళను ఉపయోగించుకున్నారని మంత్రివర్గం పేర్కొంది.



**ఇడ్బీలో పెట్టుబడి ఉపసంహరణ ఎఫ్‌డిఐకి మోదీ ఆమోదం**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డిఐ)లను ఆహ్వానించడంలో భాగంగా భారత పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (ఇడ్బీ)లో 60.72 శాతం వాటాను ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్సియల్ హోల్డింగ్స్‌కు విక్రయించాలని కేంద్రమంత్రివర్గం నిర్ణయించింది. దీంతో ప్రభుత్వ అధీనంలోని బ్యాంకుల ప్రైవేటీకరణలో ఈ నిర్ణయం ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకనున్నది. రూ.52,878 కోట్లకు ఈ వాటాను విక్రయించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థికవ్యవహారాల మంత్రివర్గ కమిటీ(సిసిఇఎ) ఒక తీర్మానం చేయడంతో గడచిన ఐదేళ్ళుగా జరుగుతున్న ఈ ప్రక్రియకు తెరపడింది. ఈ ప్రక్రియ పూర్తయితే భారత ఆర్థికరంగం ఇప్పటివరకూ ఆకర్షించిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇదే అవుతుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. కేంద్ర సమాచార, ప్రసారాలశాఖామంత్రి అశ్వనీవైష్ణవ్ కూడా మీడియాతో మాట్లాడుతూ, ఇడ్బీని ఎఫ్‌డిఐతో పునర్వ్యస్థీకరించిన తర్వాతప్రభుత్వం–ఎల్‌ఐసి రెండూ కలిసి 34 శాతం వాటా కలిగి ఉంటాయని చెప్పారు.ఇప్పటివరకూ ప్రభుత్వం–భారత జీవిత బీమా సంస్థ అధీనంలో ఉన్న 60.72 శాతం వాటాను ఫెయిర్‌ఫాక్స్‌కు బదలీ చేస్తామని,ఈ బదిలీకి సంబంధించిన ప్రక్రియ ఆమోదాలు జరుగుతాయన్నారు.రూ.52.877.07 కోట్ల వాటాను మెస్సర్స్ ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్సియల్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు చెందుతుందని, ఇదే వ్యూహాత్మకమైన కొనుగోలు దారు అని చెప్పారు.ఇందులో 30.48 శాతం ఈక్విటీ కేంద్ర ప్రభుత్వ అధీనంలో,30.24 శాతం ఎల్‌ఐసి అధీనంలో ఉంటుందని చెప్పారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే ఈ ఒప్పందం ప్రక్రియ పూర్తి కాగలదని పెట్టుబడులు,ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం(డిఐపిఎఎం) కార్యదర్శి అరునీశ్ ఛావ్లా చెప్పారు.ఐతే ఫెయిర్‌ఫాక్స్ కూడా మైనారిటీ షేర్‌హోల్డర్లకు ఓపెన్ ఆఫర్ ఇచ్చింది. ఎయిర్ ఇండియాను విక్రయించిన తర్వాత భారత ప్రభుత్వం చేసిన అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ఇదే.పెట్టుబడుల రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా ప్రభుత్వరంగంలోని సంస్థల ఆస్తులలో భారీ యాజమాన్య వాటాను తగ్గించుకుఏందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఇది ఒక ప్రముఖ ఘట్టంగామారింది.

**మరో ఐదేళ్ళు దివ్యాంగుల పింఛన్లు**

దివ్యాంగుల పింఛన్‌కు సంబంధించిన ఎన్ఎస్ఎపి(జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం)ని మరో ఐదు సంవత్సరాలపాటు కొనసాగించేందుకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది.ఐతే ఈ పథకం వర్తింపజేయడానికి అర్హులైన లబ్దిదారులను గుర్తించే అర్హతల ప్రామాణికతలను మార్పు చేశారు. ఇప్పటివరకు ఎన్ఎస్ఎపి పేరుతో ఉన్న ఈ పథకం పేరును ప్రధానమంత్రి సామాజిక్ సహాయత యోజన(పిఎంఎస్ఎస్‌వై)గా మార్పు చేస్తారు. 2026–27 నుండి 2030–31 వరకూ పిఎంఎస్ఎస్‌వై పేరుతో ఈ కార్యక్రమం కొనసాగుతుంది.సవరించిన ఈ పథకం కింద దివ్యాంగులైన లబ్దిదారులకు 79 ఏళ్ళు వయసు వచ్చే వరకూ నెలనెలా రూ.375లు లభిస్తుంది. ఆ తర్వాత నుండీ 80 ఏళ్ళు పైబడినవారికి రూ.625లు వస్తాయి.దివ్యాంగులకు శారీరక వైకల్యశాతం అర్హతను 80 శాతం నుండి 40 శాతానికి తగ్గించారు.కనీస వయసు అర్హతను కూడా తొలగించారు.పుట్టుకనుండే వారికి ఈ గుర్తింపు లభిస్తుంది. అదేవిధంగా వయోజనులు,వితంతువులకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకంతోపాటు పెన్షన్ పథకం ప్రస్తుతం ఉన్న రూపంలోనే కొనసాగుతుంది.36 రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలలో 3.20 కోట్ల మంది లబ్దిదారులకు ఈ పథకంవల్ల ప్రయోజనం కలుగుతుందని కేంద్రమంత్రివర్గం అంచనావేసింది.ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం పేరును ''ప్రధానమంత్రి వృద్ధావస్థ పెన్షన్ యోజన''అనే పేరుగా మార్పు చేశారు.అదేవిధంగా ఇందిరాగాంధీ జాతీయ వితంతు పెన్షన్ పథకం పేరును ప్రధానమంత్రి విధవాపెన్షన్ యోజన అనే పేరుతో పిలుస్తారు.ఇందిరాగాంధీ జాతీయ దివ్యాంగుల పెన్షన్ పథకం పేరును కూడా ''ప్రధానమంత్రి దివ్యాంగజన్ పెన్షన్ యోజన'' అని మార్పు చేశారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం పేరును కూడా ప్రధానమంత్రి పరివార్ లబ్ద్ యోజన అని మార్పు చేశారు.

కాగా ఎన్ఎస్ఎపి పథకాన్ని పేద నివాసితులకోసం కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా 1995 ఆగస్టు 15వ తేదీన ప్రారంభించారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో 41వ నిబంధనకు అనుగుణంగా ఈ పథకం ప్రవేశపెట్టారు.ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నూటికినూరుశాతం సహాయాన్ని సమకూరుస్తుంది. సవరిం,ఇ నిబంధనల కింద దివ్యాంగత్వాన్ని 40 శాతానికి తగ్గించారు.

## వాణిజ్య ఒప్పందంపై విభేదాల పరిష్కారం...

# ముగింపు దశకు భారత్–అమెరికా చర్చలు

- విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడి



**న్యూఢిల్లీ :** ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై ఉన్న విభేదాలను పరిష్కరించుకోవడానికి భారత్, అమెరికా చర్చలు కొనసాగిస్తున్నాయని, ఈ సంప్రదింపులు ఒక ముగింపు దశకు చేరకున్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ బుధవారం వెల్లడించారు. అయితే, ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన మౌలిక అంశాలు మారలేదని ఆయన చెప్పారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు ఒక స్తబ్ధత'కు చేరుకున్నాయని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన వారం రోజుల తర్వాత, వాణిజ్య చర్చలపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. మేం కొన్ని విషయాల కోసం ఎదురుచూస్తున్నామని నేను అనుకుంటున్నాను. బహిరంగంగా వివరాలు చెప్పడానికి నేను సుఖంగా ఉండను' అని ఇరుపక్షాల మధ్య చర్చల స్థితి గురించి అడిగినప్పుడు మంగళవారం సాయంత్రం బ్లూమ్ బెర్గ్ ఎకనామీ ఫోరమ్‌లో ఆయన అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు భారత వాణిజ్య మంత్రి, యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) ఇతర సంబంధిత అధికారులు చర్చల్లో నిమగ్నమై ఉన్నారని జైశంకర్ తెలిపారు.'అమెరికా వంటి ఆర్థిక వ్యవస్థతో దేశాలు చర్చలు జరిపేటప్పుడు, సహజంగానే అందులో ఒక అంశం మీరు అమెరికాతో నేరుగా కుదుర్చుకునే ఒప్పందాలకు సంబంధించినది కాగా, మరొక అంశం పోటీదారులైన ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే మీ పరిస్థితి ఎలా ఉందనే దానికి సంబంధించినది. 'ఆ విషయం ఇంకా పూర్తిగా స్పష్టంగా లేదు. ఎందుకంటే అందరూ ఇంకా ఆ ఒప్పందానికి రాలేదు. వాణిజ్య మంత్రులు అక్కడి యుఎస్‌టిఆర్, మన వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి దానిపై పనిచేస్తున్నారని నేను భావిస్తున్నాను. వారు దానిని పరిష్కరిస్తున్నారు' అని ఆయన అన్నారు. 'ఈ సమస్య ఒక కొలిక్కివచ్చే దిశగా పయనిస్తోందని నా భావన' అని జైశంకర్ అన్నారు. సుంకాల ఘర్షణను పరిష్కరించడం, సుంకేతర అడ్డంకులను తొలగించడం, మార్కెట్ ప్రాప్యతను పెంచడం వంటి లక్ష్యాలతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై భారత్–అమెరికా 2025 ఆరంభం నుంచి చర్చలు జరుపుతున్నాయి. భారత దేశం తన వస్తువులపై పోటీదారుల కంటే మెరుగైన సుంకాలను కోరుతోంది. ఈనెల ప్రారంభంలో, అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ మాట్లాడుతూ, అమెరికా, భారత్ ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కృషి చేస్తున్నాయని, అయితే, ఒప్పందం తక్షణం కుదిరే అవకాశం లేదని అన్నారు. ఇరుపక్షాలు పరిష్కారం కాని సమస్యలను గుర్తించి, ఒక ఒప్పందం దిశగా కృషి చేస్తున్నాయని జెమీసన్ గ్రీర్ చెప్పారు. అమెరికా తన కూటములు, ఒప్పంద సంబంధాల నిబంధనలను సవరిస్తోందని, ఈ ప్రభావం ఐరోపాలో అత్యంత బలంగా కనిపిస్తోందని, తూర్పు ఆసియాలోని కొన్ని దేశాలలో కొంతమేరకైనా ఈ ప్రభావం కనిపిస్తోందని మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రోతో సహా ప్రధాన అంతర్జాతీయ, భారతీయ ఐటి సంస్థలకు సంబంధించిన కీలక గ్రీన్‌కార్డు ప్రాసెసింగ్ కార్యక్రమంపై అమెరికా ఆంక్షలు విధించాలని నిర్ణయించడంతో ఇరు దేశాల సంబంధాలు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి.

# విమానం నుంచి హైజాక్ హెచ్చరిక

## జైపూర్‌లో అత్యవసర ల్యాండ్ అయిన ఎయిర్ ఇండియా విమానం




**జైపూర్ :** జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. విమానం నుంచి హైజాక్ సంకేతాలు రావడంతో అప్రమత్తమైన సిబ్బంది జైపూర్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అయితే, ఈ హైజాక్ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. తొలుత బాంబు బెదిరింపులు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. భద్రతా తనిఖీల అనంతరం విమానం తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించిందని అధికారులు, వర్గాలు తెలిపాయి. బోయింగ్ 787–9 విమానానికి చెందిన ఎఐ 2030 విమానం, సుమారు 293 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బందితో ఉదయం 9:35 గంటలకు జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయిందని, భద్రతా తనిఖీల కోసం దానిని ఐసోలేషన్ బేకు తరలించారని వర్గాలు తెలిపాయి. 'ప్రయాణికులను టెర్మినల్ భవనానికి తీసుకువచ్చారు. కొంత సమయం తర్వాత, విమానానికి క్లియరెన్స్ ఇవ్వడంతో, అదే విమానంలో ప్రయాణికుల బోర్డింగ్ ప్రారంభమైంది. అనంతరం విమానం ఢిల్లీకి బయలుదేరింది' అని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. హైజాక్ హెచ్చరిక రావడంతో, విమానం అత్యవసరంగా ల్యాండ అయిన విషయాన్ని విమానాశ్రయ అధికారులు పోలీసులకు తెలియజేశారని మాల్వీయ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివ్ దయాల్ పిటిఐకి తెలిపారు. ఐసోలేషన్ బేలో భద్రతా సిబ్బంది విమానాన్ని తనిఖీ చేశారని పోలీసు వర్గాలు తెలిపాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానం ముంబయి ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ రీజియన్ (ఎఫ్ఐఆర్)లో ఉన్నప్పుడు, పైలట్ చట్టవిరుద్ధమైన జోక్యాన్ని సూచించే 'స్క్వాక్ కోడ్ 7500'ను నొక్కారు. ఆ తర్వాత విమానాన్ని జైపూర్‌కు మళ్లించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. భద్రతా తనిఖీలు నిర్వహించి, అనంతరం ప్రయాణికులను విమానం నుంచి దించి టెర్మినల్ భవనానికి తరలించినట్లు జైపూర్ విమానాశ్రయ యాజమాన్యం తెలిపింది. 'సంబంధిత భద్రతా సంస్థలు అవసరమైన తనిఖీలు నిర్వహించి, విమానానికి, సిబ్బందికి క్లియరెన్స్ ఇచ్చాయి. ప్రయాణికులందరినీ విమానం నుంచి దించి, భద్రతా తనిఖీలు పూర్తిచేసి, తిరిగి విమానం ఎక్కించారు' అని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.

# ఎపిలో స్థానిక సమరం

- పురపోరుకు 18లోగా నామినేషన్లు, 28న పోలింగ్
- ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు 19న నోటిఫికేషన్
- నవంబరు 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు
- మూడు దశల్లో పంచాయతీలకు ఎన్నికలు




**అమరావతి :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతోపాటు పురపోరుకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన కమిషనర్, రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు. తొలుత పురపాలక సంఘాలకు ఈనెల 28వ తేదీ, తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు నవంబరు 3వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు పోలింగ్ నిర్వహిస్తారు. గ్రామ పంచాయితీ ఎన్నికలు మాత్రం మూడు విడతలుగా నిర్వహిస్తారు. ఈ మేరకు తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించింది. కోర్టు కేసులు కారణంగా మున్సిపల్ పోల్స్‌లో నాలుగు నగర పాలక సంస్థలు, 23 మున్సిపాల్టీలలో ఎన్నికలు నిలిపివేశారు. వీటిలో మంగళగిరి తాడేపల్లి, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం కార్పోరేషన్లు ఉన్నాయి. నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈనెల 16నుంచి 18వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల్లోగా నామినేషన్లు దాఖలు చేయాలి. 19వ తేదీ నామినేషన్లు స్క్రూటినీ, 21వ తేదీలోగా ఉపసంహరణకు గడువు విధించారు. 28న పోలింగ్, అవసరమైన కేంద్రాల్లో 29న రీపోలింగ్ నిర్వహించి 30వ తేదీ ఓట్ల లెక్కింపు చేపడతారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఈనెల 19వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, ఈనెల 23వ తేదీలోగా నామిషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. 27వ తేదీలోగా ఉపసంహరణ, నవంబరు 3వ తేదీ పోలింగ్, నవంబరు 5వ తేదీ ఓట్ల లెక్కింపు చేపడతారు. ఇక గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 26న మొదటి విడత, 29న రెండో విడత, డిసెంబర్ 2న మూడో విడత జరగనున్నాయి. ఎన్నికలు జరిగిన రోజునే ఓట్ల లెక్కింపు ఉంటుంది.

**కోర్టు కేసులతో వీటికి బ్రేక్**

కోర్టు కేసులు కారణంగా రాష్ట్రంలో 4 నగర పాలక సంస్థలు, 23 మున్సిపాలిటీల్లో ప్రస్తుతం ఎన్నికలు నిలిపివేస్తున్నట్లు ఎన్నికల కమిషనర్ తెలిపారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థతో పాటు, ఆజిల్లాలోని ఆముదాలవలస మున్సిపాలిటీ, పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు మున్సిపాలిటీలు, నెల్లూరు జిల్లాలో కావలి, గూడూరు మున్సిపాలిటీలు, అల్లూరు నగర పంచాయతీ, విజయనగరం జిల్లాలో రాజాం మున్సిపాలిటీ, తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ నగర పాలక సంస్థలు, ఏలూరు జిల్లాలో చింతలపూడి నగర పంచాయతీ, కృష్ణాలో గుడివాడ, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ, గుంటూరు జిల్లాలో మంగళగిరితాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లు, పొన్నూరు మున్సిపాలిటీ, నర్సరావుపేట, బాపట్ల, కందుకూరు మున్సిపాలిటీలు, పొదిలి, అన్నమయ్య నగర పంచాయతీలు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలతో కోర్టు కేసులు పరిష్కారం తర్వాత ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# లండన్‌లో ప్రవాసీ సంఘాల ప్రదర్శన

## ఢిల్లీ నిరసనలకు సంఘీభావం

**లండన్:** ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘ ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలని కోరుతూ జరుగుతున్న నిరసన ప్రదర్శనలకు మద్దతుగా లండన్‌లోని ప్రవాస సంఘాలు బుధవారం ఆకస్మికంగా భారత హైకమిషనర్ కార్యాలయం ఎదుట ప్రదర్శన జరిపాయి.దక్షిణాసియా సంఘీభావ బృందం,హిందుత్వ వ్యతిరేక కేంబ్రిడ్జ్ దక్షిణాసియా వేదిక,ఇండియన్ వర్కర్స్ అసోసియేషన్,ఎస్ఓఎఎస్ అంబేద్కర్ సొసైటీ తదితర సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం దాటాక అత్యవసరంగా భారత్ హై కమిషనర్ కార్యాలయం వెలుపల నిరసన ప్రదర్శన జరిపారు.భారీసంఖ్యలో విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.జంతర్ మంతర్ వేదికను ప్రజానిరసనలకు దూరం చేస్తూ పోలీసులు ఉత్తర్వు జారీ చేసిన తర్వాత కాక్రోచ్ జనతాపార్టీ నాయకులు,కార్యకర్తలు మంగళవారం గేట్లు దూకి లోపలికి వెళ్ళి నిరసన ప్రదర్శన జరిపారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి ఐదు రోజులు జైలుకు తరలించారు.జంతర్ మంతర్ 2.0 నిరసనల అణచివేత,భారత్‌లో ఓటు హక్కు పునరుద్ధరణ,నిరసన తెలియజేసే హక్కు పునరుద్ధరించాలని లండన్ హై కమిషన్ కార్యాలయం వెలుపల విద్యార్థులు నినాదాలు చేశారు.భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని,ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న డిమాండ్లకు వారు సంఘీభావం ప్రకటించారు.''ఇది ఒక అవినీతి అధికారిని వ్యతిరేకించే విషయం కాదు,వ్యవస్థలో సమస్యలపై ప్రజా తిరుగుబాటు'' అని దక్షిణాసియా సంఘీభావ బృందానికి చెందిన ముక్తీ షా అన్నారు.యూరప్‌లో మితవాదం విస్తరించింది,భారతదేశంలో కూడా మితవాద ఉన్మాదం రోజురోజుకూ పెరుగుతోంది,ప్రపంచ మితవాద విస్తరణ తీవ్రతలో భాగంగా భారత్‌లో కూడా మితవాదం విజృంభిస్తోంది,అందువల్ల ఇది మాకు చాలా ముఖ్యమైన విషయం అని ఆయన అన్నారు.భారతదేశంలో ఉద్ధృతంగా ఈ మితవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలని ఈ ప్రదర్శనను ఉద్దేశించి ప్రసంగించిన నాయకులు విద్యార్థులకు పిలుపు ఇచ్చారు.

# బిహార్‌లో పడవ మునక

## 14 మంది మృతి, మరికొందరు గల్లంతు



**హాజీపూర్ :** బిహార్‌లో ఘోర పడవ ప్రమాదం చోటు చేసుకుంది. వైశాలి జిల్లాలోని రఘోపూర్ దియారా ప్రాంతంలో గంగా నదిలో పడవ బోల్తాపడటంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువ మంది పిల్లలే ఉన్నట్లు సమాచారం. పడవలో ప్రయాణిస్తున్న మరికొందరు గల్లంతయ్యారు. వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించారు. వైశాలి జిల్లాలోని రఘోపూర్ దియారా ప్రాంతానికి చెందిన కొందరు గ్రామస్థులు ఓ విందులో పాల్గొనేందుకు పడవలో వెళ్లారు. తిరిగి వస్తుండగా శ్యామ్‌చంద్ గ్రామం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న పడవ నదిలో బోల్తాపడటంతో అందులో ఉన్నవారు నీటిలో పడిపోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల కురిసిన వర్షాలు, ఉపనది గండక్‌లో వరదల కారణంగా గంగా నదిలో నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో పడవ ప్రమాదానికి గురైంది. అనంతరం పడవలోని కొందరు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. అయితే మరికొందరు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు గల్లంతయ్యారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న జిల్లా అధికారులు వెంటనే స్పందించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టేందుకు జిల్లా పోలీసు అధికారులు, రాష్ట్ర విపత్తు స్పందన దళం బృందాన్ని పంపినట్లు వైశాలి జిల్లా మేజిస్ట్రేట్ వర్షా సింగ్ తెలిపారు. ఆమెతోపాటు జిల్లా ఎస్పి శుభాంక్ మిశ్రా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

**గల్లంతైన వారి కోసం గాలింపు**

పడవ ప్రమాదం నుంచి బయటపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారిని అంబులెన్సుల్లో ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారని అధికారులు తెలిపారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని అన్నారు. పడవ ప్రమాదం జరిగిన సమయంలో అందులో సుమారు 30 మంది ఉన్నట్లు మహువా మాజీ ఎమ్మెల్యే ముఖేశ్ రౌషన్ తెలిపారు. వారిలో ఏడెనిమిది మంది మాత్రమే ఈదుకుంటూ సురక్షితంగా బయటపడగలిగారని చెప్పారు. సుమారు 12 మంది మరణించగా, మిగిలినవారు గల్లంతైనట్లు ఆయన పేర్కొన్నారు. అయితే అధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 14కు చేరింది.

## 'నీట్' పేపర్ లీక్ కేసులో నిందితుడిపై..

# సిబిఐ అనుబంధ ఛార్జిషీట్ దాఖలు

**న్యూఢిల్లీ :** 'నీట్' పేపర్ లీక్ కేసులో నిందితుడిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) బుధవారం ఢిల్లీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. 14వ నిందితుడు బజరంగ్ సూర్యవంశీ అలియాస్ రాజ్ సూర్యవంశీ తరపు న్యాయవాదికి అనుబంధ ఛార్జిషీట్ కాపీని అందజేయాలని ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా ఆదేశించి, తదుపరి విచారణ కోసం ఈ విషయాన్ని గురువారానికి వాయిదా వేశారు. సెప్టెంబరు 2న అరెస్ట్ అయిన మహారాష్ట్రలోని నాందేడ్ నివాసి సూర్యవంశీ, సహ నిందితుడు శుభమ్ ఖైర్నార్‌కు సన్నిహితుడని సిబిఐ ఆరోపించింది. అనుబంధ ఛార్జిషీట్ ప్రకారం...సూర్యవంశీ, ఖైర్నార్‌తో కుమ్మక్కై, పలువురు అభ్యర్థులకు వైద్య ప్రవేశ పరీక్ష పత్రాలను అందించి, వారి కుటుంబాల నుంచి డబ్బు వసూలు చేశాడు. నాందేడ్‌లోని ఒక ప్రదేశంలో అభ్యర్థులను గుమిగూడమని సూర్యవంశీ కోరినట్లు, అక్కడ వారికి పేపర్ అందించినట్లు సిబిఐ అధికారులు తెలిపారు. పరీక్ష తర్వాత, వారు చెల్లింపు చేశారని నిర్ధారించుకోవడానికి, అతడు వారి విద్యాధృవపత్రాలు, గుర్తింపు కార్డుల వంటి అసలు పత్రాలను తన వద్ద ఉంచుకున్నాడు. ఆగస్టు 12న పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో పేపర్ లీక్‌లు, ఇతర అక్రమ పద్ధతుల వాడకం వల్ల తలెత్తే క్రిమినల్ కేసులను విచారించే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు , మరో 13మంది నిందితులపై సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోనికి తీసుకుంది. గతంలో దాఖలు చేసిన ఛార్జిషీట్ ప్రకారం, మే 13న రాజస్థాన్‌లో మంగీలాల్, దినేష్, బివాల్‌లను తొలి విడతగా అరెస్ట్ చేయడం ద్వారా సిబిఐ తన దాడులను ప్రారంభించింది. ఏప్రిల్ 29వ టెలిగ్రామ్ ద్వారా అందిన లీక్ అయిన పిడిఎఫ్‌లు వారి మొబైల్ ఫోన్‌లలో లభించాయి. అదే రోజు సిబిఐ గురుగ్రామ్‌లో యశ్‌యాదవ్, నాసిక్‌లో శుభమ్ ఖైర్నార్‌ను అరెస్ట్ చేసింది. మే 13న జరిగిన మరో కీలకమైన అరెస్ట్ పుణేలో ధనంజయ్ లోఖండేది.అతను నిర్దోషిగా బయటపడటానికి తన ఫోన్‌ను ధ్వంసంచేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరుసటి రోజు పుణేలో మనీషా సంజయ్ వాఘ్మారేను అరెస్ట్ చేశారు. ఇంతకుముందు దాఖలు చేసిన తుది నివేదిక ప్రకారం..వాఘ్మారే డబ్బుకోసం 'నీట్' యుజి –2026 ప్రశ్నాపత్రాన్ని లీక్ చేయడం, వ్యాప్తి చేయడంలో ప్రధాన కుట్రదారులలో ఒకరు. అభ్యర్థులకు, సబ్జెక్ట్ నిపుణులకు మధ్య వారధిగా వ్యవహరించారు. వారిని విచారించిన అనంతరం, ఈ కుట్రకు సూత్రధారిగా భావిస్తున్న పివి.కులకర్ణిని మే 15న లాతూర్‌లో, ఆ తర్వాత, మే 16న పుణేలో మనీషా మంధారేను సిబిఐ అరెస్ట్ చేసింది. లాతూరులోని ఒక కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకుడైన శివరాజ్ మోటేగావ్‌కర్‌ను మే 17న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో చివరిగా మే 22న లాతూరుకు చెందిన మనీషా సంజయ్ హావల్దార్‌ను, మే 26న పుణేకు చెందిన తేజస్ షాను, లాతూరుకు చెందిన డాక్టర్ మనోజ్ షిరూరేను అరెస్ట్ చేశారు. ప్రశ్నపత్రం లీక్ అయిన ఆరోపణల నేపథ్యంలో, మే 3న జరగాల్సిన పరీక్షను మే 12న ఎన్‌టిఏ రద్దు చేసింది. జూన్ 21న తిరిగి పరీక్షను నిర్వహించారు. నీట్ పేపర్ లీక్ ఒక పెద్ద రాజకీయ సమస్యగా మారి, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో భారీ నిరసనకు దారితీసింది. ఈ నిరసన ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అనంతరం సిబిఐ రంగంలోకి దిగి, మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా,ఢిల్లీ, ఇతర రాష్ట్రాలలోని 92 ప్రాంతాలపై దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

## కాంగోలో ఆగని ఎబోలా

### 4,381 కు పెరిగిన మరణాలు

**కిన్షాసా:** మధ్య ఆఫ్రికాదేశం డి.ఆర్.కాంగోలో ఎబోలా వ్యాధి అనూహ్యంగా విస్తరిస్తోంది.గడచిన మే నెల నుండి ఇప్పటివరకూ ఆ దేశంలో 4,381 మంది ఎబోలా కొత్త వైరస్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. కొత్తగా 9066 కేసులు ప్రస్తుతం అధికారికంగా దేశవ్యాప్తంగా నమోదయ్యాయి. అనుమానితులలో సిబ్బంది కొరత,వ్యాక్సిన్ కొరత,పారిశుధ్యలోపం,ప్రజల్లో పరిశుభ్రతపట్ల చైతన్య లోపం,మృతదేహాలను ఇక్కడ తీసుకువెళ్లడంవల్ల వైరస్ మరింత తీవ్రంగా వ్యాపించడం వంటి అనేక కారణాలు ఎబోలా నియంత్రణకు అసాధ్యంగా మారు తున్నాయి. వీటన్నింటికీ మించిస్థాయిలో ప్రభుత్వ దళాలకు,తిరుగుబాటు దారులకు జరుగుతున్న పెను అంతర్యుద్ధం దేశానికి పెద్ద సంక్షోభంగా వ్యాధి నియంత్రణకు ఆటంకంగా మారింది.గతవారం 2,356 మంది ఈ వ్యాధి బారినపడి తిరిగి కోలుకున్నారు.దేశంలో కొత్త ప్రాంతాలకు ఎబోలా విస్తరిస్తోంది.దీంతో ఆరోగ్య కార్యకర్తలు,అధికారులు తీవ్ర ఆందోళనకు,ఒత్తిడికి గురవుతున్నారు. కాంగోలో ఇప్పటివరకూ 16 సార్లు ఎబోలా విజృంభించింది.2014–16 మధ్య కాలంలో ఎబోలా వల్ల 11000 మంది మరణించారు.

## అసైన్డ్ భూములుంటే చూపించండి.. అక్కడే రాసిస్తా

### కెటిఆర్ ఆరోపణలకు ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన పేరు మీద అసైన్డ్ భూములు ఉన్నట్లు నిరూపిస్తే వాటిని అధికారులకు అక్కడికక్కడే రాసిచ్చేందుకు సిద్ధమని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు. తనపై బిఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. వారి భూ వ్యవహారాలను ప్రజల ముందుంచినందుకే తనను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పేరు మీద అసైన్డ్ భూములు, 22ఎ జాబితాలోని భూములు లేదా అక్రమ భూములు ఉన్నట్లు ఆధారాలుంటే చూపించాలని, అక్కడికే వెళ్లి అధికారుల సమక్షంలో రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. బిఆర్‌ఎస్ నేతలు తన మాటలను వక్రీకరించి, వాయిస్ ట్యాంపరింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తనను తెలంగాణ సమాజం ముందు విలన్‌గా చూపించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తన ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వ్యక్తికి తాను రాహుల్ గాంధీని కలిసినట్టుగా చూపిస్తూ ఏఐ ఫొటోలు సృష్టించారని తెలిపారు. బిఆర్‌ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించిన చామల.. అమెరికాలో ఆరేళ్లు ఉండి ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించానని చెప్పిన కెటిఆర్ కుటుంబం రాష్ట్రాన్ని పాలించిన సమయంలో ఇంత భారీ అప్పులు ఎలా పేరుకుపోయాయని ప్రశ్నించారు. రాజకీయ ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాల కంటే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వాస్తవాలు వివరించాలని బిఆర్‌ఎస్ నేతలకు సూచించారు.

## వేధింపులకు పాల్పడమే

(మొదటి పేజీ తరువాయి)

తెలపడం ఎప్పటినుంచి నేరమైంది?' అని ఎక్స్ పోస్ట్‌లో ప్రశ్నిస్తూ, వారిద్దరిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేయడాన్ని రాజకీయంగా, చట్టపరంగా సవాలు చేస్తామని ఆయన చెప్పారు. నిరసన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్), ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్) పాద యాత్ర చేశాయని, అక్కడ ఆందోళన చేసే హక్కును పునరుద్ధరించడానికి తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తాయని హెచ్చరించారు.

# రష్యా డీజిల్ ఒప్పందం మా కోసం కాదు.. ప్రపంచం కోసమే!

- ట్రంప్ పొంతనలేని సమర్థనలు
- ఇది మిత్ర ద్రోహం: ట్రంప్‌కు అధికార, ప్రతిపక్ష సెనేటర్ల లేఖ



**వాషింగ్టన్:** రష్యా నుండి డీజిలు కొనుగోలును దో నాల్డ్ ట్రంప్ పొంతనలేని విధంగా సమర్థించుకున్నారు. ఈ ఒప్పందం అమెరికా కోసం కాదు, ప్రపంచ మార్కెట్ కోసమేనన్నారు.రష్యాతో డీజిలు ఒప్పందం వివాదాస్పదంగా మారి ఇంటా బయ టా తీవ్ర విమర్శలు,వ్యంగ్య బాణాలు ఆయన పై దూసుకొస్తున్నాయి.అమెరికాలో అధి కార ప్రతిపక్షాలతో కూడిన 12 మంది సెనేటర్లు ట్రంప్‌కు ఘా టుగా ఒక లేఖ రాశారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేయడం మిత్రద్రోహం కాగ దని,ఈ కొనుగోలు రష్యాకు వరంగా మారుతుందని హెచ్చరించారు. వీరిలో ఆరుగురు డెమోక్రాట్లు,ఆరుగు రు రిపబ్లికన్ సెనేటర్లు ఉన్నారు.డెమోక్రటిక్‌పార్టీకి చెందిన రిచర్డ్ బ్లుమెంథాల్,క్రిస్ క్రూన్స్,డిక్ దర్బి న్, జాక్ రీడ్,జీన్నే షాహీన్,షెల్డాన్ వైట్‌హౌస్,రిపబ్లికన్ సెనేటర్లు అలన్ ఆర్మ్‌స్ట్రాంగ్,సుసాన్ కోలి న్స్, జాన్ కార్నిన్,మిచ్ మెక్‌కా న్నెల్,లిసా ముర్కోవిస్కీ, థోమ్ టిల్లిస్ ఈ లేఖపై సంతకాలు చేశా రు. ఈ దిగుమతులవల్ల అమెరికా అవసరాలు తీరుతాయని,దేశీయ అవసరాలకు ఇది చాలా చాలా పరిమితమని,కానీ రష్యాకు మాత్రం యుద్ధం చేయడానికి భారీగావనరులు సమకూరతా యని,దీనివల్ల అమెరికాకు,దాని మిత్రదేశాలకు ద్రోహం జరుగుతుందని లేఖలో రాశారు. దీంతో,ప్రపంచ చమురు మార్కెట్‌ను స్థిరీకరించడంకో సమే ఒప్పందం చేసుకున్నామని సమాధానం చెప్పారు.మధ్యంతర ఎన్నికల సందర్భంగా జరుగుతున్న ర్యాలీలో,పాత్రికేయులతో మాట్లాడుతూ ఆయన పైవి ధంగా స్పంది ంచారు. రష్యా నుండి డీజిలు కొనుగోలు నేరుగా అమెరికా అవసరాలు తీర్చుకోవడంకోసం ఈ డీజి లు కోనుగోలు చేయడం లేదన్నారు.కానీ వాస్తవాని కి అమెరికాలో విపరీ తంగా చమురు ధర పెరిగి పోవడం, మధ్యంతర ఎన్ని కల ఒత్తిడి,పోల్ సర్వేల్లో 65 శాతం ప్రజలు ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరే కించ దం, సొంత రిపబ్లిక న్‌పార్టీలో ఆగ్రహం వంటి పరిణామాల మధ్య ద్రవ్యో ల్బణాన్ని కట్టడి చేసేం దుకు, రిపబ్లికన్లను,ఓట ర్లను ప్రసన్నం చేసుకునేందుకు ట్రంప్ రష్యాతో డీజిలు ఒప్పందం చేసుకున్నారు. తొలి విడతగా తక్షణం 3,00,000 టన్నులు డీజి లు దిగుమతి చేసుకుంటున్నా మని అక్టోబరు 9వ తేదీన ట్రంప్ ప్రకటన చేశారు. నవం బరులో 5,0,000 టన్నులు ఆ తర్వాత మరో 10,00,000 టన్నులు సరఫరా చేసేందుకు రష్యా అంగీ కరించిందని చెప్పారు.అధిక ధరలతో ఇబ్బ ంది పడు తున్న ప్రపంచ మార్కెట్‌ను స్థిరీకరించడంకోసమే ఒప్పందం చేసుకున్నామన్నారు.ఈ లావాదేవీల నిమిత్తం రష్యాపై ఆంక్షలను తాత్కాలికంగా నిలిపివేస్తూ విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం (ఓఎఫ్ఎసి)2027 ఏప్రిల్ 7వ తేదీ వరకూ ఒక తాత్కాలికజనరల్ లైసెన్స్ జారీ చేసింది.ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత కూడా ప్రతిపక్ష డెమోక్రాట్లతోపాటు అధికార రిపబ్లికన్ల నుండి కూడా ట్ర ంప్‌పై వ్యతిరేకత ఇంకా పెరిగింది.ఈ ఒప్పం దాన్ని అడ్డుకునేందుకు సొంతపార్టీ ఎంపీలే ఒక బిల్లు తెచ్చేందుకు సిద్ధమయ్యారు.రష్యా చేస్తున్న యుద్ధానికి వనరులు అందించి మరిం ఆజ్యం పోసినట్లవుతుందని జెలెన్స్కీ కూడా విమర్శించారు.రష్యా నుండి చమురు కొనుగోలు చేసే దేశాలు యుద్ధానికి నిధులు సమకూరు స్తున్నాయంటూ భారత్, చైనా వంటి దేశాలపై ట్రంప్ మండిపడ్డారు.అమెరికా కాంగ్రెస్‌లో అధికారఈ తృతీ యపక్షాలను అడ్డుకునేందుకు విశేషాధికారాల చట్టాన్ని కూడా ఆమోదింపజేసుకున్నారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చిన మూడు వారాల తర్వాత ఇప్పుడు ట్రంప్ స్వయంగా డీజిలు ఒప్పందం చేసుకుని ఆయన భాష లోనే ప్రపంచం ముందు దోషిగా నిలబడ్డారు.

## భీకర యుద్ధ దశకు చేరుతున్న హౌతీ–సౌదీ దాడులు

- తైజ్,సనా నగరాల్లో తీవ్ర యుద్ధం
- చమురు కటకటకు ప్రమాద సంకేతాలు
- యెమెన్‌లో వలసలు,ఆకలి కేకలు
- 8000 కలరా కేసులు,27 మంది మృతి

**సనా:** సౌదీ అరేబియాపై హౌతీ తిరుగుబాటు సైన్యాల దాడులు ఆగడం లేదు. రియాద్ సహా సౌదీ అరేబి యాలో విమానాశ్రయాలు,ఇంధన కేంద్రాలు,మిలి టరీ స్థావరాలపై తమ దాడులు కొనసాగుతాయని హౌతీ తిరుగుబాటు సైన్యాల అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని సౌదీ అరేబియా కూటమి సైన్యాలు ప్రకటించాయి. అందుకు తగ్గట్టుగానే యెమెన్‌లో హౌతీల అధీనంలో ఉన్న ప్రధాన నగరం సనాపై వైమానిక దాడులు చేస్తుండగా,కీలకమైన తైజ్ పట్టణ స్వాధీనానికి హౌతీలు ఉద్ధృత పోరాటం చేస్తున్నారు.సౌదీ నగరం రియాద్‌లో హౌతీల క్షిపణులను కూటమి సైన్యాలు అడ్డుకున్నాయి. ఈ శకలాలు తగిలి అనేకమంది గా యపడ్డారు. రియాద్‌లో బాంబుపేలుళ్ళు జరుగుతు న్నాయని ప్రత్యక్ష సాక్షులు బుధవారం చెప్పారు. ఇంకోవైపు ప్రపంచంలోనే కడు పేదరికంలో మగ్గిపో తున్న యెమెన్‌లో ప్రజలు కలరా వ్యాధితో, తీవ్రమైన ఆకలితో అలమటిస్తున్నారు.అ ంటువ్యాధులు ప్రబలు తున్నాయి. యెమెన్‌లో హౌతీల దాడుల భయంతో, గతానుభవాల రీత్యా లక్షలమంది ప్రజలు సురక్షితమ ని భావించిన ఐదు రాష్ట్రాలకు తరలిపోతున్నారు. దీంతో ఈ ప్రాంతాలు జనంతో కిటకిటలాడిపోతు న్నాయి.645 మంది. ఇప్పటివరకూ 8,034 కలరా కేసులు నమోదయ్యాయి. 27 మంది కలరావ్యాధి బారినపడి మరణించారు.తైజ్ పట్టణాన్ని గడచిన 15 రోజులుగా హౌతీలు దిగ్బంధనం చేశారు. దీంతో మరో రెండు వారాల్లో ఈ పట్టణంలో ఆహార నిల్వలు నిండుకుంటాయి. ప్రజలు ఆకలి బారిన పడే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిం చింది.గడచిన ఫిబ్రవరిలో ఇరాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభించిన తర్వాత హౌతీలు కూడా అమె రికాపై యుద్ధం ప్రకటించారు. వెనువెంటనే ఇరాన్ ఆదేశాలతో యుద్ధ ప్రకటన విరమించుకున్నారు. అవ సరమైన సమయంలో తాము రంగంలోకి దిగుతా మని ప్రకటించారు.హోర్ముజ్ జలసంధిలో యుద్ధం, అరబ్ దేశాలపై దాడులు,సంధి యత్నాలు,ఉద్రిక్తతల తర్వాత యెమెన్ అంతర్యుద్ధంలో ప్రభుత్వ దళా లకు,అటు అమెరికాకు గల్ఫ్‌లో స్థావరాలు ఇస్తున్న మిత్రదేశంగా ఉన్న సౌదీఅరేబియాపై హౌతీలు యుద్ధం ప్రకటించారు.అమెరికా తమ లక్ష్యం కాదని,సౌదీ లక్ష్యంగా దాడులు చేస్తామని ప్రకటిం చారు. యెమెన్‌లో జైత్రయాత్ర ప్రారంభించిన హౌతీలు ఎర్ర సముద్ర తీర ప్రాంతాలను,బాబ్ అల్–మండెబ్ జలసంధి ప్రాంతాన్ని స్వాధీనం చేసుకు న్నారు. అక్కడ నౌకల నుండి సుంకాలు వసూలు చేస్తు న్నారు. ఈ పరిస్థితుల్లో ప్రపంచంలోనే అత్యధిక చమురు ఉత్పత్తిదారైన సౌదీ అరేబియా తన మనుగడ నిలబెట్టుకోవడానికి యెమెన్ ప్రభుత్వదళాలతో కలిసి హౌతీలపై యుద్ధ దాడులు ప్రారంభించింది. సనా నగ రంపై ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నాయి.

## ఉక్రేన్ విద్యుత్ ప్లాంట్‌పై రష్యా దాడి

### ఆరు లక్షల మందికి స్తంభించిన విద్యుత్ సరఫరా

**కీవ్:** ఉక్రేన్‌పై రష్యా బుధవారం తెల్లవారకముందే చేసిన భీకర దాడివల్ల విద్యుత్‌ప్లాంట్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ఉక్రేన్‌లో 6,00,000 మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వారంతా అంధకారంలో మగ్గుతు న్నారు.ఈ దాడుల్లో మరో ఆరుగురు మరణించారు. ఉక్రే న్–రష్యా మ ధ్య ఇంధన వనరులపై దాడులు చేసుకో కుండా ఒక అంగీకారం కుదిరిందని, తక్షణం ఇది అమలు లోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం ప్రకటించిన తర్వాత నుండీ రెండు దేశాలు ఈ అంగీకారా న్ని ఉల్లంఘించి పరస్పర దాడులు చేసుకుం టూనే ఉన్నా యి. ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ప్రధాన నగరం కీవ్‌తోపాటు ఈశాన్యప్రాంత నగరం ఖార్కీ వ్‌లోని కీలక విద్యుత్ కేంద్రాలతోపాటు పౌర నివా సాలు,అపార్ట్‌మెంట్లపై రష్యా దాడులు చేసిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ చెప్పారు. 39 క్రూయిజ్ క్షిప ణులు,బాలిస్టిక్ క్షిపణులు,128 డ్రోన్లతో రష్యా దాడులు చేయగా 115 డ్రోన్లను కూల్చివేశామని ఆ యన చెప్పారు. కాగా ఇంటర్నెట్ సేవల నియంత్రణ,క్షిపణి దాడుల గురించి ముందస్తుసమాచారం లభించకపోవడం తో రష్యాకు అమెరికా సహాయం చేస్తోందని ఉక్రేన్ అధికా రులు ఎలాన్ మస్క్ స్టార్ లింక్ కూడా కొన్ని పరిమితులు విధించిందని ఆరోపించారు.రష్యాపై ఉక్రేన్ వందల డ్రో న్లతో విరుచుకుపడిందని,900 డ్రోన్లను కూల్చివేశామని ర ష్యా సైన్యం మరో ప్రకటనలో తెలియజేసింది.కమ్యూనికే షన్, ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వశాఖ బుధవారం ప్రకటించింది. ఉక్రేన్ నుండి 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న దక్షిణ ద్వీపకల్ప ప్రాంతం క్రిమియాసహా పలు రష్యా ప్రాంతాలపై వందల డ్రోన్లతో ఉక్రేన్ సైన్యం దాడులు చేసిందని,వందలడ్రోన్లను తాము కూల్చివేశామని రష్యా ర క్షణశాఖ పేర్కొంది.ఇంధన వనరులపై పరస్పర దాడుల ని లివేతకు అంగీకరించినందువల్ల దీనిని ఉల్లంఘించవద్దని ట్రంప్ అంతకుముందు కోరారు. రష్యా పాటిస్తే తాము కూడా నిబంధన పాటిస్తామని జెలెన్స్కీ అన్నారు.ఐతే కా ల్పుల విరమణ,దాడుల విమరణ తాము పాటించేంత అర్హ త ఉక్రేన్‌కు లేదని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ కూడా వ్యాఖ్యానించారు.ఒకవేళ ఎలాంటి సంధి కుదిరినా గానీ యూరప్ సరఫరా చేసే ఆయుధాలతో ఉక్రేన్ ఆ సం ధిని ఉల్లంఘించి దాడులు చేస్తుందని లావ్రోవ్ విమర్శించా రు.యూరప్ దేశాలు రష్యాను పెనుభూతంగా చిత్రీకరిస్తూ, ఉక్రేన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నాయి. 2022లో ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన రష్యా ఇప్ప టివరకూ ఆ దేశంలోని 20 శాతం భూభాగాన్ని తన అధీ నంలోకి తెచ్చుకుంది.ఇదిలా ఉండగా ఈ రెండు దేశాలమ ధ్యా యుద్ధ పరిష్కారానికి నాలుగు అంశాలతో ఒక ప్రణా ళిక సిద్ధం చేసేందుకు అమెరికా–యూరప్ దేశాలు ప్ర యత్నం చేస్తున్నాయని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక ఇప్పటికే ఒక కథనం ప్రచురించింది.రెండు దేశాలకూ ఆర్థిక భద్రతా ప్రయోజనాలు అందించే ఒక ఉమ్మడి శాంతి ప్రణాళిక సిద్ధ మవుతోందని పేర్కొంది.ఇదిలా ఉండగా జెలెన్స్కీ బుధవా రం బ్రిటన్‌లో పర్యటిస్తున్నారు. ఉక్రేన్‌కు మరింత సహా యం చేస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి బర్న్‌హాం చెప్పారు. బ్రిటన్ ప్రభుత్వం ఉక్రేన్‌కు తక్షణ సహాయం సమకూరు స్తుందని చెప్పారు.

## ఎమర్జెన్సీ

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలపై దాస్, రాంకాలను మంగళవారం తెల్లవారుజా మున అదుపులోకి తీసుకున్నారు. ం తి ఒప్పందాలను ఉల్లం ఘించారని, నిరసన ప్రాంతంగా డీనోటిఫై చేయబడిన జంతర్ మంతర్‌లోకి చొరబడ్డారని ఆరోపిస్తూ, వారిని బుధ వారం ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపి ఢిల్లీలోని తిహార్ జైలులో ఉంచినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో దీప్కే స్పందిస్తూ తాను నరేంద్ర మోదీకి చెప్పద లుచుకున్నది ఏమిటంటే, దేశంలో అత్యవసర పరిస్థితిని విధించాలనుకుంటే, దానిని అధికారికంగా చేయండి అని అన్నారు. పిరికివాళ్లలా ప్రవర్తిస్తూ, కేవలం జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాను ఎగరవేసినందుకు తమ నేతలను ఐదు రోజుల పాటు కస్టడీలో ఉంచి అనధికారిక అత్యవసర పరిస్థితిని విధిస్తున్నారా? (1975లో ఇందిరా గాంధీ విధిం చిన) అత్యవసర పరిస్థితి సమయంలో కూడా ఇలా జరగ లేదు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దేశంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయడం అత్యంత ఘోరమైన పాపంగా మారిందని, కేవలం ఈ చర్య వల్లే ఐదు రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి పంపుతున్నారని దీప్కే పేర్కొ న్నారు. తరువాత దీప్కే, 'ధమ్మ చక్ర ప్రవర్తన్ దినోత్సవం' సందర్భంగా నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిని సందర్శించారు. 1956 అక్టోబర్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వేలాది మంది అనుచరులతో కలిసి అక్కడే బౌద్ధమతాన్ని స్వీకరిం చారు. భారత రాజ్యాంగ ప్రధాన నిర్మాతకు ఆయన నివాళు లర్పించారు. 'మన దేశం రాజ్యాంగం, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనల మీద నడుస్తుంది. ఈ దేశంపై ఆర్ఎస్ ఎస్ భావజాలాన్ని రుద్దడానికి నరేంద్ర మోదీ గానీ, మరెవ రైనా గానీ ఎన్ని ప్రయత్నాలు చేసినా, అది జరగదు' అని సిజెపి నాయకుడు ఉద్ఘాటించారు. సిఇసి రాజీనామా కోరుతూ ప్రతిపక్ష ఇండియా కూటమి చేపట్టిన నిరసనల గురించి అడగ్గా, సిజెపి ఒక స్వతంత్ర ఒత్తిడి బృందమని, ఎప్పటికీ అలాగే ఉంటుందని దీప్కే అన్నారు. 'అయితే, సిజెపి ఇండియా కూటమికి వ్యతిరేకమని దీని అర్థం కాదు. ఇండియా కూటమి ఉద్యమం, సిజెపి ఉద్యమం రెండూ ఒకే లక్ష్యం కోసం జరుగుతున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే ఇండియా కూటమి పనిచేస్తోందని, అలా చేయడానికి దానికి పూర్తి హక్కు ఉందని ఆయన అన్నారు.

## నీటి ఎత్తిపోత షురూ

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 ల క్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సా గునీరు అందించాల్సి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనంం చే కూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అం దుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్య మ ని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వ నపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొ న్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్ర భుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి సౌ కర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అ మలు చేస్తోం దని సొంతింటి ద్వారా పేద కుటుంబాలకు భద్రత, భరోసా కల్పించడంతో పాటు వారి జీవ న ప్రమాణాలు మెరుగుపడేం దుకు ఈ పథకం దోహదపడుతోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెద్ద కొత్తపల్లి మండలం చెన్నప్పరావు పల్లి గ్రామంలో బుధవా రం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుక లలో మంత్రి జూపల్లి కృష్ణారావు పా ల్గొని లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించి, గృహప్రవేశ లబ్ధిదారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు.

## భారీ మార్చ్ (మొదటి పేజీ తరువాయి

వెల్లిందని, సామాన్యులకు ప్రయోజనం చేకూర్చడంలో బిజెపి విఫలమైందని, సంపన్నులకు మాత్రమే లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మంచి మెజారిటీతో అధికారంలోకి వస్తుందని మహేశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వాములు తమ స్థాయిలో పోరా టాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాల్లో భాష, వ్యక్తీకరణకు గౌరవం ఉండాలని ఆయన సూచించారు. రాహుల్ గాంధీపై బిజెపి నేతలు చేస్తున్న విమర్శలను మహేష్ కుమార్ గౌడ్ తప్పుబట్టారు. మహిళా జర్నలిస్టు లను అవమానించారని రాహుల్ గాంధీపై చౌకబారు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు షూస్ లేసులు కట్టా రంటూ చేస్తున్న వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. బిజెపి ఎదుగుద లలో అటల్ బిహారీ వాజ్‌పాయి, సుష్మా స్వరాజ్ వంటి నేతల పాత్ర ఉందని, అలాంటి నాయకులు లేకపోతే ఆ పార్టీ ఎలా ఎదిగేదని ప్రశ్నించారు. ఎర్రవ ల్లిలోని 45 ఎకరాల భూమి ఎవరి కబ్జాలో ఉందన్న అంశంపై విచారణ జరు గుతోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫామ్‌హౌస్‌లపై దాడులు చేయడం తమ ఉద్దేశం కాదని, నీతిమంతులమని చెప్పుకునే వారి గురించి వాస్తవాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే ఫామ్ హౌస్‌ల సందర్శన చేప ట్టినట్లు ఆయన వివరించారు. కవిత తన కుటుంబానికి సంబంధించిన అంశా లపై మాట్లాడుతున్నారని, ఆమె వెల్లడిస్తున్న విషయాలను ప్రజలు అర్థం చేసు కుంటున్నారని మహేష్ కుమార్ అన్నారు.

**బిఆర్‌ఎస్ 'సింగరేణి గర్జన' అర్థరహితం**

సింగరేణి కార్మికుల విషయంలో బిఆర్‌ఎస్ నిర్వహిస్తున్న 'సింగరేణి గర్జన'కు అర్థం లేదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కార్మికులకు ప్రయోజనాలు అందిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి పరిణామాలను కూడా రాజకీయాలతో ముడిపెట్టడం తగదన్నారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో కెసిఆర్ ప్రతి అంశాన్నీ రాజకీయంగా మార్చారని, సెంటి మెంట్‌ను రెచ్చగొడుతూ కాలం గడిపారని ఆయన విమర్శించారు. ఆర్‌టిసి కార్మిక సంఘాల ఎన్నికలు సుమారు 15 ఏళ్లుగా జరగకపోవడంతోనే ఎన్ని కలు నిర్వహించామని, గెలుపోటములతో సంబంధం లేకుండా కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలపై పార్టీ తీవ్రంగా దృష్టి సారించిందని తెలిపారు. కాంగ్రెస్‌లో కష్టపడిన వారికి తగిన న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే కార్పొరేషన్ పదవుల నియామకాల్లో జాప్యం జరుగు తోందని, దసరా నాటికి నియామకాలు జరిగే అవకాశం ఉందని ఒక ప్రశ్నకు మహేష్ కుమార్ గౌడ్ సమాధానమిచ్చారు.

## రాజకీయ వివక్ష లేదు

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేసామన్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఎల్‌ఐజి కాలనీ పక్కన ఉన్న స్థలంలో రూ.43.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ప్రాజెక్టుకు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాష్ట్ర పరిశ్ర మలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మల్కా జిగిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి,ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. నిరుపేద కుటుంబాలకు నాణ్య మైన, సురక్షితమైన ఆధునిక నివాస సదుపాయాన్ని అందించే లక్ష్యంగానే ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం చేప ట్టిందని మంత్రులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపా యలు ఉన్నప్పటికీ పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవ ప్రదమైన నివాసం కల్పించాలన్న లక్ష్యంతోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. దీని వల్ల నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బంది కలిగించే విధానానికి స్వస్తి పలికినట్లవుతోందన్నారు. ఈ ఆధునిక నివాస సదు పాయాలు అందుబాటులోకి రావటం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న భారీ అద్దె ఇళ్ల భారం పూర్తిగా తొలగిపోతుందన్నారు. క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకొన్నామని, 23 అసెంబ్లీ నియోజకవ ర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసామని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేసామన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో తొలి విడతగా 480 మంది లబ్దిదారులకు పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసామన్నారు. ఇంది రమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్దిదారులకు కేవలం ఇళ్ల కేటాయింపు పత్రాలిచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెం ట్‌కు సంబంధించిన భూమిలో వాటాను సైతం రిజి స్ట్రేషన్‌లో పొందుపరచటం జరుగుతుందన్నారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్దిదా రులకు ఇళ్లను పూర్తి చేసి వారి చేతులకు ఇంటి తాళా లను ఆ ఇంటిపై సర్వహక్కులతో పాటు అప్పగించా లన్నదే తుది లక్ష్యమన్నారు.

**అప్పుల పాలయ్యే పరిస్థితి రావద్దు**

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇళ్లు అందించటం సంతోషకరమైన విషయమేనని, కాగా లబ్దిదారులకు ఇప్పటికే రూ10 వేలు, ఆ తర్వాత లక్ష రూపాయలు చెల్లించారని, మిగిలిన మొత్తాన్ని సైతం చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తే మాత్రం వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని అప్పుల పాలయ్యే పరిస్థితులు ఎదురయ్యే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలన్నారు. పేద కుటుంబాలపై భారం పడకుండా మిగిలిన మొత్తాన్ని చెల్లించేందుకు బ్యాంకు రుణాల ద్వారా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ లబ్దిదారులను ఎంపిక చేసే సమయంలో సమీపంలోనే కేటాయిం చటం హర్షణీయమన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కమిటి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండి విపి గౌతం, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ మేయర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్ది దారులు స్నేహ, శివకుమారి, రెహ్మాతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ తీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ప్లాట్ల కేటాయింపు నిర్వహించారు.

## అణచివేత

(మొదటి పేజీ తరువాయి)

జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపి, విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన వరుస నిరసనల నేప థ్యంలో, జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన స్థలం జాబితా నుండి తొలగించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయం తర్వాత ఈ అరెస్టులు జరిగాయి. డీనోటిఫికేషన్ ఉత్తర్వులకు వ్యతి రేకంగా నిరసనగా సిజెపి నేతలు దాస్, రంకాలు తమ సహచ రుడు అజింక్య షిండేతో కలిసి జంతర్ మంతర్‌లోకి ప్రవేశించా రని, వారిని అదుపులోకి తీసుకున్న తర్వాత నేరపూరిత అతిక్ర మణ, ఆదేశాలను ధిక్కరించిన ఆరోపణలపై జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

**పిరికిపంద చర్య : రాహుల్‌గాంధీ**

సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను జ్యుడిషియల్ కస్టడీకి పంపిన నేపథ్యంలో, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం మోదీ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనలో భాగంగా త్రి వర్ణ పతాకాన్ని ఎగురవే యడం నేరం కాదని, దానికోసం యువతను జైలులో పెట్టడమంటే పిరికిపంద చర్య అని ఆ యన అన్నారు. జంతర్ మంతర్ భారత ప్రజలకు చెందినదని, తాము దానిని తిరిగి స్వాధీనం చేసుకుంటా మన్నారు. 'విద్యార్థులు, యువత, జర్నలిస్టులు. ఇండియా బ్లాక్‌వి వేర్వేరు జెండాలు. ఒకే లక్ష్యం. అన్ని నిరసనలూ ఒక్కటే. పౌరులు తమ రాజ్యాంగ హక్కులను డిమాండ్ చేస్తున్నారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు.

**ఎప్పటికీ మీతోనే ఉంటా : మమతా బెనర్జీ**

'మీ దీదీ ఈ రోజు, ఎప్పటికీ మీతోనే ఉంటారు' అని దేశ యువ తకు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ భరోసా ఇచ్చారు. 'మేము, మా ముందు తరాల వారు మా ప్రజాస్వామ్య హక్కుల కోసం బలంగా పోరాడాము. మనం అలా కొనసాగించాలి. సిజెపికి చెందిన అశుతోష్, సౌరవ్‌ల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను. మన గొప్ప ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ఐక్యంగా పోరాడటానికి ప్రతిజ్ఞ చేసి, నిల బడాల్సిన క్షణాలు ఇవి' అని అని బెనర్జీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ చర్య 'ఒక తరం మొత్తాన్ని భయపెట్టి, నోరు మూయించే ప్రయత్నం' అని ఆమె అభివర్ణించారు. ఇది ఆమోదయోగ్యం కాదని, మనం మన రాజ్యాంగ హక్కులను ఎన్నటికీ వదులుకోకూ డదన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఇలా హత్య చేయడం దేశంలోని అనేక ప్రాంతాల్లో జరుగుతోందని, ప్రస్తుతం బెంగాల్‌లో 14,000 మంది ప్రజలు పోలీసు, రాజకీయ అఘాయిత్యాల తీవ్ర తను ఎదుర్కొంటున్నారు అని ఆమె ఆరోపించారు.

**పూర్తిగా హాస్యాస్పదం : కేజ్రీవాల్**

సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలపై పోలీసుల చర్య 'పూర్తిగా హాస్యా స్పదం' అని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణిం చారు. సొంత దేశంలో జాతీయ జెండాను ఎగురవేయడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

**నిరసనలకు ప్రభుత్వం జంకుతోంది : దీపాంకర్ భట్టాచార్య**

ప్రభుత్వం నిరసనలకు భయపడుతోందని, రాజ్యాంగాన్ని ధిక్కరి స్తోందని ఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీ పాంకర్ భట్టాచార్య అన్నారు. 'జంతర్ మంతర్ ప్రజలకు చెందినది, ఢిల్లీలో అత్యంత సాధారణ నిరసన ప్రదేశంగా ఇది ప్రపంచం మొత్తానికి తెలుసు' అని ఆయన సోషల్ మీ డియాలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. నిరసనల పట్ల ప్రభుత్వానికి ఉన్న భయం వల్లే ఆ ప్రదేశాన్ని డీనోటిఫై చేయడం, ఆ తర్వాత కార్యకర్తలపై చర్య తీసు కోవడం జరిగిందని ఆ యన ఆరోపించారు.

**చాలా దురదృష్టకరం : మనోజ్ ఝా**

రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) ఎంపి మనోజ్ ఝా కూడా కేంద్ర ప్రభుత్వ, పోలీసు చర్యను ఖండించారు, సిజెపి నేతలపై ఉన్న ఆరో పణను ప్రశ్నించారు. 'ఆరోపణ ఏమిటి? వా రు జంతర్ మంత ర్‌కు చేరుకున్నారా? నిజంగా ఇది నమ్మశక్యం కాని ప్రభుత్వం. ఇది చాలా దురదృష్టకరం' అని ఝా పిటిఐతో అన్నారు. జంతర్ మంతర్ భారత ప్రజలకు చెందినదని, నిరసన తెలిపే హక్కును గౌరవించాలని ఆయ న అధికారులను కోరారు. 'నిరసన ద్వారా తమ బాధను వ్యక్తం చేస్తున్న ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉన్నారు. ఈ నిర్ణయాలు తీసుకుంటున్న వారికి, జంతర్ మంతర్ భారత ప్ర జ లకు చెందినది. నిరసన తెలిపే హక్కు వారి హక్కు. వా రితో కరు ణతో వ్యవహరించండి. ఆ హక్కును లాక్కోవద్దు. తమది ఎలా తిరిగి పొందాలో ప్రజలకు తెలుసు'అని ఆయన అన్నారు.

## ఎవరొచ్చినా ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

ఇతర పరిశ్రమల ను ఏర్పాటు చేయడంలో యువ పారిశ్రామికవేత్తలు ఈ అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తం గా మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా పురోగమిస్తున్నాయని, భారతదేశంలోనూ మహిళల పారిశ్రామిక భాగస్వామ్యాన్ని మరింత పెంచాలన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్త లను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. యువత, మహిళలకు సమానంగా అవకాశాలు కల్పించడం ద్వారా పారిశ్రామిక రంగంలో రాష్ట్రం మరింత పురో గతి సాధించగలదన్నారు. రకరకాల ఆలోచనలు, ప్రపంచంలో జరుగుతున్న అభివృద్ధి, వస్తున్న నూతన విధానాలను సంపూర్ణంగా యువత తరానికి అందిం చాలంటే, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, చట్టాలను కూడా అవగాహన కల్పించుకోవాలని చెప్పారు. యువతకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, నూతన విధానాలు, చట్టాలపై అవగాహన కల్పించడంలో సమాఖ్యలు, చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించే సదస్సులు కీలకపాత్ర పోషిస్తాయి. ఒకే వేదికపై వివిధ రంగాల అనుభవజ్ఞులను కలుసుకో వడం, వారి ఆలోచనలు, అనుభవాల నుంచి నేర్చుకో వడం ద్వారా యువతకు ఎంతో ప్రయోజనం కలుగు తుంది. కాపు సామాజికవర్గానికి చెందిన ప్రముఖులు పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, సినీ రంగాల్లో సాధించిన విజయాలను నమోదు చేసి భవిష్యత్ తరా లకు అందించడం ద్వారా యువతకు స్ఫూర్తినివ్వవ చ్చన్నారు.

**పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రణాళిక లతో పాటు వాటి అమలుకు అవసరమైన కార్యాచ రణ, పెట్టుబడులు ఎంతో కీలకమని, రాష్ట్రంలో పరిశ్ర మల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావా లని, పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగ స్వాములు కావాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని, ప్రపంచ ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థల్లో సేవలు అందించే వారిలో భారతీయులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, అంతవరకే పరిమితం కాకుండా మనవారు సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సిఎం సూచించారు.

# ఉప్పల్ మ్యాచ్‌లో భారత్ ఓటమి

వెస్టిండీస్‌తో ఐదు టి–20ల సిరీస్‌లో టీమిండియాకు మరో పరాజయం ఎదురైంది. బుధవారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన నాలుగో టి–20లో సమష్టిగా విఫలమైన టీమిండియా 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ పరాజయంతో ఐదు ఇరు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. దాంతో బెంగళూరు వేదికగా జరిగే ఆఖరి మ్యాచ్ సిరీస్ డిసైడర్‌గా మారింది. ఈ ఓటమి తెలుగు అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 247 పరుగుల భారీ స్కోర్ చేసింది. షై హోప్ (50 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్స్‌లతో 102 నాటౌట్) విధ్వంసకర శతకంతో చెలరేగగా.. షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్(26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 49 నాటౌట్), షిమ్రాన్ హెట్మైర్(12 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 33) దూకుడుగా ఆడారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. విండీస్ బ్యాటర్ల ధాటికి భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం భారత్ 19.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. సంజూ శాంసన్(23 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించినా.. తిలక్ వర్మ(25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43 నాటౌట్), నితీష్‌కుమార్‌రెడ్డి(20 బంతుల్లో



ఫోర్, 4 సిక్స్‌లతో 41) పోరాడినా ఫలితం లేకపోయింది. కీమోపాల్(5/41) ఐదు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. గుడకేష్ మోతీ(2/13) రెండు వికెట్లు పడగొట్టాడు. రొమారియో షెపర్డ్, షమర్ స్ప్రింగర్ తలో వికెట్ తీసారు.

**శుభారంభం దక్కినా..** భారీ లక్ష్యఛేదనలో భారత్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. సంజూ శాంసన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో టీమిండియా 3 ఓవర్లలోనే 50 పరుగులు చేసింది. 20 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న సంజూ శాంసన్‌ను కీమో పాల్ ఔట్ చేయడంతో తొలి వికెట్‌కు నమోదైన 60 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చి రావడంతోనే భారీ సిక్సర్ బాదిన ఇషాన్ కిషన్.. అదే ఓవర్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. శ్రేయస్ అయ్యర్‌తో కలిసి మరో ఓపెనర్ అభిషేక్ శర్మ భారీ షాట్స్ ఆడటంతో పవర్ ప్లేలోనే భారత్ 2 వికెట్లకు 80 పరుగులు చేసింది. పవర్ ప్లే అనంతరం స్ప్రింగర్ బౌలింగ్‌లో శ్రేయస్ అయ్యర్(16) ఔటవ్వగా.. తన శైలికి భిన్నంగా ఆడిన అభిషేక్ శర్మ(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 29)ను గుడకేష్ మోతీ ఔట్ చేశాడు. ఆ మరుసటి బంతికే నమన్ ధీర్(0) స్టంపౌట్గా వెనుదిరిగాడు. దాంతో భారత్ 130 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది.

**పోరాడిన తిలక్, నితీష్..** ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి జట్టును ఆదుకున్నారు. తమదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ.. ఆరో వికెట్‌కు 70 పరుగులు జోడించింది. హాఫ్ సెంచరీకి చేరువైన తిలక్ వర్మను రొమారియో షెఫర్డ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరో ఎండ్‌లో పోరాడిన నితీష్ కుమార్ రెడ్డి కూడా భారీ షాట్ ఆడే ప్రయత్నంలో కీమో పాల్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో భారత్ ఓటమి ఖాయమైంది. ఆ మరుసటి బంతికే ప్రిన్స్ యాదవ్(0)ను ఔట్ చేసిన కీమో పాల్.. ఆఖరి బంతికి అక్షర్ పటేల్‌ను పెవిలియన్ చేర్చి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఆఖరి ఓవర్లో అర్ష్‌దీప్‌సింగ్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో మరో 3బంతులు మిగిలి ఉండగానే భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.



## గిల్, షఫాలీకి ఐసిసి అవార్డులు

టీమిండియా వన్డే, టెస్టు జట్టు సారథి శుభ్‌మన్ గిల్, మహిళల జట్టు ఓపెనర్ షఫాలీ వర్మ సెప్టెంబర్ నెలకు గాను ఐసిసి 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా ఎంపికయ్యారు. అభిషేక్ శర్మ, సికందర్ రజా పోటీల్లో ఉన్నా వారిని వెనక్కినెట్టిన గిల్.. గత నెలలో వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుతంగా రాణించడంతో టీమిండియా సారథినే అవార్డు వరించింది. కాగా, గిల్‌కు ఈ అవార్డు రావడం ఇది ఐదోసారి. మహిళల విభాగంలో ఎంపికైన షఫాలీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా నిలవడం ఇదే రెండోసారి. గతనెలలో ముగిసిన ఆసియా కప్‌తో పాటు ఆసియా క్రీడల్లో ఆమె అదరగొట్టింది.



## బిడబ్ల్యుఎఫ్ డెన్మార్క్ టోర్నీలో
## శ్రీకాంత్ ముందుకు.. సింధు ఇంటికి

బీడబ్ల్యూఎఫ్ జరుగుతున్న డెన్మార్క్‌లో బీడబ్ల్యూఎఫ్‌బీడబ్ల్యూఎఫ్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో కిదాంబి శ్రీకాంత్ శుభారంభం చేయగా సీనియర్ షట్లర్ పివి సింధు, లక్ష్యసేన్ మాత్రం మరోసారి తొలి రౌండ్ విఘ్నాన్ని దాటలేకపోయారు. 2017లో ఇక్కడ మెన్స్ సింగిల్స్ టైటిల్ గెలిచిన శ్రీకాంత్.. మొదటి రౌండ్లో 22–20, 21–19తో ఆర్నాడ్ మెర్కిల్ (ఫ్రాన్స్)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరాడు. మరో పోరులో లక్ష్య.. 18–21, 21–13, 15–21తో చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో సింధు.. 21–13, 23–25, 19–21తో తనకంటే తక్కువ ర్యాంకర్ యొనె లి (జర్మనీ) చేతిలో పరాభవం పాలైంది. తన్వి శర్మ 21–17, 16–21, 21–19తో నసుకి నిదైర (జపాన్)ను ఓడించి టోర్నీలో ముందంజ వేసింది.

# 'వారియర్స్ ఆఫ్ ది క్లౌడ్స్'




పెరూ ఉత్తరంలో, దట్టమైన మబ్బులతో కమ్ముకొని ఆకాశాన్నంటిన పర్వతాల మధ్య జరిగిన ఒక పురావస్తు ఆవిష్కరణ యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. 'లగూనా డే లాస్ కొండోరెస్' ప్రాంతంలో తవ్వకాల సమయంలో 200కి పైగా మమ్మీలు (శవాలను) కనుగొనడం ద్వారా, శతాబ్దాలుగా మబ్బుల్లో మాయమైన ఒక నాగరికత తిరిగి ఆవిష్కృతమైంది. వీరే 'వారియర్స్ ఆఫ్ ది క్లౌడ్స్'గా పిలిచే 'చాచాపోయా' ప్రజలు. క్రీస్తు శకం 900 నుండి 1470 మధ్యకాలంలో చాచాపోయా నాగరిత ఆండీస్ పర్వతాల మేఘావృత అడవుల్లో వికసించింది. ఈ ప్రాంతాన్నేగాక, అక్కడి నాగరికతను కూడా ఇన్కా సామ్రాజ్యం కప్పివేసింది. స్పానిష్ చరిత్రకారుల రికార్డుల్లో, ఇన్కా వర్గాల ద్వారా వినిపించిన కథల ప్రకారం, చాచాపోయాలు పొడవైన, తెల్లటి రంగు చర్మం కలిగిన ధీరులు. తమ భూమిని రక్షించేందుకు, ఇన్కాల అణచివేతను తీవ్రంగా ప్రతిఘటించిన యోధులు. కానీ 1996 మమ్మీ సైట్ కనుగొనకముందు, వారి సంస్కృతి గురించిన అంశాలు కేవలం ఊహలకే పరిమితమై ఉండేది. ఈప్రాంతంలో బయలుపడిన లగూనా డే లాస్ కొండోరెస్ సమాధులు సాధారణమైనవి కావు. ఆ మమ్మీలు అందమైన వస్త్రాలలో కప్పి, గర్భస్థ శిశువుల స్థితిలో ఉంచారు. దీనిని మరణానంతర పునర్జన్మ అనే ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా పేర్కోవచ్చు. మమ్మీలకు చుట్టిన వస్త్రాలు స్వతహాగా కళాఖండాలుగా నిలిచాయి. జాలీ బట్టలపై నేసిన జ్యామితీయ ఆకృతులు వారి కుటుంబం, స్థాయి లేదా ఆధ్యాత్మిక విశ్వాసాలను సూచించేలా ఉన్నాయి. వారితో పాటు సమాధిలో గిన్నెలు వంటి వస్తువులు వస్తువులను ఉంచడం కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అలాగే పావురం కంటే చిన్నపరిమాణంలో ఉండే గినియా పందులను బలి రూపంలో సమర్పించిన ఆనవాళ్లు ఉన్నాయి. చాచాపోయా ప్రజల దృష్టిలో గినియా పందులు కేవలం ఆహారంకాకుండా, పునర్జన్మలో ఆత్మలకు మార్గదర్శకులుగా, ఆధ్యాత్మిక సహాయకులుగా కూడా ఉంటాయి. అందుకే పునర్జన్మలో ఉపయోగించడానికి వీలుగా వస్తువులతోపాటు గినియా పందులను కూడా సమాధిలో ఉంచేవారు. దక్షిణ అమెరికా ప్రాచీన చరిత్రలో ఇన్కాలది అత్యున్నత నాగరికతగా చూపే పాత అభిప్రాయాన్ని కొత్త ఆవిష్కరణ సవాలు చేసింది. చాచాపోయాలు ఒక సాధారణ గిరిజన వర్గం కాదు. వారు అధునాతన



భూగర్భ నిర్మాణ కర్తలు, కళాకారులు, యోధుల సమూహం. వారు కొండచరియలపై కోటలు కట్టారు. ఆధ్యాత్మిక భావంతో అంత్యక్రియలు నిర్వహించారు. చేతిపనుల్లో సాంస్కృతిక నైపుణ్యాన్ని చాటారు. 'వారియర్స్ ఆఫ్ ది క్లౌడ్స్' మమ్మీల ఆవిష్కరణ, మబ్బుల్లో తలదాచుకున్న ఒక మహానాగరికతను ప్రపంచ ముందుంచింది. సమయం గడిచినా, పాత చరిత్రలు మట్టిలో దాగి ఉన్నాయనే సత్యాన్ని అది మరోసారి గుర్తుచేసింది. చరిత్ర అనేది పూర్తికాని గ్రంథం మట్టి పొరల కింద ఇంకా రాయాల్సిన ఎన్నో కథలు మన కోసం ఎదురుచూస్తున్నాయి.

## కాంస్య ఉంగరంపై
## పురాతన లైట్‌హౌస్ ఆనవాళ్లు

ఈజిప్టులోని అలెగ్జాండ్రియా తీరానికి సమీపంలో సముద్రపు అడుగున పురావస్తు పరిశోధనలు చేస్తుండగా చిన్నదైనప్పటికీ, అత్యంత ఆసక్తికరమైన వస్తువు బయటపడింది. అది సుమారు 2,000 ఏళ్ల నాటి కాంస్య ముద్ర గల ఉంగరం. దానిపై చెక్కిన ఒక చిత్రాన్ని, ప్రాచీన ప్రపంచంలోని ఏడు ప్రపంచ వింతల్లో ఒకటైన 'లైట్ హౌస్ ఆఫ్ అలెగ్జాండ్రియా' లేదా 'ఫరోస్ ఆఫ్ అలెగ్జాండ్రియా'గా భావిస్తున్నారు. ప్రాచీన కాలంలో అలెగ్జాండ్రియా నౌకాశ్రయానికి దారి చూపే భారీ నిర్మాణంగా లైట్‌హౌస్ ఉండేది. అది శతాబ్దాల క్రితం ధ్వంసమయింది. దాని అసలు రూపం గురించి చరిత్రకారులు నాణేలు, రచనలు, పురావస్తు ఆధారాల ద్వారా అంచనా వేస్తున్నారు. ఇప్పుడు లభించిన ఉంగరంపై ఉన్న చిన్న చిత్రం ఆ నిర్మాణానికి సంబంధించిన కొత్త ఆధారంగా నిలుస్తోంది. ఇలాంటి చిన్న వస్తువులు కొన్నిసార్లు భారీ చారిత్రక భవనాల కంటే ఎక్కువ సమాచారం అందిస్తాయి. ఎందుకంటే అవి సాధారణ ప్రజలు, వ్యాపారులు లేదా అధికార వ్యవస్థ ఆ నిర్మాణాన్ని ఎలా చూసేవారో కూడా సూచించగలవు. సముద్రంలో మునిగిన అలెగ్జాండ్రియా ఇంకా ఎన్నోకథలను దాచుకుని ఉందని ఈ ఆవిష్కరణ గుర్తుచేస్తోంది.



## జర్మనీలో పురాతన యుద్ధ దేవుడి ఆలయం



జర్మనీలోని 'టౌనస్' పర్వత ప్రాంతంలో పురావస్తు శాస్త్రవేత్తలు సుమారు 1,800 ఏళ్ల నాటి రోమన్ల ఆలయాన్ని కనుగొన్నారు. ఇది రోమన్ల సైనిక శిబిర సముదాయంగా భావించే, 'కపెర్స్‌బర్గ్' కోట సమీపంలో ఉంది. ఈ ప్రాంతం ఒకప్పుడు రోమన్ సామ్రాజ్య సరిహద్దును రక్షించడానికి ఉపయోగించిన సైనిక వ్యవస్థలో భాగం. ఆలయంలో దొరికిన శాసనాల ఆనవాళ్లలో, ఇది అంగారకుడు (మార్స్), రోమన్ యుద్ధ దేవుడికి అంకితం చేసిన ఆలయమని సూచించే సమాచారం ఉంది. అంగారకుడి విగ్రహానికి సంబంధించిన అవశేషాలు కూడా లభించాయి. అదనంగా, రెక్కలతో, చేతిలో 'తాటి ఆకు', 'సతత పుష్పగుచ్ఛం' పట్టుకున్న చిన్న విగ్రహం దొరికింది. దానిని, రోమన్లు విజయానికి ప్రతీకగా భావించే దేవత 'విక్టోరియా'గా పరిశోధకులు భావిస్తున్నారు. రోమన్ల మిలటరీ కోటల చుట్టూ సైనికులతోపాటు కుటుంబాలు ఉండేవని, వ్యాపారులు, కార్మికులు నివసించేవారని ఈ ఆనవాళ్లు స్పష్టం చేస్తున్నాయి. సరిహద్దుల్లోనూ పలు పౌర నివాస సముదాయాలు ఉండేవన్న వాదనకు బలం చేకూరుతున్నది. రోమన్ సామ్రాజ్యంలో సరిహద్దుల వద్ద ఎలాంటి పరిస్థితులు ఉండేవి? అక్కడి సైనికుల మత విశ్వాసాలు ఏమిటి, స్థానిక ప్రజలతో సైనికుల సంబంధాలు ఏ విధంగా ఉండేవి వంటి అనేక ప్రశ్నలకు ఇలాంటి ఆధారాలు కొంత వరకూ సమాధానం చెప్తాయి. దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం నిర్మించిన ఒక ఆలయం అడవిలో మట్టికింద దాగి ఉండి, ఇప్పుడు మళ్లీ చరిత్రలోకి రావడం నిజంగా అద్భుతమైన సంఘటన.

# రైతాంగాన్ని ఆదుకోండి

ఖమ్మం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి
గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి
కలెక్టరేట్ ఎదుట ధర్నాలో రైతు సంఘం నేత బాగం డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని ఇప్పుడు పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఆందోళన నిర్వహించి కలెక్టర్ దివాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో ఖమ్మం ఒకటని, 16 మండలా ల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నా రు. తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి వరికి ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటాయని, భూగర్భ జల నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరుకుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. కనీసం చేతికి అందిన పంటలనైనా కాపాడేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తగు రీతిలో స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని బాగం హెచ్చరించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రైతుసంఘం నాయకులు ఏపూరి లతాదేవి, మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రాంకోటి, వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, పావులూరి మల్లికార్జున్, బాగం ప్రసాద్, దొబ్బల వెంగళరావు, వెన్నం భాస్కర్, మామిళ్ల సుదర్శన్‌రెడ్డి, ఏలూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# లాభాల వాటాపై కోత ఎందుకు?

సింగరేణి వాస్తవ లాభాలు దాచిపెట్టి కార్మికులకు అన్యాయం
రూ.59 వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలి
సింగరేణి కార్మికసంఘం(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/చుంచుపల్లి :** సింగరేణి కార్మికుల కష్టార్జితానికి న్యాయమైన వాటా కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, వాస్తవ లాభాలను వెల్లడించకుండా కార్మికులకు అన్యాయం చేస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ విమర్శించారు. సింగరేణి సంస్థకు జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి రావాల్సిన సుమారు రూ.59వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం స్పందించకుంటే జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరా నిలిపివేత దిశగా ఉద్యమాన్ని ఉధృతంచేస్తామని హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి వాస్తవ లాభాలను వెల్లడించకుండా కేవలం రూ.1,754కోట్ల లాభాలను మాత్రమే ప్రకటించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గత ఏడాది కార్మికులకు ప్రకటించిన 34శాతం లాభాల వాటానే ఈ ఏడాది కొనసాగించడం ద్వారా కార్మికులకు అదనంగా ఒక్క శాతం కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు తమ శ్రమతో సంస్థకు వేల కోట్ల ఆదాయం సమకూరుస్తుంటే, వారికి న్యాయమైన వాటా కల్పించడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం సమంజసం కాదన్నారు. లాభాల వాటా నిర్ణయించే ముందు గుర్తింపు సంఘంతో చర్చించాల్సిన బాధ్యత యాజమాన్యానికి, ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. సింగరేణి ప్రాంతానికి చెం దిన ఎమ్మెల్యేలను పక్కపెట్టి, కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలతో మాత్రమే చర్చించి లాభాల వాటాను ప్రకటించడం కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చినట్లుగా ఉందని విమర్శించారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా లాభాల వాటా పెంచాలని సీతారామయ్య, రాజ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి కేంద్ర ప్రచారకార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్‌కార్యదర్శులు ఎస్‌వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, నాయకులు సందబోయిన శ్రీనివాస్, నాగయ్య, నరేష్, కమల్, బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల వేతనాల సమస్య పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి వినతి

**ప్రజాపక్షం/నర్సంపేట :** రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు పెంచి సమస్య పరిష్కరించాలని, కార్మికులను పర్మినెంట్ చేసి. కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేల్పుల సారంగపాణి కోరారు. ఈ మేరకు బుధవారం నర్సంపేట మున్సిపాలిటీ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట మున్సిపల్ పరిధిలో ఎన్ఎంఆర్ కార్మికులుగా సుమారు 30 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నారని, కార్మికులను మూడు కేటగిరీలుగా గుర్తించి, కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం కార్మికులకు వేతనాలను అమలు చేయాలన్నారు. ఎన్ఎంఆర్ కార్మికులకు రెండు నెలల నుండి వేతనాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్ ప్రకారం వేతనాలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను పాత పద్ధతి ప్రకారం చెల్లించాలని ఈ సందర్భంగా వారు కోరారు.








## అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేయాలి

రాష్ట్రంలో 10 సెంటర్లు ఏర్పాటు చేయాలి
అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు 10 కేంద్రాలు ఏర్పాటు చేయాలని, విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టును వెంటనే అమల్లోకి తేవాలని, త్వరితగతిన బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నల్లగొండ జిల్లా సమావేశం జి.యాదయ్యాచారి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని స్థానిక మగ్దూమ్‌భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా పోరాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులు ధైర్యంగా ఉండాలని, సమస్య పరిష్కారానికి అసోసియేషన్ నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. కోర్టు పర్యవేక్షణలో అగ్రిగోల్డ్ భూములకు వేలం నిర్వహించాలని, భూములను చిన్న చిన్న కమతాలుగా చేసి బహిరంగ వేలం ద్వారా విక్రయించడం వలన అధిక మొత్తంలో డబ్బు సమకూరుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వెరిఫికేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.రజిత, ఎఐటియుసి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు యాదయ్యాచారి, టి.శ్రీను, ఎస్.రూపలత, ఎం.యాదగిరి, వి.మాలతి, ఎస్.జయప్రతాప్‌రెడ్డి, తండు వీరయ్యగౌడ్, ఎల్.వీరేష్, సయ్యద్ అలీ, పి. లింగయ్య, పున్నా శంకర్, రామకృష్ణ. శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్, వెంకట చారి, వెంకటేశ్వర్లు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా నూతన కమిటీ :** అనంతరం సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నల్లగొండ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పల్లా దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా టి.శ్రీను, ఎస్.రూపలత, ఎం.యాదగిరి, తండు వీరయ్య గౌడ్, ఎల్.వీరేష్, ప్రధాన కార్యదర్శిగా గన్నవరం యాదయ్య చారి, సహాయ కార్యదర్శులుగా సయ్యద్ అలీ, రవీందర్‌రెడ్డి, వి.మాలతి, పి.లింగయ్య, కోశాధికారిగా పున్నా శంకర్‌లతోపాటు 28 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సమాన పనికి సమాన వేతనం

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రధాన సమస్యలపై కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని బుధవారం ఎఐవైఎఫ్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యుగంధర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతాలను పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉద్యోగులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని, ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రతి నెలా నిర్ణీత తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులందరికీ రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే యూనియన్లతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు జువ్వాజి తిరుపతి, డాక్టర్ శ్రావణి, సౌమ్య, సంధ్యారాణి, డాక్టర్ పుల్లారావు, రమేష్ పాల్గొన్నారు





తెలంగాణలో పెట్టుబడులపై

## సిఎంతో యుకె మేయర్ల బృందం భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో ఇంగ్లాండ్ (యూకె) పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, తెలంగాణ–యూకె మధ్య వాణిజ్య సంబంధాలను మరింత పటిష్టం చేసే కార్యాచరణపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి యూకె మేయర్ల బృందంతో చర్చించారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్ డిలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి డి. శ్రీధర్ బాబు పాల్గొన్నారు. వైద్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, తయారీ రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించే అంశాలపై వారు చర్చించారు. సమావేశంలో యూకే ఇండియా బిజినెస్ కౌన్సిల్, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సలహాదారు కె.రామకృష్ణా రావు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎల్ నినో సవాళ్లు ఎదుర్కొనేందుకు అధికారులు

## ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులు, వాటి వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటూ,క్షేత్రస్థాయిలో సమన్వయంతో వ్యవహరించాలన్నారు.హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రిసీతక్కను జిల్లా సీఈవోలు, డిప్యూటీ సీఈవోల అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను అసోసియేషన్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో టిజిఒ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు,అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ కరణ్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ నర్సింహులు, ట్రెజరర్ నవీన్, వైస్ ప్రెసిడెంట్లు ప్రవీణ్, సబిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సిఈఒలు డిప్యూటీ సిఈఒలు డి ఆర్ డి ఓ అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, మెరుగైన పనితీరుతో శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారులు చొరవ చూపాలని, ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా కష్టపడి పనిచేయాలన్నారు. సమర్థవంతమైన పనితీరు, అంకిత భావం, సమన్వయంతోనే శాఖ లక్ష్యాలను సాధించగలమని సీతక్క తెలిపారు.

## ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తు గడువు అక్టోబర్ 31 వరకు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే బిసి, ఇబిసి విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. మహాత్మా జ్యోతిబా ఫూలే బిసి ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 2026 ఆగస్టు, సెప్టెంబర్ ఫాల్ సెషన్ ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించినట్లు బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బి. బాలామాయాదేవి తెలిపారు. గతంలో ఈ గడువు అక్టోబర్ 15తో ముగియాల్సి ఉండగా, విద్యార్థుల సౌకర్యార్థం మరో 16 రోజులు పొడిగించారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో మాస్టర్స్, డాక్టరల్ కోర్సులు అభ్యసించాలనుకునే అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి రూ.5 లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తు సమయంలో వయస్సు 35 ఏళ్లకు మించకూడదు. గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించడంతోపాటు జిఆర్ఇలో 260 లేదా జిమ్యాట్‌లో 550 స్కోర్ కలిగి ఉండాలి. అలాగే టోఫెల్‌లో 60, ఐఎల్ట్స్‌లో 6.0 లేదా పిటిఇలో 50 స్కోర్ సాధించి ఉండాలి. అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఇపాస్ అధికారిక వెబ్‌సైట్ https://telanganaepass.cgg.gov.in/OverseasLinks.do ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బిసి సంక్షేమ శాఖ సూచించింది. దరఖాస్తులకు అక్టోబర్ 31 చివరి తేదీ కావడంతో అర్హులు గడువులోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరింది.



## విజయవాడ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో రాష్ట్రపతి

**విజయవాడ :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సందర్శించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మహాచండీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రపతి ఆలయానికి చేరుకోగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వాగతం పలికారు. ఆలయానికి వచ్చే క్రమంలో రాష్ట్రపతి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి అంతరాలయంలోకి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని సుమారు ఎనిమిది నిమిషాల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనాలు అందించి ప్రసాదాలను సమర్పించారు. దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించగా, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శేషవస్త్రాలను అందజేశారు.

# పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా

వచ్చే 20 రోజులు అత్యంత కీలకం.. సరఫరాలో అంతరాయాలను సహించేది లేదని విద్యుత్ అధికారులపై సీఎం తీవ్ర ఆగ్రహం.. నిర్లక్ష్యం చేస్తే ఐఎఎస్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపో కూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలని సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని అధికారులను నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్కో సీఎండీ.. సంబంధిత విభాగపు ఐఏఎస్ లను సస్పెండ్ చేస్తానని మండిపడ్డారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు.

**ఎల్ నినో కోవిడ్ లాంటి విపత్తు**

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కోవిడ్ తరహా విపత్తుగా పరిగణించి అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు సాధారణ సమస్యగా కనిపిస్తున్న పరిస్థితులు ముందస్తు చర్యలు చేపట్టకపోతే తీవ్ర సంక్షోభంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితులు ఎంతకాలం కొనసాగుతాయో చెప్పలేమని, మళ్లీ వానలు వచ్చే వరకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాల్సిందేనన్నారు. వచ్చే జూన్ వరకు ప్రతి శాఖ పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చర్యలు**

వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. పశువులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి మండలానికి ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు**

ఎల్ నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్1, గ్రూప్2 స్థాయి అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంటలు, పశుగ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలని సూచించారు. సంబంధిత మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి నివేదించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**గ్రామసభలు, కళాజాతలతో ప్రజల్లో అవగాహన**

ఎల్ నినో ఒక విపత్తని, దీని ప్రభావం, రాబోయే సంక్షోభ పరిస్థితులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. దసరా తర్వాత దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాజాతల ద్వారా ప్రజలకు ఎల్ నినో ప్రభావాన్ని వివరించాలని, నీరు, విద్యుత్ పొదుపుతో పాటు రాబోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు ఈ విపత్తు తీవ్రతను వివరించాలని ఆదేశించారు. మళ్లీ వర్షాలు వచ్చే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

గాంధీ భవన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు గాంధీ భవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌కుమార్ గౌడ్ తన సతీమణితో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ పూజలు నిర్వహించారు. మంత్రి సీతక్క, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తదితరులు పాల్గొని మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ మహిళలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి సంవత్సరం ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరికీ ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే పండుగ అని అన్నారు. పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. ఆస్తులు, పదవులు శాశ్వతం కావని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను, చెరువులను ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతోందన్నారు. దేశవిదేశాల్లోని తెలంగాణ మహిళలు సైతం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు, ఆటలతో సందడి చేశారు. మహిళల కోలాహలంతో గాంధీ భవన్ పండుగ శోభను సంతరించుకుంది.

జంతర్ మంతర్‌లో కార్యక్రమాలను నిషేధించడం

## ప్రజాస్వామ్యంపై గొడ్డలిపెట్టు : ఐఎఎల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దశాబ్దాల నుండి ప్రజల నిరసనను తెలియజేసే ఉద్యమ వేదిక ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో కార్యక్రమాలను నిషేధించడం ప్రజాస్వామ్యంపై గొడ్డలిపెట్టు వంటిదని ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ ఖండించారు. ఇటీవల 'సర్'లో అవకతవకలు, సిఈసి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని ప్రజాస్వామ్య పద్ధతులలో నిరసన చేపడుతున్న ప్రజా సంఘాలు, విపక్ష పార్టీల నిరసన కార్యక్రమాలు చేస్తున్న న్యాయవాదులు, మేధావులు, యువజన, విద్యార్థులపై పోలీసులు, ప్రైవేట్ వ్యక్తులు చేసిన దాడులు, నియంతృత్వ దాడులను ప్రేరేపిస్తున్నారని, దాడులకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్న వారు, 'సర్' ప్రక్రియలో తొలగించిన అర్హులైన ఓటర్లకు బేషరతుగా ఓటు హక్కును కల్పించాలని, ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హులైన వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.

## నాలుగేళ్ళు గడచినా న్యాయం జరగలేదు

అంకితా భండారి తల్లిదండ్రులకు రాహుల్‌గాంధీ సంఘీభావం



**న్యూఢిల్లీ :** తమ కుమార్తెకు న్యాయం చేయాలని కోరుతూ న్యూఢిల్లీ ఇండియా గేట్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న అంకితా భండారీ తల్లి తండ్రులను కాంగ్రెస్ నాయకుడు,లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బుధవారం కలుసుకున్నారు.వారికి తన సంఘీభావం ప్రకటించారు.ఆయనతోపాటు ఆయన సోదరి,కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి,లోక్‌సభ ఎంపి ప్రియాంకా గాంధీ వాద్రా,ఇతర కాంగ్రెస్ నాయకులు కూడా వారిని ఊరడించారు. వారి ఆవేదనలో సోదరీసోదరులిద్దరూ పాలు పంచుకున్నారు.ఉత్తరాఖండ్‌లోని ఒక రిసార్ట్‌లో ఉద్యోగం చేస్తున్న అంకితా భండారీ 2022లో హత్యకు గురైంది.ఆమె హత్యతో బిజెపి నాయకుడు దుష్యంత్ కుమార్ గౌతమ్‌కు సంబంధం ఉందని భండారీ తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఇండియా గేట్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారంనాడు గౌతమ్‌ను సిక్కిం రాష్ట్ర గవర్నర్‌గా నియమిస్తూ ఉత్తర్వు జారీ చేశారు.ఈ కేసులో సిబిఐ దర్యాప్తు పూర్తయ్యేవరకూ ఈ నియామకాన్ని నిలిపి ఉంచాలని అంకితా భండారీ తల్లిదండ్రులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇంతకుముందు ఆగస్టునెలలో కూడా భండారీ తల్లిదండ్రులతో రాహుల్‌గాంధీ సమావేశమై వారి సమస్య తెలుసుకున్నారు.నాలుగు సంవత్సరాలు గడచిపోయినప్పటికీ అంకితా భండారీ తల్లిదండ్రులకు న్యాయం జరగలేదని,వారు న్యాయంకోసం ఎదురుచూస్తున్నారని అయన అన్నారు.అంకితాభండారిపై జరిగిన నేరం,హత్య ఎంతమాత్రం క్షమించరానిదని అన్నారు.రిషికేశ్‌లోని ఒక రిసార్టులో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న అంకితా భండారీ 2022 సెప్టెంబరు 18వ తేదీన హత్యకు గురయ్యారు.హత్య జరిగిన నాలుగు రోజుల తర్వాత ఆమె మృతదేహం చిల్లా కెనాల్‌లో కనిపించింది.ఈ రిజార్టు యజమాని పులకిత్ ఆర్య బిజెపి మాజీ నాయకుడు వినోద్ ఆర్యా కుమారుడు.పులకిత్ ఆర్యతోపాటు అతడి మరో ఇద్దరు సహచరులు కలిసి అత్యాచారం చేసి ఆమెను హత్య చేశారు.ఈ కేసులో నిందితులైన ఆ ముగ్గురికీ జీవితకాల జైలుశిక్ష పడింది. ఐతే ఒక గుర్తు తెలియని ప్రముఖుడికీ ఈ నేరానికీ సంబంధం ఉందన్న ఆరోపణలతో ఈ కేసులో రాజకీయ కోణం వెలుగుచూసింది.ఆ ప్రముఖుడిని దృష్టిలో పెట్టుకుని ఈ కోణంలో కేసు దర్యాప్తు చేయాలని అంకితా భండారీ తల్లి దండ్రులు డిమాండ్ చేశారు. ఉన్నతస్థాయిలో సంబంధాలున్న ఈ నేరం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఉత్తరాఖండ్ వ్యాప్తంగా అంకితా భండారీకి మద్దతుగా నిరసన ప్రదర్శనలు ఆనాడు జరిగాయి.

## ఇండో జపాన్ స్నేహబంధానికి కళలు వారధి

స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళా ప్రదర్శనను సందర్శించిన మంత్రి వివేక్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కళలు, సంస్కృతి దేశాల మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేస్తాయని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ కళాకారుడు వెంకట్ గడ్డం, జపాన్ కళాకారిణి హిరోకో తకయామా సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇండోజపాన్ కళా ప్రదర్శనను బుధవారం ఆయన సందర్శించారు. ప్రదర్శనలోని పెయింటింగ్స్, వస్త్రాలపై రూపొందించిన కళాకృతులను వీక్షించి కళాకారులను అభినందించారు. భారతీయ, జపనీస్ కళా సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల జపాన్‌లోని హిరోషిమా, మియోషి నగరాల్లోనూ ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. చిన్ననాటి నుంచే కళారంగంలో ప్రతిభ కనబరిచిన వెంకట్ గడ్డం, తన చిత్రాల్లో సంతోషం, బాధ వంటి విభిన్న భావోద్వేగాలను ప్రతిబింబిస్తున్నారన్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. జపాన్ కళాకారిణి హిరోకో తకయామా భారతీయ కళాకారులతో కలిసి ప్రదర్శనలో పాల్గొనడం సాంస్కృతిక మార్పిడికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బుద్ధుడి ఆలోచనలు, స్ఫూర్తితో రూపొందించిన కళాకృతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని మంత్రి తెలిపారు. కళలకు భాష, దేశ సరిహద్దులు అడ్డుకావని, సృజనాత్మకత, భావోద్వేగాల ద్వారా ప్రజలను అనుసంధానించవచ్చని అన్నారు. కళాభిమానులు ప్రదర్శనను సందర్శించి కళాకారుల ప్రతిభను ఆస్వాదించాలని కోరారు. అనంతరం కళాకారులతో ముచ్చటించి ఇండోజపాన్ కళా సంబంధాలపై చర్చించారు.



డిజిపి కార్యాలయంలో

## వైభవంగా బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ అన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను, రాష్ట్ర ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును చాటిచెప్పే బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొని, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. చిన్నతనంలో అమ్మమ్మ ఇంట్లో బతుకమ్మ ఆడిన రోజులను గుర్తుచేసుకున్నారు. దేశవ్యాప్తంగా దసరా పండుగను వివిధ సంప్రదాయాలతో జరుపుకుంటారని, గుజరాత్‌లో దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తే, తెలంగాణలో గౌరమ్మను పూజిస్తూ బతుకమ్మను జరుపుకోవడం విశిష్టమైన సంప్రదాయమని వివరించారు. బోనాలు, బతుకమ్మ పండుగలు తెలంగాణ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, ప్రకృతితో మానవ సంబంధాన్ని చాటిచెప్పే వేడుక అని డిజిపి పేర్కొన్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. డిజిపి కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని చెబుతూ రాష్ట్ర ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.డిజిపి కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో డిజిలు మహేష్ భగవత్, స్వాతి లక్రా, ఎడిజి అకున్ సబర్వాల్, ఐజిలు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్ నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకలు కార్యాలయంలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

## గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతో పాటు, 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్–2026'లో పాల్గొని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్–2026'కు మంత్రి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌కు అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహం అందించడంతో పాటు వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌లో ఐటి, సాంకేతిక రంగాలను మరింత విస్తరిస్తూనే, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తయారీ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ఐటి, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌తో పాటు కృత్రిమ మేధ (ఎఐ), ఏరోస్పేస్, రక్షణ రంగం, అధునాతన తయారీ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో తెలంగాణ దేశ ఆర్థికాభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెట్టుబడుల విస్తరణకు, కొత్త వ్యాపార అవకాశాల అన్వేషణకు తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో ప్రభుత్వంతో కలిసి ముందుకు రావాలని కోరారు.

## డిజిపితో అమెరికా కాన్సుల్ జనరల్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసు శాఖ అధిపతి డిజిపి సి.వి. ఆనంద్‌తో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో అమెరికా కాన్సులేట్‌కు చెందిన భద్రతా విభాగాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. లారా విలియమ్స్‌తో పాటు రీజినల్ సెక్యూరిటీ ఆఫీసర్ సిద్ధార్థ్ రామచంద్రన్, సీనియర్ ఫారిన్ సర్వీస్ నేషనల్ ఇన్వెస్టిగేటర్ (ఎఫ్ఎస్ఎన్ఐ) వెంకట్ ఎంగిరేకుల ఈ భేటీలో పాల్గొన్నారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం మర్యాదపూర్వకంగా సాగింది.

## తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో రూ.129.85 కోట్ల ఆస్తులు జప్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) భారీ చర్యలు చేపట్టింది. భోలేబాబా ఆర్గానిక్ డెయిరీమిల్క్, శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, సుకృతి ఫుడ్స్ సంస్థల ప్రమోటర్లు, వారి కుటుంబ సభ్యులు, ఇతర సంబంధిత వ్యక్తులకు చెందిన రూ.129.85 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు జప్తు, స్వాధీనం, బ్యాంకు నిల్వల నిలిపివేత సహా మొత్తం రూ.132.55 కోట్ల విలువైన ఆస్తులపై చర్యలు తీసుకున్నట్లు ఇడి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి మనీలాండరింగ్ దర్యాప్తు ప్రారంభించింది. టిటిడికి సుమారు రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో గుర్తించామని వెల్లడించింది. రిఫైన్డ్ పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, పామోలిన్‌తోపాటు పలు రసాయనాలను కలిపి నెయ్యి తయారు చేసి సరఫరా చేసినట్లు ఆరోపించింది. అసలు లావాదేవీలను కప్పిపుచ్చేందుకు బోగస్ కొనుగోళ్లు, అమ్మకాలు చూపించి, బ్యాంకు లావాదేవీల ద్వారా చెల్లించిన మొత్తాలను హవాలా మార్గంలో నగదుగా వెనక్కి తీసుకున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది జూన్ 3న ఆరు రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన ఇడి, రూ.2.7 కోట్ల నగదు, బ్యాంకు నిల్వలను నిలిపివేయడం చేసింది. భోలేబాబా సంస్థ ప్రమోటర్ విపిన్ జైన్, సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాశ్ చంద్ర మంగ్లాలను ఇప్పటికే అరెస్టు చేసినట్లు వెల్లడించింది. కేసులో అక్రమ లావాదేవీలు, ఇతరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది.

## ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు భారీ ప్రణాళిక

నవీన్ నికోలస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను సమూలంగా మార్చి, విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు, సమ్మిళిత వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.7 లక్షల మంది విద్యార్థులకు అత్యున్నత నాణ్యమైన విద్య, సదుపాయాలు అందించే లక్ష్యంతో రూ.24,000 కోట్ల భారీ వ్యయంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నామని, ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఎఐఐబి) భాగస్వామ్యంతో రూ. 7వేల కోట్ల అభివృద్ధి పనులు, డిజిటల్ తరగతులు, శానిటేషన్ సంతృప్తతను సాధిస్తున్నామన్నారు. హైదరాబాద్, ఖైరతాబాద్‌లో ఆర్థిక, గణాంకాల డైరెక్టరేట్ (డిఇఎస్) కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రణాళిక విభాగం, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా 'పాఠశాలల మౌలిక వసతుల ద్వారా విద్యార్థుల అభ్యసనం, సమ్మిళిత విద్యా వాతావరణం, క్షేమంపై పడే ప్రభావం'అంశంపైన ఉన్నత స్థాయి సదస్సును నిర్వహించాయి. పాఠశాలల్లోని లోపాలను గుర్తించడం,శాఖల మధ్య సమన్వయం సాధించడం, కాలపరిమితితో కూడిన పక్కా కార్యాచరణను రూపొందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. సదస్సునుద్దేశించి నవీన్ నికోలస్ మాట్లాడుతూ ఎఐఐబి భాగస్వామ్యంతో రూ. 7,004.92 కోట్ల అర్బన్ ప్రాజెక్టుకు (క్యూర్) రూ. 1,234.53 కోట్ల పరిపాలనా అనుమతులతో 16 ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌కు, 17 ప్రస్తుత పాఠశాలల ఆధునికీకరణ, 164 పట్టణ పాఠశాలల్లో 501 తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. రాష్ట్రంలోని మొత్తం 630 మండలాల్లో ఒక్కో మోడల్ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టిపిఎస్) ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ మీరా షేక్ మాట్లాడుతూ సమగ్ర డేటా ఆధారంగా పాఠశాలల్లో వసతుల కొరతను పరిష్కరించాలని సూచించారు. ఈ సదస్సులో ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్ జి. రమేష్ ,యూనిసెఫ్ నిపుణులు శేషగిరి, కౌశిక్ గంగూలీ,సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్లు పి. మదన్‌మోహన్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## టిజిఎస్‌పిడిసిఎల్‌కు నాలుగు అంతర్జాతీయ నాణ్యతా గుర్తింపులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్ పంపిణీ రంగంలో నాణ్యతా ప్రమాణాల అమలు, సమాచార భద్రత, స్టోర్స్ నిర్వహణ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టిజి ఎస్‌పిడిసిఎల్ ) మరో కీలక మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా టిజి ఎస్‌పిడిసిఎల్‌కు నాలుగు నాణ్యతా గుర్తింపులు లభించాయి. నాణ్యతా నిర్వహణకు సంబంధించి ఐఎస్ఓ 9001, సమాచార భద్రతకు ఐఎస్ఓ 27001, స్టోర్స్ నిర్వహణలో జపనీస్ 5 ఎస్ విధానం, వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నందుకు క్వాలిటీ మార్క్ గుర్తింపులు దక్కాయి. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి. పాటిల్ నాలుగు గుర్తింపులను స్వీకరించారు. ఐఎస్ఓ ఆడిటర్ శివయ్య సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్. నర్సింహులు, కంపెనీ సెక్రటరీ అనిల్ కుమార్, చీఫ్ ఇంజినీర్ (రూరల్) బాలస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు. టిజి ఎస్‌పిడిసిఎల్ సంస్థలోని కార్యాలయాలు, వివిధ విభాగాల్లో నాణ్యతా నిర్వహణ విధానాలను సమర్థంగా అమలు చేయడం, రికార్డుల నిర్వహణ, అంతర్గత నియంత్రణ, పర్యవేక్షణ, కార్యాచరణ ప్రక్రియలను మెరుగుపరచడం, నిరంతర అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలకు సంబంధించి ఐఎస్ఓ 9001 గుర్తింపు దక్కింది. నాణ్యతను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, ప్రతి ప్రక్రియలో క్రమశిక్షణను, ప్రతి పనిలో జవాబుదారీతనాన్ని, ప్రతి సేవలో నిబద్ధతను పాటిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని మరింత పెంపొందించుకోవడమే సంస్థ ముందున్న లక్ష్యమని జితేష్ వి పాటిల్ తెలిపారు.

## వివాహితపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల శిక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ :** వివాహితను అపహరించి, అత్యాచారానికి పాల్పడటంతో పాటు ఆమె వద్ద ఉన్న ఆభరణాలను దోపిడీ చేసిన కేసులో నిందితుడికి నల్లగొండ మహిళా కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది.ఈ విషయాన్ని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో ఈ ఘటన చోటుచేసుకుంది. బానోత్ శ్రీను అలియాస్ చిన్నా (35) అనే నిందితుడు టాటా ఏస్ వాహనంలో భార్యాభర్తలను వారి గమ్యస్థానానికి తీసుకెళ్తుండగా ఈ నేరానికి పాల్పడ్డాడు. వారు దిగాల్సిన ప్రదేశం రాగానే భర్త వాహనం నుంచి దిగాడు. వెంటనే నిందితుడు వాహనం తలుపు మూసి,వివాహితను బలవంతంగా తనతో పాటు తీసుకెళ్లి అపహరించాడు.అనంతరం ఆమెను బెదిరించి అత్యాచారానికి పాల్పడటంతో పాటు ఆమె వద్ద ఉన్న ఆభరణాలను దోపిడీ చేసి మార్గమధ్యలో వదిలేసి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వాడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.విచారణ అనంతరం నల్లగొండ మహిళా కోర్టు కమ్ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం నిందితుడికి ఐపీసీ సెక్షన్ 366 కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా,సెక్షన్ 376 కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష,రూ.10 వేల జరిమానా,సెక్షన్ 392 కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది.మూడు సెక్షన్ల కింద మొత్తం శిక్ష 20 ఏళ్లు కాగా,మొత్తం జరిమానా రూ.20 వేలు. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు సాధారణ కారాగార శిక్షను కూడా అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు.

# కాంగ్రెస్ పరిపాలనలో కుంభకోణాల కుంభమేళా

బొగ్గు ఉత్పత్తి తగ్గించారు - కరెంటు లేకుండా చేశారు

కోల్ మాఫియా నుంచి సంస్థను కాపాడేది కెసిఆర్ ఒక్కరే

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్




**ప్రజాపక్షం/గోదావరిఖని :** నూట ముప్పై ఏళ్ల చరిత్ర గల సింగరేణి సంస్థను, కార్మికుల కష్టాన్ని, త్యాగాన్ని రాష్ట్రంలోని దండుపాళ్యం ముఠా దోచుకుంటుందని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కాంగ్రెస్‌పై తీవ్రంగా ఆరోపించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో బిఆర్ఎస్, టిజిబికెఎస్ ఆధ్వర్యంలో జరిగిన సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగ సభలో బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడం వల్లనే రాష్ట్రంలో నేడు కరెంటు కోతలు ఏర్పాడ్డాయని చెబుతూ, యాదాద్రి, కెటిపిఎస్, ఇతర ప్లాంట్లలో విద్యుత్తు ఉత్పత్తి లేకుండా చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. 24 గంటలపాటు నిరంతర కరెంటు సరఫరా ఇచ్చిన ఘనత కెసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ వచ్చింది..కరెంటు పోయింది.. అన్న మాట నిజమైందన్నారు. మోసపోతే గోస పడ్తరూ, ఆగం అయితరని ఆనాడు కెసిఆర్ చెప్పిన మాటలు ప్రజలు పెడచెవిన పెట్టడం వల్లనే నేడు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. సింగరేణికి రూ.60 వేల కోట్ల బకాయిలను ఎందుకు ఇవ్వడంలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని నిలదీస్తే అబద్ధం మాటలతో తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. 70 నుంచి 58 మిలియన్ టన్నులకు బొగ్గు ఉత్పత్తి పడిపోయిందని, దీనికి కాంగ్రెస్ పాలనే కారణమన్నారు. ఓపెన్‌కాస్టు గనుల టెండర్లు ఖరారు కాకపోవడానికి నేతల వాటాల పంచాయితీనే కారణమని విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డికి చెందిన సోధా కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరు ప్రస్తావిస్తూ సైట్ విజిట్ సరిఫికెట్ల పేరిట రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. డీజిల్, జిలిటెన్ స్టిక్స్, సోలార్, జైపూర్ పవర్ ప్లాంట్ కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. ఆధారాలు, రుజువులతో బిజెపి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. బిజెపి, కాంగ్రెస్ దొందూ దొందేనన్నారు. దీనికితోడు సింగరేణి సంస్థ, కార్మికుల సొమ్ముతో ఫుట్‌బాల్ సరదాలు తీర్చుకుంటున్నారన్నారు. కార్మికులకు చెందాల్సిన లాభాలు నేతల జేబుల్లోకి వెళ్లాయన్నారు. కేవలం రెండేళ్ల కాలంలో రూ.6,317 కోట్లు దాచి పెట్టి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇంత అవినీతి జరుగుతుంటే 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందన్నారు. సిబిఐతో, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. గులాబీ గర్జన గర్జిస్తేనే నేడు దసరా బోనస్ ప్రకటించారన్నారు. డిపెండెంట్లకు, కారుణ్య నియమాకాల మెడికల్ బోర్డు పెట్టి ఉద్యోగాలు ఇచ్చింది కెసిఆర్ అన్నారు. పోరాటాల పురిటిగడ్డ రామగుండం అని తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ వెంట సింగరేణి కార్మికలోకం తరలివచ్చిందన్నారు. సకలజనుల సమ్మెకు సింగరేణి కార్మికులు అండగా నిలబడ్డారన్నారు. సింగరేణి బతకాలంటే కెసిఆర్ ఒక్కరే బ్రహ్మాస్త్రమని, మళ్లీ ఆయన సిఎం కావాలన్నారు. కాగా, గోదావరిఖని స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాది మంది కార్మికులతోపాటు ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జగదీశ్‌రెడ్డి, టి.జీవన్‌రెడ్డి, గంగుల కమలాకర్, బాల్క సుమన్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్ రావు, సుంకె రవిశంకర్, నాయకులు కోలేటి దామోదర్, కౌశిక హరి, వ్యాళ్ల హరీష్‌రెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, మూల విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైవే హోటళ్లపై టిజి సేఫ్ పంజా

తనిఖీల్లో బయటపడ్డ పురుగులు, బొద్దింకలు,ఫంగస్ కూరలు..

దాబాల్లో దారుణాలు

జాతీయ రహదారిపై విషాహారం

7 హోటళ్ల లైసెన్స్ రద్దు,ఒకటి సీజ్

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలే : అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి



**ప్రజాపక్షం/నల్లగొండ :** టిజి సేఫ్ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ (డ్రగ్స్) కమిషనర్ అవినాష్ మహంతి ఐపిఎస్ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి 65పై గల పలు ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లు,ధాబాల్లో ప్రత్యేక ఆహార భద్రత తనిఖీలను విస్తృతంగా నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో తనిఖీలు చేపట్టారు.మొత్తం 10 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఈ డ్రైవ్‌ను విజయవంతం చేశాయి. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని క్యూర్ ప్రాంతానికి చెందిన అధికారులు, పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 60 మంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో అధికారులు, పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 60 మంది కలసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, నాణ్యత పరీక్షల నిమిత్తం 20 ఆహార నమూనాలను సేకరించారు.తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 7 సంస్థల ఆహార భద్రత లైసెన్సులను సస్పెండ్ చేశారు. కనీస లైసెన్స్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఒక హోటల్‌ను పూర్తిగా మూసివేశారు (సీజ్).నిరంతర పర్యవేక్షణ , మెరుగుదల కోసం 6 మెరుగుదల నోటీసులు,నిబంధనల ఉల్లంఘనలపై వివరణ కోరుతూ 6 షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**తనిఖీల్లో గుర్తించిన ప్రధాన లోపాలు :** ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి తెలిపారు. తనిఖీల సందర్భంగా వంటకాల్లో పురుగుల ఉనికి,బొద్దింకలు ఉండడం,అపరిశుభ్రమై న రిఫ్రిజిరేటర్లు, ఫంగస్ పట్టిన కూరగాయ లు, ఎలుకల విసర్జనలతో కలుషితమైన పదార్థాలను ఉన్నాయి అన్నారు. శాకాహార,మాంసాహార పదార్థాలను కలిపి నిల్వ చేయడం,ఐస్ ముక్కలను పచ్చి మాంసంతో ఉంచడం,జిడ్డు పట్టిన ఎగ్జాస్ట్‌లు, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలు వేయడం వంటి లోపాలను నమోదు చేశారు. ఆహార పదార్థాలపై తయారీ తేదీ, వినియోగ గడువు వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

## త్వరగా నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులు పూర్తి

కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రస్తుత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన నూతన కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులన్నీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రస్తుత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశ మందిరం, ప్రజావాణి సమావేశ మందిరం,వీసీ హాల్,మంత్రి, కలెక్టర్,అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్లు,ఉద్యోగులు, సిబ్బంది విభాగాలను కలెక్టర్ పరిశీలించి,అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, ఆర్ అండ్ బి ఎస్ఇ మోహన్, ఇఇ శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ అభిషేక్, ఎలక్ట్రికల్ డీఈ శృతి, సివిల్ డీఈ ఫణిజ,ఏఈ పుణ్య, ఏవో మోతిలాల్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## 'ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజన'కు ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న ఐదేళ్ల పాటు రూ 53,428 కోట్లతో 'ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజన'కు కేంద్ర కేబినెట్ ఆమోదించడం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు. దివ్యాంగుల పెన్షన్ అర్హతలను సడలించడం, సహాయ మొత్తాన్ని పెంచడం, మరింత మందిని పథకం పరిధిలోకి తీసుకురావడంతో సామాజిక భద్రతను విస్తరించే దిశగా మోదీ ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకున్నదని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం2016కు అనుగుణంగా పెన్షన్ అర్హతలను విస్తరించడం సంతోషకరమని, ఇప్పటి వరకు కనీసం 80 శాతం వైకల్యం ఉన్నవారికి వర్తించిన పెన్షన్‌ను, ఇకపై 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి కూడా వర్తించే విధంగా మార్పులు చేశారని, దివ్యాంగుల పెన్షన్‌ను 25 శాతం పెంచడం శుభపరిణామమని కిషన్ రెడ్డి తెలిపారు. వైకల్యంతో పుట్టిన చిన్నారి సంరక్షణ బాధ్యత మొదటి రోజు నుంచే కుటుంబంపై ఉంటుందని, అందుకే పెన్షన్ కోసం 18 ఏళ్లు వచ్చే వరకు వేచి ఉండాల్సిన నిబంధనను తొలగించామని, పుట్టినప్పటి నుంచే సహాయం అందేలా మార్పు చేశామని, చిన్నారికి 18 ఏళ్లు వచ్చే వరకు ఈ సహాయాన్ని తల్లిదండ్రుల ద్వారా అందుతుందని వివరించారు. ప్రస్తుతం 8.33గా ఉన్న దివ్యాంగుల పెన్షన్ లబ్ధిదారుల సంఖ్య 27.48 లక్షలకు పెరగనుందని, తద్వారా వార్షిక వ్యయం రూ.290 కోట్ల నుంచి రూ. 1,268 కోట్లకు పెరగనుందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే సహాయానికి అదనంగా, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ సొంత నిధులతో అందించే అదనపు పెన్షన్ సహాయం దీనికి వేరుగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కేంద్రప్రభుత్వ సామాజిక భద్రత పథకాల లబ్ధిదారుల సంఖ్య 7.28 లక్షలు కాగా తాజా మార్పులతో మరింతగా పెరగనుందన్నారు.

### వివేకా హత్య కేసులో..

## ఎంపి అవినాష్‌రెడ్డిని విచారించిన ఇడి

రూ.40 కోట్ల ఆర్థిక లావాదేవీలపై ఆరా..

మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి రూ.40 కోట్ల ఒప్పందం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఇడి ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించింది. ఈ వ్యవహారంలో నిధుల మూలాలు, వివిధ వ్యక్తుల ఖాతాల మధ్య జరిగిన బదిలీలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు చెల్లింపులు జరిగాయా అనే అంశాలను పరిశీలిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురిని ప్రశ్నించిన ఇడి.. దర్యాప్తులో భాగంగా అవినాష్‌రెడ్డికి నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి కూడా అక్టోబరు 13న హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మరుసటి రోజే అవినాష్‌రెడ్డిని విచారించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో నిధుల లావాదేవీలపై మరిన్ని వివరాలను సేకరించేందుకు దర్యాప్తు సంస్థ చర్యలు చేపట్టినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 2019 మార్చిలో పులివెందులలోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తుండగా, హత్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఇడి ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. తాజా విచారణలో అధికారులు సేకరించిన సమాచారం ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.

# అనుపమతో కలిసి నటించడం భయమేసింది




'క్రేజీ కల్యాణం' హీరో అఖిల్ రాజ్

డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న 'క్రేజీ కల్యాణం' సినిమా వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ సందర్భంగా హీరో అఖిల్ రాజ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేనెప్పుడూ మంచి కథలో, మంచి సినిమాలో నటుడిగా భాగం కావాలని కోరుకుంటాను. నా క్యారెక్టర్ నిడివి ఎంత అనేది చూసుకోను. ఈ సినిమాలో నా పాత్రకు ఎంత ఎనర్జీ, పర్ ఫార్మెన్స్ కావాలో అంత ఇచ్చాను. రౌడీ బాయ్స్ సినిమాలో అనుపమ హీరోయిన్ గా నటించింది. నేను చిన్న రోల్ చేశాను. రాజు వెడ్స్ రాంబాయి సినిమాతో నాకు గుర్తింపు రాకముందే క్రేజీ కల్యాణం సినిమాలో అనుపమతో హీరోగా నటించే అవకాశం కల్పించారు. ఇలాంటి మంచి చిత్రంలో నటించే అవకాశం రావడం కూడా సంతోషంగా ఉంది. అనుపమ పాత్రకు నేను ఎంత సపోర్ట్ గా నిలబడతాను అనేది సినిమాలో చూడండి. ఈ సినిమాకు రియల్ హీరో నరేష్. ఆయన క్యారెక్టర్ మా అందరి కంటే ఎడ్జ్ తీసుకుంటుంది. అనుపమతో కలిసి నటించడం మొదట్లో భయమేసింది గానీ తను ఇచ్చిన సపోర్ట్‌తో హాఫ్ డేలోనే కంఫర్ట్ గా ఫీలయ్యా. ప్రతి సీన్ చేసే ముందు నేను అనుపమ ఎవరెలా చేయాలనేది డిస్కస్ చేసుకునేవాళ్లం. మేము నటీనటులుగా కాకుండా ఆ క్యారెక్టర్స్‌లా చూసుకున్నాం. నేను ఏ సినిమా చేసినా వందశాతం ఎఫర్ట్స్ పెడతాను. రాజ్ వెడ్స్ రాంబాయిలో రాజు గా ఎంత ఇన్వాల్వ్ అయి నటించానో ఈ సినిమాలో ఉదయ్ పాత్రలోనూ అంతే హోమ్ వర్క్ చేసి పర్ ఫార్మ్ చేశాను. రాజు వెడ్స్ రాంబాయి లాగే ఈ చిత్రంలో కూడా పక్కింటి కుర్రాడి లాగే కనిపిస్తా. డిగ్రీ పూర్తి చేసుకున్న ఉదయ్ జీవితంలో గొప్ప స్థాయికి ఉదయ్ పాత్రను ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకుంటారు. ఉదయ్ అనే పాత్రలో ఒక ఎనర్జీ ఉంది. అది చాలా బాగుంటుందని నేను నమ్మాను.మనం ఒక లక్ష్యాన్ని నమ్మి కష్టపడి పనిచేస్తే తప్పకుండా రీచ్ అవుతామని నా లేదు. వాళ్ల సినిమాలు బిర్యానీ అయితే మా సినిమా స్వీట్ లాంటిది. పండక్కి ఎన్ని సినిమాలైనా ఆదరణ పొందుతాయి. నా నెక్ట్స్ మూవీ శనార్తి. శనార్తి రూటెడ్ కోర్ కల్ట్ సినిమా అవుతుందని నమ్ముతున్నా.

# 'కరికాల'లో గాయత్రి భరద్వాజ్




సందీప్ కిషన్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మాణంలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న చిత్రం 'కరికాల'. 'శంబాల' తర్వాత దర్శక, నిర్మాతలు మళ్లీ ఓ విజువల్ వండర్‌ను క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలోనే 'కరికాల' మూవీని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. 'కరికాల' మొదటి చాప్టర్ 2027 జూలై 2న , రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న విడుదల కాబోతోన్నట్టుగా మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లో సినిమాపై బజ్‌ను క్రియేట్ చేశాయి. రీసెంటుగా ఈ చిత్రం నుంచి కేథరిన్ థ్రెసా, సాక్షి మడోల్కర్ నటించనున్నట్టుగా ప్రకటించారు. తాజాగా ఈ సినిమాలో గాయత్రి భరద్వాజ్ కూడా ముఖ్య పాత్రను పోషించబోతోన్నారని మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు వెల్కమ్ ఆన్ బోర్డ్ అంటూ 'కరికాల' టీం స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది.వరల్ క్లాస్ టెక్నాలజీ, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్, అత్యద్భుతమైన కథనంతో 'కరికాల' పాన్ ఇండియన్ సినిమాగా రాబోతోంది. భారతీయ ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన సోషియోఫాంటసీ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా 'కరికాల' టీం పని చేస్తోంది. ఈ సినిమాకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 15న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరగబోతోన్నాయి. ఈ కార్యక్రమంలో అతిరథ మహారథులంతా పాల్గొని సందడి చేయనున్నారు.

# 'రణబాలి' పరిశ్రమ గర్వపడే సినిమా అవుతుంది

ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రశ్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ రశ్మిక మాట్లాడుతూ రణబాలి సెట్‌లో టీమ్ అంతా నెలలు నెలలు హార్డ్ వర్క్ చేసేవారు. నేను నా క్యారెక్టర్ పర్ ఫార్మ్ చేసేందుకు నాలుగైదు రోజులు షెడ్యూల్ కోసం వెళ్లాను. అలాంటి టైమ్ లో వాళ్లు చేసే హార్డ్ వర్క్ చూస్తే భయమేసేది. జయమ్మ అనే పాత్ర మీ మనసుల్లో ఉండిపోతుంది. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ సరిగ్గా 150 ఏళ్ల క్రితం సూపర్ ఎల్ నినో వచ్చింది. అదే గ్రేట్ మద్రాస్ ఫామైన్. ఆ టైమ్‌లో బ్రిటీషర్స్ చేసిన ఘోరాల వల్ల ఆ మహా కరువు 80 లక్షల మంది చావుకు కారణమైంది. ఒక సైకిల్‌లా ఆ ఎల్ నినో రిపీట్ అవుతున్నా, మనం మన పూర్వీకులు చూసిన బాధలు చూడకూడదు. అందుకే మనం నీళ్లు, కరెంట్, ఫుడ్ ను జాగ్రత్తగా వృథా చేయకుండా చూసుకోవాలి. సీఎం గారు చెప్పారంటే అది చాలా ముఖ్యమైన విషయం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించండి. ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు వెళ్లే దమ్ము మన ఇండియన్స్ లో ఉంది.



ప్రజాపక్షం
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

## జ్యుడీషియల్ కస్టడీ (మొదటి పేజీ తరువాయి)

అదుపులోకి తీసుకున్న దాస్, రంకాలు ఏడాది పాటు శాంతిభద్రతలను కాపాడతామని హామీ పత్రాలపై సంతకాలు చేశారని పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువత నేతృత్వంలోని సంస్థ, ఇతర సంస్థలు చేపట్టిన వరుస నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేయగా, సిజెపి నాయకులపై ఈ చర్య తీసుకున్నారు. తమ నేతలను జైలుకు పంపడంపై సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా మండిపడ్డారు. అసమ్మతిని అణచివేస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. అసమ్మతిని అణచివేయాలని అంతగా నిశ్చయించుకుంటే, ఈ పిరికి ఎత్తుగడల వెనుక దాక్కోకుండా, అధికారికంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించే ధైర్యం చేయండి అని దీప్కే ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మిలిటెంట్ పోరాటాలు (మొదటి పేజీ తరువాయి)

చేస్తూ బారికేడ్లలను ఛేదించుకొని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ శ్రేణుల మధ్య తోపులాటలు జరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం పోలీసులు నేతలను బలవంతంగా అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడంతో భారతదేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయిందని, పేదల ఓటు హక్కును నిరాకరించడానికి వ్యవస్థీకృతంగా ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న దొంగతనం అని తెలిపారు. సామాన్య ప్రజలకు ఓటు హక్కు, ప్రభుత్వాన్ని మార్చే అధికారం ఉండకూడదని దురుద్దేశంతోనే 'జ్ఞానీ చోర్' తో కలిసి మోదీ, షా కుట్రలు పన్ని ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వీరి దుర్మార్గమైన ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. దేశాన్ని రక్షించే వారే ఓటు దొంగలైతే దేశం అధోగతి పాలవుతుందని, పేదల ఓటు హక్కును హరిస్తే ఉరుకునేదిలేదని, తెల్లవాళ్లతో పోరాడాం, దేశ ఓటు దొంగలతో పోరాడతాం అని తెలిపారు. తక్షణమే ఎస్ఐఆర్ ప్రక్రియను అపి, సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. మర్రి శ్రీమాన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్రాలు ఓట్ల దొంగతనం ద్వారా ఏర్పడిన అక్రమ ప్రభుత్వాలని, ఈ ఓట్ల దొంగతనం వెనుక జ్ఞానేశ్ కుమార్ ప్రధాన సూత్రధారి అని ఆరోపించారు. బిజెపి ఎన్నికల సంఘాన్ని కాపాడుతోంది, ఎన్నికల సంఘం బిజెపిని కాపాడుతోందని తెలిపారు. ఎన్నికల అవకతవకలపై ప్రతిపక్షాల ఆరోపణలపై ప్రధాని మోదీకి సమాధానం ఇచ్చే ధైర్యం గానీ, సత్తా గానీ లేదన్నారు. దేశంలో ఓట్ల దొంగతనం అత్యంత తీవ్రమైన నేరం తామే చేశామని ఒప్పుకొని మోదీ, షా, జ్ఞానేశ్ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. భారత ప్రజల హక్కులను, ముఖ్యంగా ఓటు వేసే ఈ ప్రాథమిక హక్కును రక్షించేందుకు గల్లీ నుండి ఢిల్లీ వరకు విద్యార్థి, యువజనులను ఏకం చేసి బలమైన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నేర్లేకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకొని, విద్యా వ్యవస్థ, ఉపాధిని నాశనం చేసి, ఇప్పుడు బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని అంటిపెట్టుకుని ప్రజల ఓటు హక్కును నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్యాన్ని ఖుని చేసేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. ఓట్ల చోరీ దేశానికి ప్రమాదకరమని, ఎస్ఐఆర్ ను తక్షణమే అపి, బిజెపి ఏజెంట్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణకై మిలిటెంట్ పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ టి. సత్యప్రసాద్, పి. శివకుమార్, ఎఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు జి. నరేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఎస్. వంశీ వర్ధన్, లెనిన్, నెల్లి మహమ్మద్ అన్వర్, పవన్ కళ్యాణ్, ఆకాష్, జోసెఫ్ భాను, ఆంజనేయులు, మహేష్, శివ, హరీష్ పాల్గొన్నారు.

## విచారణ (మొదటి పేజీ తరువాయి)

దాదాపు దశాబ్దకాలంగా తొమ్మిది ఇడి ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఇడి అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.సిబిఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఇడి తన పిటిషన్‌లో పేర్కొంది. ఇడితో పాటు మాజీ మంత్రి హరిరామ జోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సిబిఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.







































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com